సమగ్ర సమాచార పత్రిక
www.mudranews.in

# ముద్ర


హైదరాబాద్
ఆదివారం, 12.04.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 170
పేజీలు: 12 వెల: రూ. 5

## ఢీ అంటే ఢీ

మంత్రి వర్సెస్ ఎంపీ 10




- మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ డీకే అరుణ మధ్య ప్రోటోకాల్ వార్
- అమృత్ పథకంలో భాగంగా కేంద్ర నిధులతో చెరువు పనులు అంటున్న అరుణ
- జనవరి 23న చెరువు సుందరీకరణ పనులకు మంత్రి శ్రీహరి భూమి పూజ
- ఎంపీ అరుణకు సమాచారం ఇవ్వని మంత్రి శ్రీహరి
- ఎంపీ లేకుండానే భూమి పూజ
- జిల్లాలో హాట్ టాపిక్ గా మారిన మంత్రి, ఎంపీ వాగ్వాదం

## హైడ్రా.. ప్లస్సా..


# మైనస్సా?


**ముందున్నాయి గ్రేటర్ ఎన్నికలు**

- మళ్లీ దూకుడు పెంచిన హైడ్రా
- లాభమే అంటున్న ఓ వర్గం
- కలిసి వస్తుందంటున్న విపక్షం
- కాంగ్రెస్ లో కొంత కలవరపాటు
- అవసరం లేదంటున్న సీఎం

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల తరహా ఎన్నికలకు సమయం ఆసన్నమవుతోంది. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ లోని ఓ వర్గం మాత్రం కొంత కలవరపడుతోంది. హైడ్రా దూకుడు రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో ఎలాంటి కష్టాలు తెస్తుందోనని కాంగ్రెస్ నేతలు కంగారు పడుతున్నారు. అయితే ప్రభుత్వ పెద్దలు, ఇంకో వర్గం మాత్రం ప్లస్ అవుతుందని బుజ్జగిస్తున్నారు. ఇదే సమయంలో బీఆర్ఎస్, బీజేపీ మాత్రం తమకు కలిసి వస్తుందనే ఆశల్లో ఉంటున్నారు. హైదరాబాద్ రాజకీయాల్లో ప్రస్తుతం హైడ్రా ప్రకంపనలు సృష్టిస్తోంది. అయితే, ఈ కూల్చివేతల పర్వం కేవలం ఆక్రమణలకే పరిమితం కాకుండా, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై ఎలాంటి మిగతా 02లో




## బిల్స్

- బడ్జెట్ నాటికి రూ. 60 వేల కోట్లు
- అప్పులు తెచ్చి సాగుతున్న సర్కారు

# పెండింగ్

- ప్రతి శాఖలోనూ గుట్టలుగా బకాయిలు
- అయోమయంలో ప్రభుత్వం

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

ఏ శాఖను కదిలించినా ఒక్కటే సమాధానం. బిల్లులు రావడం లేదు.. ఖజానాలో పైసల్లేవు. పాత బిల్లులన్నీ పేరుకుపోయాయి. కేవలం నెలల వ్యవధిలోనే బకాయిలు పేరుకుపోతున్నాయి. కిందటి నెల వరకు రూ. 50 నుంచి రూ. 60 వేల కోట్ల వరకు ఉన్న బాకీలు.. ఇప్పుడు లక్ష కోట్లకు చేరాయి. ఆదాయం లేక ప్రభుత్వ ఖజానా కొట్టుమిట్టాడుతుంది. ఏం చేయాలన్నా అప్పులే. అప్పు వస్తేనే బిల్లు వచ్చేది. తాజాగా రిటైర్డ్ ఉద్యోగులు కోర్టు మెట్లు ఎక్కారు. పెండింగ్ బిల్స్‌పై హైకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆర్థిక శాఖ ఉన్నతాధికారులను కోర్టులో నిలబెట్టింది. అయినా.. ఎవరేం చేయలేని పరిస్థితి. ఎందుకంటే సర్కారు దగ్గర చిల్లిగవ్వ లేదు. దీంతో రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాలన తీరుపై విమర్శల వెల్లువ క్రమక్రమంగా పెరుగుతున్నది. ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, కాంట్రాక్టర్లు ఇలా.. అనేక వర్గాలకు బకాయిలు దీర్ఘకాలంగా పెండింగ్‌లోనే ఉంటున్నాయి. ఈ మొత్తం బకాయిలు లక్ష కోట్ల వరకూ చేరిందని అధికారవర్గాల అంచనాల ప్రకారం తెలుస్తున్నది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంత వరకూ చెల్లించింది సుమారు 15వేల కోట్ల నుంచి 20వేల కోట్ల వరకూ ఉంటుందని అంటున్నారు. దీనికి తోడు ప్రతి నెలా బకాయిలు గుట్టలుగా పేరుకుపోతున్నాయి. కొత్తగా పేరుకున్న బకాయిలు 20వేల కోట్ల పైమాటేనని చెబుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే.. ఈ బకాయిల గుట్టలు పర్వతాలను తలపిస్తాయంటున్నారు. కీలకమైన ఈ వ్యవహారంలో సీఎం, డిప్యూటీ సీఎం వ్యవహారంపై ప్రభుత్వ మిగతా 02లో

## బీఆర్ఎస్ ఆఫర్లకు లొంగలేదు

- అందుకే నేడు క్యాబినెట్‌లో మంత్రి అయ్యాను
- జీవన్ రెడ్డిపై మంత్రి మరో మారు ఫైర్
- కష్టపడిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తాం
- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..

03




## ముహూర్తం ఫిక్స్

జగిత్యాలలో 20న కేసీఆర్ బహిరంగ సభ
అదే రోజు చేరనున్న జీవన్ రెడ్డి 09



- సుమారు లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు
- పార్టీకి బూస్టింగ్ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్న బాస్
- సభా స్థలాలను పరిశీలించిన నాయకులు

## ఫ్రెండ్లీగా మోడీ–రాహుల్..

09

పార్లమెంట్‌లో అరుదైన దృశ్యం

- ఆత్మీయంగా ముచ్చటించిన మోదీ-రాహుల్
- విభేదాలు పక్కన పెట్టి మాట్లాడుకున్న నేతలు



## శ్మశానంలో వీడని బంధం..

### ఆ పాము వైష్ణవినేనా?

03

- లవ్ మ్యారేజ్ తర్వాత హింస
- ప్రాణాలు కోల్పోయిన యూట్యూబర్ వైష్ణవి
- పాము రూపంలో తిరుగుతోందా?



*లక్షలాది మందిని తన మాటలతో నవ్వించిన ఆ పెదవులు.. ఇప్పుడు శాశ్వతంగా మూతపడ్డాయి. ఉత్సాహానికి నిలువుటద్దంలా నిలిచిన ఆ జీవితం, ప్రేమ పేరుతో జరిగిన వంచనకు బలైపోయింది. కన్నవారిని కాదని, నమ్మిన వాడే లోకమని వెళ్లిన ఆ చిన్నది.. చివరకు శవమై తిరిగి వస్తుందని ఎవరూ ఊహించలేదు. కానీ, మరణించినా తన కుటుంబంపై మమకారం చావలేదో ఏమో.. తాను బూడిదైన చోటే పాము రూపంలో దర్శనమిస్తూ కన్నవారికి కడుపుకోత మిగుల్చుతోంది. వైష్ణవి మరణం కేవలం ఒక ప్రాణం పోవడం కాదు.. ఒక నమ్మకం చితిపై తగలబడటం..* **-ముద్ర డెస్క్**

## అబ్కారీలో అంతర్యుద్ధం




- ఎక్సైజ్ కమిషనర్ బూతు పురాణం
- రాజీనామాకు సిద్ధమైన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్
- కమిషనర్ వైఖరితో గుండెపోటు

03

## నేడు ఇంటర్ ఫలితాలు

- ఒక్క క్లిక్ తోనే ఆన్ లైన్ లో అందుబాటులో
- ఈ సారి వాట్సాప్ లో అందుబాటులో తెచ్చిన సర్కార్
- వెబ్ సైట్ తో పాటు వాట్సాప్ లో
- స్మార్ట్ ఫోన్ 80969 58096 లో..

09




## ఫార్మా సిటీ పేరుతో సీఎం భూ దందా

- ఫ్యూచర్ లేని నాయకుడు ఫ్యూచర్ సిటీ కడతానంటున్నడు
- 14వేల ఎకరాల ఫార్మా సిటీ భూములు రైతులకు ఇవ్వకుండా మోసం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

03



## పదవి ఉంటుందా? ఊడుతుందా?

**అయోమయంలో మంత్రి అజారుద్దీన్**

- నిబంధనల ప్రకారం 6 నెలల్లోగా చట్టసభకు ఎన్నికవ్వాలి
- ఇప్పట్లో ఎమ్మెల్సీ అయ్యేందుకు అనుకూలించని పరిస్థితులు
- రాజీనామా చేసి, మళ్లీ మంత్రిగా ప్రమాణం చేసే అవకాశం



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్ర మైనారిటీ సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్ తన పదవికి ఈ నెలాఖరుకు రాజీనామా చేసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. మంత్రిగా రాజీనామా చేస్తున్నారంటూ తెలంగాణ సచివాలయంలో ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. గాంధీ భవన్‌లో నలుగురు నాయకులు కలిసిన చోట కూడా ఇదే అంశంపై ప్రస్తావించుకుంటున్నారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత ఆరు నెలల వ్యవధిలో సదరు మంత్రి.. ప్రజా ప్రతినిధిగా ఎన్నిక కావాల్సి ఉంటుంది. అజారుద్దీన్ విషయంలో ఆ గడువు ఏప్రిల్ నెలాఖరుతో తీరనుంది. ఈ నేపథ్యంలో అందరి దృష్టి అజారుద్దీన్, సీఎం నిర్ణయంపై కేంద్రీకృతమైంది. మిగతా 02లో



## 220 కొట్టినా.. ఓటమా?

**సన్ రైజర్స్ హైదరాబాద్‌కు కష్టమే**

హైదరాబాద్ లొంగిపోయింది..

- బౌలర్ల వైఫల్యం మళ్లీ బహిర్గతం
- బ్యాటింగ్ దుమ్మురేపినా.. బౌలింగ్ చేతులెత్తేసింది
- వరుస ఓటములతో కష్టాల్లో ఎస్ఆర్‌హెచ్
- పంజాబ్ దూకుడు ముందు

11

- శ్రేయస్ అయ్యర్ కెప్టెన్ ఇన్నింగ్స్ తో ఎస్ఆర్‌హెచ్ పై పంజాబ్ ఘన విజయం
- పాయింట్ల పట్టికలో దిగజారిన హైదరాబాద్..

## ప్రపంచ ఫ్యాషన్‌కు కొత్త దిశ

Sunday Special




ఒక తెగ స్వాభిమాన కళ..

04

*నాగరికత పేరిట లోకం రంగులు మార్చుకుంటున్న వేళ.. తమ మూలాలను వదలకుండా, ముతక నూలుపై ముత్యాల వంటి అల్లికలను అద్దిన సంచార యోధులు వారు. అడవి పూల సౌందర్యాన్ని, ఆకాశంలోని నక్షత్రాల మెరుపులను ఒడిసిపట్టి వస్త్రంపై ప్రతిబింబించే అపురూప కళాకారులు బంజారా మహిళలు. వారు ధరించే 'గాగ్రా' కేవలం ఒక వస్త్రం కాదు.. అది తరాల చరిత్రకు నిలువుటద్దం.. శ్రమకు అలంకార రూపం.. అన్నింటికీ మించి ఆత్మగౌరవ ప్రతీక. ఒకప్పుడు కేవలం తండాలకే పరిమితమైన ఈ అద్దాల మెరుపులు.. నేడు సరిహద్దులు దాటి గ్లోబల్ ఫ్యాషన్ ర్యాంప్‌లపై 'ట్రెండ్ సెట్టర్'గా నిలుస్తున్నాయి. అల్లికల్లోని ప్రతి దారం ఒక కథను చెబుతుంది.. ప్రతి అద్దం ఒక సంస్కృతిని ప్రతిబింబిస్తుంది. గవ్వల గలగలలు.. రంగుల హరివిల్లులతో నిండిన బంజారా 'పేటియా' ప్రయాణం.. అట్టడుగు పల్లె నుంచి అంతర్జాతీయ వేదికల వరకు ఎలా సాగిందో తెలిపే ఈ "ఆదివారం ప్రత్యేక కథనం" ఇది.*

## ఇదీ మా ముద్ర

రాజకీయాలు చేసి చేసి విసిగొచ్చేసింది.. ఇక మీడియా రంగంలోకి దిగిన విజయసాయిరెడ్డి.. ఈసారి ఏ పార్టీకి సపోర్ట్ అబ్బా?



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 12.04.2026
www.mudranews.in | @mudranews



## లేఆఫ్స్ : అత్యవసర నిధి సిద్ధం చేసుకోండి



కనీసం 6 నెలల ఖర్చులకు సరిపడే డబ్బు విడిగా ఉంచుకోవాలి. ఇది ఉద్యోగం పోయిన సమయంలో మీకు పెద్ద అండగా ఉంటుంది.

# బిల్స్ పెండింగ్






(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులు, విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమకు పెండింగ్ బకాయిలు చెల్లించకుండా ఆర్థిక శాఖ ముప్పుతిప్పలు పెడుతున్నదని ఉద్యోగులు రగిలిపోతున్నారు. పదవీ విరమణ ప్రయోజనాల కోసం చెప్పులు అరిగేలా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పైసా విదల్చడం లేదని రిటైర్డు ఉద్యోగులు గోసపడుతున్నారు.

**ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులకే**

**15వేల కోట్లు**

ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగులకు ఇప్పటి వరకు రూ.6వేల కోట్ల వరకు పెండింగ్ బకాయిలు చెల్లించారు. ఇంకా చెల్లించాల్సినవి రూ.15వేల కోట్ల వరకు ఉన్నాయని ఆ సంఘాల నాయకులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. డీఏ పెండింగ్ బకాయిల కోసం ఉద్యోగులు కళ్లల్లో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తున్నా ఆర్థిక శాఖ మంత్రి కనికరించే పరిస్థితిలో లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు, రిటైర్డు ఉద్యోగుల బకాయిల కోసం ప్రతి నెలా రూ.700 కోట్ల చొప్పున 2025 జూన్ నెల నుంచి ఆర్థిక శాఖ బిచ్చమేస్తోందని ఉద్యోగులు మండిపడుతున్నారు. రిటైర్ అయ్యి రెండు సంవత్సరాలు దాటినా పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఏళ్లుగా బకాయిలు పెండింగ్‌లో పెట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికే 61 మంది రిటైర్డు ఉద్యోగులు అకాల మరణం చెందారు. డబ్బులు లేకపోవడంతో తగిన చికిత్స చేయించుకోలేక కొందరు, మానసికంగా ఆందోళనకు గురై మరికొందరు, పెళ్లీడుకొచ్చిన పిల్లలకు పెళ్లిళ్లు చేయలేకపోతున్నామనే ఆవేదనతో మరికొందరు చనిపోయారని ఉద్యోగ సంఘాల నాయకులు చెబుతున్నారు. సీపీఎస్ ఉద్యోగులకు వాయిదాల ప్రకారం డీఏ బకాయిలు చెల్లించుకుంటూ పోవడం మూలంగా అంతకంతకూ బకాయిలు పెరుగుతునే ఉన్నాయి. ప్రతి నెలా ఉద్యోగులకు రూ. 700 కోట్లు విడుదల చేస్తూ తీపి కబురు, లక్షలాది మంది ఉద్యోగులకు శుభ వార్త అంటూ ప్రచార ప్రసార సాధనాల్లో ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని ఉద్యోగులు బహిరంగంగా విమర్శిస్తున్నారు. మా పైసలు మాకే చెల్లిస్తూ తీపి కబురు అని ప్రచారం చేస్తారా? అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీపీఎఫ్, లీవ్ సరెండర్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, మెడికల్ రీయింబర్స్‌మెంట్, టీజీఎల్ఐసీ వంటి బిల్లుల కోసం ప్రతి నెలా విడుదల చేస్తున్న రూ.700 కోట్లను.. రూ.1,500 కోట్లకు పెంచాలని డిమాండ్లు చేస్తున్నా డిప్యూటీ సీఎం ఏమాత్రం చెవికి ఎక్కించుకోవడం లేదని ఉద్యోగ, ఉపాధ్యాయ, రిటైర్డు ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ఇరిగేషన్ లో పైసలేవ్**

నీటిపారుదల శాఖలో చేసిన పనులకు రూ. 25వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని తెలుస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.4 వేల కోట్ల వరకు మాత్రమే చెల్లింపులు చేశారు. విద్యుత్ పంపిణీ సంస్థలకు రూ.5వేల కోట్ల వరకు చెల్లింపులు చేయగా, పెండింగ్‌లో రూ.20వేల కోట్ల వరకు ఉన్నాయి. ఉచిత విద్యుత్ పథకానికి ప్రతి బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తున్నప్పటికీ, ఆ నిధులను చెల్లించకుండా ఇతర పథకాలను మళ్లించడంతో పంపిణీ సంస్థలు కోలుకోలేని విధంగా తయారవుతున్నాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎత్తిపోతల పథకాల నిర్వహణకు సంబంధించిన కరెంటు బిల్లులు రూ.33 కోట్ల వరకు విద్యుత్ పంపిణీ సంస్థలకు చెల్లించాల్సి ఉన్నది. వీటికి 2026-27 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో రూ.22వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ నిధులు ఏ మూలకూ సరిపోవని, పూర్తయిన పనులకు కూడా చెల్లించడం కష్టమని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇక, గుంతలు పడిన రోడ్లను భవనాల శాఖలో నిధుల లేమి కారణంగా పూడ్చలేకపోతున్నారు. ఏ రోడ్డు చూసినా ఏమున్నది గర్వకారణం అనే విధంగా ప్రతి అడుగుకో గుంత కన్పిస్తున్నదని, వాహనాలను నడపలేకపోతున్నామని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు దాటుతున్నా గుంతలు పూడ్చకుండా కళ్లకు గంతలు కడుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఆర్‌అండ్‌బీ శాఖలో కాంట్రాక్టర్లు పూర్తి చేసిన పనులకు ఇంకా రూ.10వేల కోట్ల వరకు బకాయిలు ఉన్నాయని సమాచారం. పంచాయతీరాజ్ శాఖలో కూడా రూ. 8 వేల కోట్ల వరకు బిల్లులు ఆర్థిక శాఖలో పెండింగ్‌లో ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాలకు రోడ్లు వేసేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థలో ఏమైనా చిన్న మరమత్తులు తలెత్తినా చేసుకోలేకపోతున్నామని ఆ విభాగంలో పనిచేస్తున్న సిబ్బంది వ్యాఖ్యానిస్తున్నారంటే ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థమవుతున్నది. గ్రామ స్థాయిలో బిల్లులు ఎక్కువగా నిలిచిపోయాయని, తక్షణం పరిష్కరించాలని కోరుతున్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభించిన ప్రభుత్వం.. ఆ మేరకు ప్రతి నెలా ఆర్టీసీకి నిధులు విడుదల చేయడం లేదు. రూ.6వేల కోట్ల వరకు మహాలక్ష్మీ పథకం కింద ఆర్థిక శాఖ ఆర్టీసీకి బకాయి పడిందని ఆర్టీసీ అధికారులు చెబుతున్నారు.

**ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం**

**ఎదురుచూపులు**

విద్యాశాఖలో విద్యార్థులు ఫీజు బకాయిల కోసం ఎదురు చూపులు చూస్తున్నా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఏమాత్రం కనికరించడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. రూ.2,500 కోట్ల వరకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో పెట్టారని కాలేజీ యాజమాన్యాలు చెబుతున్నాయి. ఫలితంగా 2021-22 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో కళాశాల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా 2024-26 విద్యా సంవత్సరాలకు సంబంధించి బకాయిలు ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తున్నది. పెండింగ్ బకాయిల చెల్లింపు డిమాండ్‌తో గతేడాది నవంబర్ నెలలో ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు బంద్‌కు పిలుపునిచ్చాయి. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క కాలేజీ యాజమాన్యాలను చర్చలకు ఆహ్వానించి, తక్షణమే రూ. 600 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించడంతో బంద్ వాయిదా పడింది. మరో నెల రోజుల్లో రూ.300 కోట్లు విడుదల చేస్తామని హామీ ఇవ్వడంలో చర్చలు ఫలప్రదం కావడం, కాలేజీలు కొనసాగించారు.

**రావద్దు.. అడుగొద్దు**

అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో 2వ అంతస్తులో సందర్శకులను రానివ్వకుండా పోలీసులను మోహరించారు. ఆర్థిక శాఖ అధికారులతో మాట్లాడకుండా ఉండేందుకు, వారిని కలువకుండా నిరోధించేందుకు బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. ఎవరైనా సాహసం చేసి వెళ్తే పోలీసులు గల్లా పట్టుకుని బయటకు తోసివేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఇలాంటి వేధింపులు లేవని, ఇదెక్కడి కాంగ్రెస్ మార్క్ ప్రభుత్వం అని రిటైర్డు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు దుమ్మెత్తిపోస్తున్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా సంవత్సరాల తరబడి నాన్చుతూ వస్తున్నారు. అదేమంటే ఖజానాలో పైసలు లేవంటూ ప్రభుత్వ పెద్దలు నాటకాలాడుతున్నారని ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు మండిపడుతున్నారు. ఇలా ఏ ఒక్క వర్గాన్ని కదిలించినా ఆగ్రహాలు, ఆవేశాలు, ఆందోళనలు తప్పితే కాంగ్రెస్ పాలనలో ఏమీ లేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించి, నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రస్తుతం శాఖలు, వర్గాల వారీగా లెక్కేస్తే.. ఉద్యోగులు/పెన్షనర్లకు 15 వేల కోట్లు, ఇరిగేషన్ లో 25 వేల కోట్లు, విద్యుత్ సబ్సిడీలకు 18 వేల కోట్లు, ఆర్‌అండ్‌బీ బిల్లులు రూ. 8 నుంచి 10 వేల కోట్లు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి 8 వేల కోట్లు, విద్యా రంగంలో రూ. 8 వేల కోట్లు, వైద్యారోగ్యానికి రూ. 5 వేల కోట్లు.. ఇలా ప్రతి వర్గానికి ప్రభుత్వం అప్పు పడింది. ఇవన్నీ చెల్లించాలంటే లక్ష కోట్లు కావాలని ఆర్థిక శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

# పదవి ఉంటుందా? ఊడుతుందా?

(మొదటి పేజీ తరువాయి)

**జూబ్లీహిల్స్ నుంచి పోటీ.. ఓటమి**

మాజీ క్రికెటర్, హైదరాబాద్ వాసి అజారుద్దీన్ 2023లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్ చేతిలో ఓటమి పాలయ్యారు. గోపీనాథ్ అకాల మరణంతో జూబ్లీహిల్స్‌కు ఉప ఎన్నిక అనివార్యమైంది. మళ్ళీ ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసేందుకు అజారుద్దీన్ సన్నద్ధమయ్యారు. అయితే కాంగ్రెస్ పార్టీ ఈ నియోజకవర్గంలో గెలుపు గుర్రాల కోసం సర్వే నిర్వహించింది. ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే వరకు మూడు నాలుగు దఫాలు ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించగా ప్రస్తుత ఎమ్మెల్యే వీ నవీన్ యాదవ్ పేరు ప్రముఖంగా విన్పించింది. దీంతో ఆయన అభ్యర్థిత్వానికి కాంగ్రెస్ నాయకత్వం పచ్చ జెండా ఊపింది.

**మళ్లీ ఆశించి..**

**మంత్రి పదవితో సంతృప్తి**

జూబ్లీహిల్స్ టికెట్ ఆశించిన అజారుద్దీన్‌ను ఉప ఎన్నికకు ముందుగానే రాష్ట్ర మంత్రివర్గంలోకి తీసుకున్నారు. గతేడాది అక్టోబర్ 31న లోక్‌భవన్‌లో మంత్రిగా ప్రమాణం చేశారు. నవంబర్ 11వ తేదీన ఉప ఎన్నిక జరగ్గా, నవంబర్ 14వ తేదీన ఫలితాలు ప్రకటించారు. ఈ ఫలితాల్లో సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై నవీన్ యాదవ్ గెలుపొందారు. అజారుద్దీన్ కూడా నవీన్ యాదవ్ గెలుపు కోసం ప్రచారం నిర్వహించి, ముస్లిం ఓట్లు కాంగ్రెస్ వైపు వచ్చేలా చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపొందడంతో తనవంతుగా పని చేసినప్పటికీ ఆయనకు ఎమ్మెల్సీ అవకాశం దక్కలేదు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఉన్న దేవనపల్లి కవిత తన పదవికి రాజీనామా చేశారు. ఆమె రాజీనామాను ఈ ఏడాది జనవరి 6వ తేదీన శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదిస్తూ బులిటిన్ విడుదల చేశారు. ఈ నేపథ్యంలో మళ్లీ ఎన్నిక నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేస్తుందని మంత్రి అజారుద్దీన్‌తోపాటు కాంగ్రెస్ నాయకత్వం ఎదురు చూస్తూ వస్తున్నది. నిజామాబాద్ నుంచి లోకల్ అథారిటీ కోటాలో జిల్లా పరిషత్ సభ్యులు, మండల పరిషత్ సభ్యులు కవితను ఎమ్మెల్సీగా ఎన్నుకున్నారు.

**నోటిఫికేషన్ కోసం ఎదురుచూపులు**

దేశంలో ఏ రాష్ట్రంలో ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ వచ్చినా, తెలంగాణలో ఎమ్మెల్సీకి నోటిఫికేషన్ జారీ అవుతుందని రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం ఎదురు చూసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఆమె రాజీనామా చేసి మూడు నెలలు అవుతున్నా ఇంత వరకు ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీకాకపోవడం అజారుద్దీన్‌ను మరింత ఒత్తిడికి గురి చేస్తున్నదని అంటున్నారు. ఈ నెలాఖరుకు ఆయనకు ఉన్న గడువు తీరిపోనుండడంతో రాజీనామా చేసే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఇప్పటికిప్పుడు ఎన్నికల కమిషన్ కమిషన్ ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ ఇచ్చే పరిస్థితులు లేవని సచివాలయంలో అధికార వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అజారుద్దీన్ తన పదవికి ఈ నెలాఖరుకు రాజీనామా చేయవచ్చంటున్నారు. ఆ తరువాత ఢిల్లీ పార్టీ పెద్దలతో ఉన్న సత్సంబంధాలు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్న అనుబంధం బట్టి రెండోసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయవచ్చనే వాదన కూడా తెరమీదకి వచ్చింది. ఢిల్లీ పెద్దల నుంచి ఆశీస్సులు లేకపోయినా, ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడి సహకారం లేకపోయినా రెండోసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే పరిస్థితి ఉండకపోవచ్చనే చర్చ కూడా కాంగ్రెస్ వర్గాల్లో నడుస్తున్నది. రెండోసారి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారా అంటే అవుననే విధంగా పరిస్థితులు ఉన్నాయని సీనియర్ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారు. స్పష్టత రావడానికి మరో మూడు వారాల వరకు వేచి చూడాల్సి ఉంటుందంటున్నారు.

**అప్పుడు హరికృష్ణ.. ఇప్పుడు అజారుద్దీన్**

అజారుద్దీన్ తన పదవికి ఈ నెలాఖరుకు రాజీనామా చేసే అవకాశం ఉంది. మంత్రిగా రాజీనామా చేసి ఆ మరునాడే మళ్లీ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు తెలుస్తోంది. మంత్రి పదవి చేపట్టిన తర్వాత 6నెలల్లో ప్రజాప్రతినిధిగా ఎన్నిక కావాలి. అజారుద్దీన్ విషయంలో ఆ గడువు ఈనెలాఖరుతో తీరనుంది. గతంలో చంద్రబాబు హయాంలో కూడా ఎమ్మెల్సీ, ఎమ్మెల్సీ కాకుండానే నందమూరి హరికృష్ణ క్యాబినెట్ లో చేరారు. కానీ, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత 6 నెలల తర్వాత కూడా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కాకపోవడంతో తన మంత్రి పదవికి రాజీనామా చేయక తప్పలేదు. ఆ తర్వాత మళ్లీ చంద్రబాబు ఆయనకు అవకాశం ఇవ్వలేదు. రాజీనామా తరువాత తిరిగి రెండోసారి మంత్రిగా ప్రమాణం చేసేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నప్పటికీ ఆయనకు ఆ అవకాశం దక్కలేదు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండోసారి మంత్రిగా తీసుకునేందుకు సుముఖంగా లేకపోవడమే కారణమని రాజకీయ విశ్లేషకులు వ్యాఖ్యానించారు. తీరా ఎమ్మెల్యేగా నెగ్గాక మళ్లీ ఆయనకు మంత్రివర్గంలో తిరిగి చోటు లభించలేదు. మరి ఇప్పుడు అజారుద్దీన్ పరిస్థితి ఎలా ఉంటుందనేది రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చలకు దారి తీస్తున్నది.

# హైడ్రా.. ప్లస్సా.. మైనస్సా?

(మొదటి పేజీ తరువాయి)

ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో అసలు సిసలు టెన్షన్‌కు కారణమవుతోంది. గ్రేటర్ ఎన్నికల్లో గెలుపు గుర్రాలుగా నిలవాల్సిన కాంగ్రెస్ కార్పొరేటర్లు, ఎమ్మెల్యేలు ఇప్పుడు హైడ్రా దూకుడును చూసి లోలోపల వణికిపోతున్నారు. హైదరాబాద్‌లోని మధ్యతరగతి ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఈ కూల్చివేతల వల్ల ప్రభుత్వంపై ఆగ్రహంతో ఉన్నారని, ఇది ఎన్నికల్లో ఓట్లపై తీవ్ర ప్రభావం చూపుతుందని వారు భయపడుతున్నారు. ముఖ్యంగా ఇళ్లు కొనుగోలు చేసిన సామాన్యులు, అనుమతులు ఉన్నా కూల్చివేస్తున్నారనే ప్రచారంతో బెంబేలెత్తుతుండటం.. రేపు తమ ఓటు బ్యాంకుకు గండి కొడుతుందని పార్టీ నేతలు అధిష్టానం వద్ద వాపోతున్నారు.

**కలిసి వస్తుందట..!**

నేతల కంగారు ఇలా ఉంటే, ప్రభుత్వ పెద్దలు మాత్రం మరోలా ఆలోచిస్తున్నారు. హైడ్రా దూకుడు ఎన్నికల్లో మైనస్ కాదు, భారీ ప్లస్ అవుతుందని వారు బుజ్జిస్తున్నారు. నగరంలోని చెరువులు, నాలాల ఆక్రమణల వల్ల వర్షాకాలంలో నగరం మునిగిపోతోందని, ఇప్పుడు వాటిని క్లియర్ చేయడం ద్వారా భవిష్యత్తులో వరద ముప్పు తప్పుతుందని ప్రజలు గుర్తిస్తారని నమ్ముతున్నారు. కష్టపడి సంపాదించిన ఇళ్లు పోతున్నాయని కొందరు బాధపడినా.. నగరం బాగుపడుతుందని మెజారిటీ ప్రజలు హర్షిస్తారు అనేది ప్రభుత్వ పెద్దల వాదన. ఈ సాహసోపేత నిర్ణయం తమకు నిబద్ధత కలిగిన ప్రభుత్వం అనే ముద్రను తెస్తుందని వారు బలంగా నమ్ముతున్నారు. దీనిపై అధికారవర్గం కూడా కొంత అనుమానంగానే ఉంటోంది. హైదరాబాద్ ఆదాయానికి వెన్నెముక వంటి రియల్ ఎస్టేట్ రంగం హైడ్రా వల్ల మందగించిందనే చర్చ నేతల్లో మరింత ఆందోళన కలిగిస్తోంది. కొత్త ప్రాజెక్టులు రాకపోవడం, కొనుగోలుదారులు వెనకాడటం వల్ల ఆర్థిక లావాదేవీలు తగ్గిపోయాయని, ఇది పరోక్షంగా గ్రేటర్ ఎన్నికల్లో తమకు వ్యతిరేకంగా మారుతుందని కొందరు సీనియర్లు అభిప్రాయపడుతున్నారు. పార్టీ కార్యకర్తలు కూడా క్షేత్రస్థాయిలో ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామని, ప్రభుత్వం ఆచితూచి అడుగులు వేయాలని కోరుతున్నారు.



శనివారం సంగారెడ్డి అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో కూల్చివేతలు

**డిఫెన్స్ లో కాంగ్రెస్.. విపక్షాల్లో కన్ ఫ్యూజన్**

బీఆర్ఎస్, బీజేపీ నేతలు హైడ్రా కూల్చివేతలను ప్రధానాస్త్రంగా చేసుకుని గ్రేటర్ ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. జూబ్లిహిల్స్ ఉపఎన్నికల్లో అదే ప్రచారం చేశారు. కాంగ్రెస్ వస్తే కూల్చివేతలు గ్యారెంటీ అనే నినాదాన్ని వారు బలంగా వినిపిస్తున్నారు. దీనికి కౌంటర్‌గా ప్రభుత్వం తన ఇమేజ్‌ను కాపాడుకునేందుకు.. కేవలం బడా ఆక్రమణదారులనే లక్ష్యం చేసుకుంటున్నామని, పేదలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని హామీలు ఇస్తోంది. ఈ క్రమంలోనే మూసీ ప్రక్షాళన బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామనే ప్రకటన కూడా ఈ నష్టం తగ్గించుకోవడానికేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఒక విధంగా జూబ్లీ ఉప ఎన్నికలను పరిశీలిస్తే.. ఇది విపక్షాలకు అనుకున్నంత మేరకు ఆయుధం కాకపోవచ్చు అనేది కూడా అర్థమవుతోంది. హైడ్రా చర్యలు రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ముంచుతాయా లేక పీఠం ఎక్కిస్తాయా అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. భయాందోళనలో ఉన్న పార్టీ నేతలను సమన్వయం చేస్తూ, ప్రజలకు ఈ కూల్చివేతల వల్ల కలిగే దీర్ఘకాలిక ప్రయోజనాలను వివరించడంలో ప్రభుత్వం ఎంతవరకు సఫలమవుతుందనే దానిపైనే గ్రేటర్ ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

**తాజా ఆపరేషన్ అమీన్ పూర్**

సంగారెడ్డి అమీన్‌పూర్ మండలం ఐలాపూర్‌లో దాదాపు 15వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించేందుకు హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. శనివారం వేకువ జామునే వందలాది మంది సిబ్బందితో రంగంలోకి దిగింది. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని అమీన్‌పూర్ మండలం ఐలాపూర్ శనివారం ఉదయం యుద్ధం వాతావరణాన్ని తలపించింది. రికార్డుల ప్రకారం వివాదాస్పదంగా ఉన్న 1200 ఎకరాల ఇనాం , ప్రభుత్వ భూములు పరిరక్షణ కోసం హైడ్రా అధికారులు భారీ స్థాయిలో రంగంలోకి దిగారు. దాదాపు రెండు వేల మంది పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బందితో ఈ ఆపరేషన్ ప్రారంభమైంది. హైడ్రా బృందాలు భారీ ప్రొక్లైనర్లతో గ్రామానికి చేరుకొని అక్రమంగా నిర్మించిన ఆరు అంతస్తుల భవనాన్ని కూల్చివేయం ప్రారంభించాయి. దీంతోపాటు అడ్వకేట్ ముఖీంకు చెందిన గెస్ట్ హౌస్‌ను కూడా అధికారులు నేలమట్టం చేశారు. ఈ గెస్ట్ హౌస్ నిర్మాణంపై 1998 నుంచి కోర్టు స్టే ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని లెక్కచేయకుండా నిర్మాణం చేపట్టినట్టు అధికారులు గుర్తించారు. అపార్టమెంట్‌లలో నివసిస్తున్న వారికి ముందస్తు సమాచారం అందజేసేలా నోటీసులు ఇచ్చారు. ఐలాపూర్ పరిధిలో సుమారు 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, అందులో ఇప్పటికే దాదాపు 400 ఎకరాల వరకు కబ్జాకు గురైందని అధికారులు అంచనా వేస్తున్నారు. అక్రమార్కులు యథేచ్ఛగా నిర్మాణాలకు పాల్పడుతున్నారని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం మిగిలి ఉన్న సుమారు 860 ఎకరాల భూమిని కాపాడటమే ఈ ఆపరేషన్ ప్రధాన ఉద్దేశం. ఈ భూమి బహిరంగ మార్కెట్ విలువ అక్షరాల 15వేల కోట్ల రూపాయలకుపైగా ఉంటుందని అంచనా.

ఐలాపూర్ గ్రామంలోని భూముల వ్యవహారం దశాబ్దాలుగా నలుగుతోంది. ఇక్కడ 1200 ఎకరాలకు పైగా నిజాం కాలం నాటి ఇనాం, ప్రభుత్వ భూములు ఉన్నాయి. వాటిని కబ్జాదారులు ఆక్రమించి ఇళ్లు నిర్మించారని అధికారులు చెబుతున్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా పేదలు నివసిస్తున్న ఇళ్ల జోలికి వెళ్లడం లేదని అంటున్నారు. అక్రమంగా వెలసిన భారీ భవనాలు, గెస్ట్ హౌస్‌లు మాత్రమే టార్గెట్ చేశారు. స్వాధీనం చేసుకున్న భూమికి ఫెన్సింగ్ వేసి రక్షించాలని అధికారులు ప్లాన్ చేశారు.

**స్థానిక ప్రజల నుంచి హర్షం**

హైడ్రా చేపట్టిన ఈ చర్యలకు స్థానిక గ్రామాల నుంచి అనూహ్య మద్దతు లభించింది. కబ్జాకు గురవుతున్న తమ గ్రామ భూములను కాపాడాలని చాలా కాలంగా కోరుతున్న ప్రజలు, హైడ్రా రాకతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ భూములు రక్షణకు కఠిన చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి గ్రామస్తులు క్షీరాభిషేకం చేశారు. గ్రామంలో యువకులు సంబురాలు చేసుకున్నారు.

# బాన్సువాడలో సాగునీటి జలసిరి

**ముద్ర, నిజామాబాద్:**

బాన్సువాడ నియోజకవర్గ రైతాంగానికి సాగునీటి కష్టాలు తీరనున్నాయి. ఈ ప్రాంతంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జకోరా, చందూర్, చింతకుంట ఎత్తిపోతల పథకాలు పూర్తి దశకు చేరుకున్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. త్వరలోనే వీటిని ప్రారంభించి రైతులకు అంకితం చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

**రూ. 106 కోట్ల వ్యయం.. మూడు మండలాలకు లబ్ధి**

సుమారు రూ. 106.04 కోట్ల భారీ వ్యయంతో నిర్మించిన ఈ పథకాల ద్వారా నిజామాబాద్ జిల్లాలోని వర్ని, చందూర్, మోస్రా మండలాలకు సాగునీరు అందనుంది. దీనివల్ల దాదాపు 7,975 ఎకరాల ఆయకట్టుకు లబ్ధి చేకూరుతుందని మంత్రి వివరించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి రైతులకు పూర్తిస్థాయిలో నీటిని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

**ట్రయల్ రన్ పూర్తి.. పంపిణీకి సర్వం సిద్ధం**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్టు పనులను వేగవంతం చేశామని మంత్రి తెలిపారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ నుంచి ఈ ఎత్తిపోతల ద్వారా నీటిని మళ్లించనున్నారు. ఇందుకోసం ఆధునిక సాంకేతికతతో కూడిన పంప్ హౌస్‌లను నిర్మించామని, వీటికి 2.93 మెగావాట్ల విద్యుత్ వినియోగం ఉంటుందని ఆయన వివరించారు. ఇప్పటికే ట్రయల్ రన్ విజయవంతంగా నిర్వహించామని, నీటి పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని స్పష్టం చేశారు.

**భూగర్భ జలాల పెంపు - పంటల భద్రత**

ఈ ఎత్తిపోతల పథకాల ద్వారా కేవలం సాగునీరు అందించడమే కాకుండా, స్థానిక చెరువులు, కుంటలను నింపడం ద్వారా భూగర్భ జల మట్టం పెరుగుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. "ఈ ప్రాజెక్టులతో ధాన్యం దిగుబడి పెరగడంతో పాటు పంటలకు పూర్తిస్థాయి భద్రత లభిస్తుంది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా సాగునీటి విస్తరణలో ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోంది" అని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 12-04-2026
www.mudranews.in | @mudranews



**లే ఆఫ్స్**

**ఖర్చులను నియంత్రించండి**

అవసరం లేని ఖర్చులను వెంటనే తగ్గించండి. జీవనశైలిని సరళంగా మార్చుకోవడం చాలా కీలకం.





# వీడని బంధం.. ఆ పాము వైష్ణవేనా..?

- లవ్ మ్యారేజ్ తర్వాత హింస..
- ప్రాణాలు కోల్పోయిన యూట్యూబర్ వైష్ణవి
- పాము రూపంలో తిరుగుతోందా..?
- వైష్ణవి ఘటనపై తల్లిదండ్రుల భావోద్వేగం

ముద్ర డెస్క్:

వైష్ణవి ఫేమస్ యూట్యూబర్. లక్షల్లో ఆమెకు అభిమానులు ఉన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఆమె సొంత ప్రాంతం. యూట్యూబర్ గా పేరు తెచ్చుకున్న తర్వాత.. ఆమె పాపులారిటీ మరింత పెరిగిపోయింది. ఒక రకంగా చెప్పాలంటే సెలబ్రిటీ అయిపోయింది. అయితే ఆమెకు సోషల్ మీడియాలో ఒక యువకుడు పరిచయమయ్యాడు. వారిద్దరి మధ్య పరిచయం స్నేహంగా మారింది. అది ప్రేమకు దారితీసింది. వైష్ణవి వ్యవహారం ఇంట్లో తెలియడంతో కుటుంబ సభ్యులు వారించారు. ప్రేమ, గీమ కుదరవని చెప్పారు. దీంతో వైష్ణవి మనసు మార్చుకుంది. కానీ ఆమెను ఆ యువకుడు మర్చిపోలేకపోయాడు. మళ్లీ ఆమెకు దగ్గరయ్యే ప్రయత్నం చేశాడు. చివరికి ఆమెను మళ్లీ తన దారిలోకి తెచ్చుకున్నాడు. ఈసారి కుటుంబ సభ్యులు వారించినప్పటికీ వైష్ణవి తన తీరు మార్చుకోలేదు. ఇంట్లో చెప్పకుండా ఆ యువకుడిని ప్రేమ పెళ్లి చేసుకుంది. అప్పటిదాకా ప్రేమ నటించిన ఆ వ్యక్తి తనలో ఉన్న అసలు రూపాన్ని చూపించాడు. వైష్ణవిని నిత్యం కొడుతూ ఉండేవాడు. వేధిస్తూ ఉండేవాడు. హింసిస్తూ ఉండేవాడు. అతడు కొట్టిన దెబ్బలకు తట్టుకోలేక ఇటీవల వైష్ణవి కన్నుమూసింది. ఈ ఉదంతం రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టించింది.

అయితే వైష్ణవి చనిపోవడాన్ని ఇప్పటికీ ఆమె కుటుంబ సభ్యులు జీర్ణించుకో లేక పోతున్నారు. ఇటీవల వైష్ణవి మృతదేహాన్ని దహనం చేసిన చోట కుటుంబ సభ్యులు పిట్టకు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్ళినప్పుడు ఒక పాము వారికి కనిపించింది. ఆ పాము కూడా వైష్ణవి మృతదేహాన్ని దహనం చేసిన చోట తిరిగింది. దీంతో కుటుంబ సభ్యుల దుఃఖానికి అంతు లేకుండా పోయింది.

"నా బిడ్డకు ప్రేమ పేరుతో మాయ మాటలు చెప్పాడు. చివరికి తనను లొంగదీసుకున్నాడు. ఆ తర్వాత తన అసలు రూపాన్ని చూపించడం మొదలుపెట్టాడు. ప్రేమ పేరుతో వంచించి చంపేశాడు. నా బిడ్డ వైష్ణవి మమ్మల్ని వదిలి వెళ్ళలేక ఇదిగో ఇలా పాము రూపంలో తిరుగుతోందని" కుటుంబ సభ్యులు భావోద్వేగంతో చెప్పారు. కాగా, ఆ పాము వైష్ణవి మృతదేహాన్ని దహనం చేసిన నాటి నుంచి అక్కడే తిరుగుతూ ఉండడం విశేషం.

# అబ్కారీ శాఖలో అంతర్యుద్ధం

- ఎక్సైజ్ కమిషనర్ బూతు పురాణం
- రాజీనామాకు సిద్ధమైన ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్
- కమిషనర్ వైఖరితో గుండెపోటు



ముద్ర, తెలంగాణ బ్యూరో:

తెలంగాణ ఎక్సైజ్ శాఖలో కమిషనర్ తో అధికారులు, ఉద్యోగులకు వివాదాలు పెరుగుతున్నాయి. ఐఏఎస్ అధికారి అయినప్పటికీ.. కమిషనర్ బూతు పురాణం పెరిగిపోతోంది. తాజాగా నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్ తో వివాదం నెలకొంది. ఇటీవల కానిస్టేబుల్ ట్రాన్స్ ఫర్ కోసం కమిషనర్ ఆఫీసుకు వెళ్లినప్పుడు తన పట్ల కమిషనర్ తీవ్ర అభ్యంతరకరంగా ప్రవర్తించారని నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి వెల్లడించారు. తాను ఏ తప్పు చేయకపోయినా కమిషనర్ తనను తీవ్రంగా దుర్భాషలాడినట్లు తెలిపారు. ఆ విషయాన్ని తట్టుకోలేక కిందపడిపోయానని, దీంతో ఆసుపత్రి పాలైనట్లు సామాజిక మాధ్యమంలో ఆయన పేర్కొన్నారు. అయితే, తన ఉద్యోగానికి రాజీనామా చేస్తానని, కమిషనర్ వైఖరిని తట్టుకోలేక పోతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో ఉన్నతాధికారి తిట్లదండకం, ఒంటెత్తు పోకడలు పలువురికి గుండెపోటు తెప్పిస్తున్నాయి. ఆయన తన నోటికి ఎంత వస్తే అంత తీవ్రంగా దూషించడంతో అధికారులు గజగజ వణుకుతున్నారు. రెండు నెలల వ్యవధిలో ఇద్దరు అధికారులు గుండెపోటుకు గురయ్యారు.

## హరికిరణ్ పై చర్యలు తీసుకోవాలి..

డిప్యూటీ కమిషనర్ వీ సోమిరెడ్డిని తీవ్రంగా పరుష పదజాలంతో దూషించిన ఎక్సైజ్ కమిషనర్ చెవ్వూరి హరికిరణ్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ లచ్చిరెడ్డి, సెక్రటరీ జనరల్ ఓడనాల రాజశేఖర్ డిమాండ్ చేశారు. అవమానపర్చిన కమిషనర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. అధికారులు, ఉద్యోగులను నిత్యం దూషిస్తూ, అవమానపరుస్తున్న కమిషనర్ వ్యవహారంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి విచారణ జరుపాలని ప్రభుత్వాన్ని కోరారు.

# తల్లిని చంపిన తనయుడు

కోరుట్ల, ముద్ర:

భార్యభర్తల మధ్య జరిగిన గొడవలో తల్లి మృతి చెందిన ఘటన జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మల్లాపూర్ గ్రామానికి చెందిన కుడుదుల వెంకు(90)కు కొడుకు, కూతురు ఉన్నారు. వెంకు తన కొడుకు నంబయ్య కుటుంబంతో కలిసి జీవిస్తోంది. నంబయ్య తరచు అతని భార్య లక్ష్మీతో గొడవ పడుతుంటాడు. తల్లి గొడవ వద్దని చాలాసార్లు మందలించేది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం నంబయ్య ఎప్పటి లాగే తన భార్యలక్షి తో గొడవపడి బూతులు తిడుతుండగా తల్లి మందలించింది. కోపోద్రిక్తుడైన నంబయ్య తన తల్లిని బూతులు తిట్టడమే కాకుండా నుదటిపై బలంగా పిడికిలితో గుద్ది, మంచంపై నుంచి కిందికి ఎత్తేయడంతో మృతి చెందింది. మల్లాపూర్ రెవెన్యూ ఇన్ స్పెక్టర్ రేగెల అశోక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్ తెలిపారు.



# కేంద్రం నిర్ణయంతో దక్షిణాది రాష్ట్రాల ఉనికి ప్రశ్నార్థకం

- 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన అశాస్త్రీయం
- దక్షిణాది రాష్ట్రాలను బలహీన పర్చేందుకు కుట్ర
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ముద్ర, తెలంగాణ బ్యూరో:

కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం రవీంద్ర భారతి తో మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజక వర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని చెప్పారు. కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయన్నారు. ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోకపోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మన కోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడుతుందని డిప్యూటీ సీఎం తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చిందన్న భట్టి విక్రమార్క బీసీ సబ్ ప్లాన్ అమలుపై వచ్చిన డిమాండ్ను పరిగణలోకి తీసుకుంటామని వెల్లడించారు. బీసీ సబ్ ప్లాన్ అమలుకు ఆలోచన చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే కుల సర్వే చేసి రాష్ట్రంలో 56శాతం మంది బీసీలు ఉన్నారని తమ ప్రభుత్వం లెక్క కట్టి చెప్పిందన్నారు. కుల సర్వే ఆధారంగా స్థానిక సంస్థల్లో, విద్యా ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అసెంబ్లీలో ఏకగ్రీవంగా తీర్మానం చేసి బిల్లును గవర్నర్ కు పంపామనీ ఆయన కేంద్ర ప్రభుత్వానికి పంపగా అక్కడ బిల్లు పెండింగ్ లో ఉందని తెలిపారు. కేంద్రం ఆమోదించి పంపితే కుల సర్వే ప్రకారం చేయాల్సిన కార్యక్రమాలు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు.

# బీఆర్ఎస్ పార్టీ ఆఫర్లకు లొంగలేదు

- జీవన్ రెడ్డి పై మంత్రి అడ్లూరి మరోమారు ఫైర్..



ముద్ర, జగిత్యాల:

బీఆర్ఎస్ పార్టీ ఆఫర్లకు తాను లొంగలేదని, పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ పదవి ప్రమాణ స్వీకారం, అభినందన సభ జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించగా మంత్రి అడ్లూరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా పని స్తూ గెలిచిన, ఓడిన ప్రజల మధ్యనే ఉంటూ ముందుకు సాగానని అన్నారు. అనేక అవమానాలు ఎదుర్కొంటూ ఎన్నికల్లో ఓటమి చెందిన అధైర్య పడకుండా కాంగ్రెస్ పార్టీ జెండాను నమ్ముకొని ముందుకు సాగినట్లు మంత్రి తెలిపారు. పార్టీలో కమిట్మెంట్ గా పని చేశాను కనుక నేడు క్యాబినెట్ లో పని చేసే అవకాశం దక్కిందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో తనకు అనేక ఆఫర్లు ఇచ్చిందని అయినప్పటికీ లొంగకుండా కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మంత్రి తెలిపారు. జగిత్యాల జిల్లాలో పనిచేస్తున్న ప్రతి కార్యకర్తకు సరైన సమయంలో గుర్తింపు లభిస్తుందని ఎవరు నిరాశ పడవద్దని అన్నారు.

రాష్ట్రంలో రేవంత్ పాలన పోవాలి.. మార్పు రావాలి అని జీవన్ రెడ్డి నినాదం ఎత్తుకున్నారని ఎందుకు మార్పు రావాలి అని మంత్రి ప్రశ్నించారు. రాష్ట్రంలో సన్న బియ్యం పథకం అమలు చేస్తున్నందుకు మార్పు రావాలా..? అర్హులకు రేషన్ కార్డులు అందించినందుకు మార్పు రావాలా..? నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చినందుకు మార్పు రావాలా..? మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినందుకు మార్పు రావాలా..? అని జీవన్ రెడ్డిని మంత్రి అడ్లూరి ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతుందని, రాష్ట్రంలో మరో మారు అధికారంలోకి వస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా ఎన్నికైన సంగనభట్ల దినేష్ కు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, దుద్దిళ్ల శ్రీను బాబుతో పాటు జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యక ర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.



## బీఆర్ఎస్ చేసిన రుణమాఫీ వడ్డీలకే సరిపోయింది

- రుణమాఫీ విషయంలో హరీశ్ రావు అసత్య ప్రచారం
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

ముద్ర, తెలంగాణ బ్యూరో:

గత పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన రైతు రుణమాఫీ వడ్డీలకే సరిపోయిందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రుణమాఫీ, రైతు భరోసా విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. 25 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల చొప్పున రుణమాఫీ చేశామని తుమ్మల స్పష్టత ఇచ్చారు. 40 బ్యాంకులు పంపిన వివరాల ప్రకారం రాష్ట్రంలోని ప్రతి రైతుకూ రుణమాఫీ చేశామని తుమ్మల స్పష్టం చేశారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా రైతులకు రుణమాఫీ చేశామని చెప్పారు. 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా జమచేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందన్నారు. గతంలో నెలల తరబడి రైతుబంధు వేశారని దుయ్యబట్టారు. రెండు పంటల కాలంలోనే రైతుల కోసం రూ.లక్ష కోట్లు ఖర్చు చేశామని వివరించారు. రైతుల కోసం ఈ స్థాయిలో ఖర్చు చేసే ప్రభుత్వమేదో హరీశ్ రావు చెప్పాలని ప్రశ్నించారు.

## నవ్వుల పాలు కావొద్దు..

- జీవన్ రెడ్డికి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సూచన

ముద్ర, తెలంగాణ బ్యూరో:

ఇన్నేళ్లుగా కేసీఆర్ అవినీతిపై పోరాటం చేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి.. ఇప్పుడు అదే కేసీఆర్ పక్కన కూర్చోవడాన్ని చూసి జనం నవ్వుకుంటున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఇలాంటి నవ్వుల పాలయ్యే పనులు జీవన్ రెడ్డి స్థాయికి తగవని వ్యాఖ్యానించారు. శనివారం గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ సముచిత గౌరవం దక్కిందన్నారు. జీవన్ రెడ్డి పార్టీ వీడినప్పటికీ ఆయనపై తమకు ఇంకా గౌరవం ఉందన్నారు. కేవలం స్థానికంగా ఉన్న చిన్నపాటి సమస్యల కారణంగా దశాబ్దాల అనుబంధం ఉన్న పార్టీని వీడటం సరికాదని ఆయన హితవు పలికారు. తాను తీసుకున్న నిర్ణయంపై జీవన్ రెడ్డి పునరాలోచన చేయాలని కోరారు. తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటే పార్టీకి, ఆయన రాజకీయ భవిష్యత్తుకు మంచిదని సూచించారు.

# ఫార్మా సిటీ పేరుతో సీఎం భూ దందా

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



ముద్ర, ఇబ్రహీంపట్నం:

ఫార్మా సిటీ పేరుతో సీఎం రేవంత్ రెడ్డి భూముల దందా చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఫ్యూచరే లేని నాయకుడు మళ్లీ ఫ్యూచర్ సిటీ కడతా అంటే ప్రజలు నవ్వుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం సేకరించిన 14వేల ఎకరాల ఫార్మా సిటీ భూములను తిరిగి రైతన్నలకు ఇస్తామని చెప్పి వారితో ఓట్లు వేయించుకున్నారని విమర్శించారు. ఇప్పుడు ఫోర్త్ సిటీ పేరుతో మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. శనివారం ఇబ్రహీంపట్నంలో బీఆర్ఎస్ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న కేటీఆర్, ఇటీవల మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన చైర్‌పర్సన్, కౌన్సిలర్లను, సర్పంచ్‌లను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకవైపు ఫార్మా సిటీ కేసు కోర్టులో ఉందని చెబుతూ, బయటకు వచ్చి అవే భూముల్లో ఫోర్త్ సిటీ కడతామని చెబుతుందన్నారని మండిపడ్డారు. గతంలో ఫార్మా సిటీ భూముల్లో అప్పటి సీఎల్పీ నాయకుడిగా ఉన్న భట్టి విక్రమార్క, మంత్రి సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాదయాత్ర చేసి.. తమకు ఓటు వేస్తే మీ భూములు మీకు తిరిగి అప్పజెపుతామని హామీ ఇచ్చారన్నారు. రెండున్నరేండ్ల తర్వాత మరో 16వేల ఎకరాల అదనపు భూమిని రైతుల నుంచి గుంజుకొని ఫోర్త్ సిటీని, భారత్ ఫ్యూచర్ సిటీని కడతానని నాటకాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. కేవలం తన అనుచరులకు, తన కుటుంబ సభ్యులు సోదరులకి భూములు కట్టబెట్టడం కోసమే ఈ ఫ్యూచర్ సిటీ డ్రామాను రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ తెరలేపిందన్నారు. పేదల భూములను దౌర్జన్యంగా గుంజుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ చరిత్రలో ఒక చరిత్రహీనుడిగా మిగిలిపోతాడని చెప్పారు. తెలంగాణ సమాజం కాంగ్రెస్ పార్టీని, రేవంత్ రెడ్డిని ఛీత్కరించే రోజులు దగ్గర పడ్డాయన్నారు. మున్సిపల్ ఎన్నికల అనంతరం దాదాపు రెండు నెలల పాటు అన్ని రకాల అన్యాయాలు, అక్రమాలు చేసిన తర్వాత ఇబ్రహీంపట్నం, క్యాతనపల్లి మున్సిపాలిటీల్లో బీఆర్ఎస్ సమితి గులాబీ జెండా ఎగిరిందన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. ఉన్న సిటీనే పట్టించుకునే తెలివి లేని రేవంత్ రెడ్డికి ఫోర్త్ సిటీని, భారత్ ఫ్యూచర్ సిటీ ఆలోచన ఎక్కడ్నుంచి వచ్చిందోనని ఎద్దేవా చేశారు. ఉన్న సిటీలో దోమలు కుట్టి జనం చనిపోతుంటే పట్టించుకునే పరిస్థితి లేదని మండిపడ్డారు. గత ప్రభుత్వం కోహెడలో 178 ఎకరాల భారీ విస్తీర్ణంలో అతిపెద్ద పండ్ల మార్కెట్ కడతామని అంటే, వాటిని మళ్ళీ ఇప్పుడు రాచకొండ గుట్టలకో, రామోజీ ఫిలిం సిటీ అవతలకో పోవాలని ప్రభుత్వం చెబుతుందన్నారు. ఒకప్పుడు నిషేధిత భూముల జాబితాను తగ్గించి భూ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత 16 లక్షలు ఉన్న నిషేధిత భూముల సంఖ్యను కోటి ఎకరాలకు పెంచి, అందరినీ బ్లాక్ మెయిల్ చేస్తూ భూముల దందా చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. ఈ నిషేధిత జాబితాను అడ్డుపెట్టుకొని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ పెద్దలు కలెక్టర్లకు ఫోన్లు చేసి ప్రజలను ఇబ్బందులు పెడుతూ భూముల దందాకు పాల్పడుతున్నారన్నారు.

# గాయని మంగ్లీ కేసుతో ఎలాంటి సంబంధం లేదు

- డైరెక్టర్ వేణు ఊడుగుల

ముద్ర, డెస్క్:

ఆర్థిక మోసం ఘటనలో గాయని మంగ్లీపై నమోదైన కేసులో దర్శకుడు వేణు ఊడుగుల కూడా ఉన్నారంటూ కొన్ని మీడియా సంస్థలు ప్రచారం చేశాయి. ఈ వార్తలపై దర్శకుడు వేణు ఊడుగుల వివరణ ఇచ్చారు. మంగ్లీ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు వేణు ఊడుగుల ప్రెస్ నోట్ రిలీజ్ చేశారు. మంగ్లీ, లాయర్ సుబ్బారావు ఇద్దరూ తనకు తెలిసిన వాళ్లు కావడంతో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించినట్లు తెలిపారు. ఇంతవరకే ఈ కేసులో నా పాత్ర.

ఈ కేసు ఎఫ్ఐఆర్ లో కూడా నిందితుడిగా నా పేరు ఎక్కడా ప్రస్తావించలేదు. అడ్వకేట్ సుబ్బారావు ఈ రోజు మీడియాతో మాట్లాడుతూ వేణు ఊడుగులకు ఈ కేసుతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారని తెలిపారు. పంజాగుట్ట పోలీసులు కూడా ఈ కేసుతో తనకు సంబంధం లేదని నిర్ధారించినట్లు వివరించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
ఆదివారం 12.04.2026
4 వేదిక
Peoples Voice
Sunday Special

ఒక తెగ సృజనాత్మకత...

ఆదివారం ప్రత్యేకం

# ప్రపంచ ఫ్యాషన్‌కు కొత్త దిశ

- బంజారా తండాల నుంచి గ్లోబల్ ఫ్యాషన్ ర్యాంప్ వరకు...
- గాగ్రా ప్రయాణం అద్భుతం!
- అద్దాల మెరుపులతో ప్రపంచాన్ని మెప్పించిన లంబాడీ గాగ్రా కళ!
- సంప్రదాయం నుంచి ట్రెండ్‌గా హస్తకళ
- పేటియా నుంచి లేహంగా వరకు...

బంజారా వస్త్రసంస్కృతి ఫ్యాషన్‌ను ఎలా మార్చింది?





ఫ్యాషన్ అంటే నిరంతరం మారే ప్రవాహం. కానీ కొన్ని సంప్రదాయాలు కాలంతో పాటు మారడమే కాకుండా, కాలానికే కొత్త పాఠాలు నేర్పుతాయి. అటువంటి అరుదైన వస్త్ర సంస్కృతే బంజారా మహిళల 'గాగ్రా'. ఒకనాడు సంచార జీవులుగా పేరుగాంచిన లంబాడీ మహిళలు సృష్టించిన ఈ వస్త్రం, నేడు ప్రపంచ ఫ్యాషన్ వేదికలపై మెరుస్తోంది.

**సంప్రదాయం వెనుక ఉన్న శ్రమ**

బంజారా మహిళలు ధరించే 'పేటియా' (గాగ్రా) కేవలం దుస్తులు మాత్రమే కాదు, అది ఒక అపురూపమైన హస్తకళ. దీని తయారీలో వారు చూపే శ్రద్ధ అద్భుతం. సంతకు వెళ్లి ముతక నూలు దుస్తులు, రంగు దారాలు, అద్దాలు, గవ్వలు తెచ్చుకొని.. ఇంటి పనుల మధ్య దొరికిన ఖాళీ సమయాన్ని అల్లికల కోసం కేటాయిస్తారు. ఎరుపు, నారింజ రంగుల కలయికతో, మందపాటి వస్త్రంతో తయారయ్యే ఈ గాగ్రాలు కఠినమైన వాతావరణం నుండి రక్షణ కల్పించడమే కాక, వారి సంస్కృతిని చాటిచెబుతాయి.

**అద్దాల మెరుపు.. ఆధునిక మలుపు**

నాడు బంజారా తండాల్లో వినిపించిన గవ్వల గలగలలు, అద్దాల మెరుపులు నేడు మాల్స్‌లోనూ, డిజైనర్ స్టూడియోల్లోనూ 'ట్రెండింగ్'గా మారాయి.

**మార్కెట్ రకాలు:** ఒకప్పుడు కేవలం సంప్రదాయ శైలిలో ఉన్న ఈ గాగ్రాలు, నేడు ఏ-లైన్, మెర్మెడ్ కట్, స్ట్రెయిట్ కట్ వంటి ఆధునిక శైలుల్లోకి రూపాంతరం చెందాయి.

వెల్వెట్, సిల్క్, నెట్ వంటి వస్త్రాలపై భారీ మిర్రర్ వర్క్ జోడించి, పెళ్లిళ్లు మరియు పండుగలకు 'మస్ట్ హేవ్' దుస్తులుగా ఇవి గుర్తింపు పొందాయి.

బంజారా సంస్కృతిలో పెళ్లి కుదిరిన యువతి, తన వివాహం కోసం ధరించే 'పెళ్లి గాగ్రా'ను తన చేతులతో తనే స్వయంగా కుట్టుకోవాలి. ఇది వారి ఓపికకు, సృజనాత్మకతకు ఒక గొప్ప పరీక్షగా పరిగణించబడుతుంది.



పేద, ధనిక అనే తేడా లేకుండా నేడు ప్రతి మహిళ వార్డ్‌రోబ్‌లో గాగ్రా (లేహంగా) చోటు సంపాదించుకుంది. అట్టడుగు వర్గాల నుండి వచ్చిన ఒక కళ, నేడు అంతర్జాతీయ ఫ్యాషన్ పరిశ్రమను శాసించే స్థాయికి చేరుకోవడం బంజారా తెగకు దక్కిన గౌరవం. వారి అద్దాల పనితనం.. ఫ్యాషన్ ప్రపంచానికి నిరంతర కాంతిపుంజం!



- ధర్మసోత్ రామకృష్ణ (ఆర్.కే), జర్నలిస్ట్

## అపురూపమైన ఆవిష్కరణలు:

**బంజారా మహిళల పూర్తి వస్త్రధారణలో మూడు ముఖ్యమైన భాగాలుంటాయి..**

**పేటియా (గాగ్రా):** రంగురంగుల అల్లికలతో కూడిన లంగా.

**కాంచళి (రవిక):** ముందు భాగంలో అద్దాలు, గవ్వలతో అలంకరించిన చిన్న రవిక.

**టూక్రీ / ఓణీ:** తలపై నుంచి ముసుగుగా ధరించే సాంప్రదాయ వస్త్రం.

## అవి కేవలం దుస్తులు కాదు... వారి జీవిత కథ

**- బాణోత్ హుస్సేన్ నాయక్, సేవాలాల్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు..**



బంజారా మహిళల గాగ్రా అంటే నాకు ఎంతో ఇష్టం. అది కేవలం దుస్తులు కాదు... వారి జీవిత కథ. అద్దాల పని, రంగుల కలయిక చూస్తే ఎంత కష్టం పడతారో అర్థమవుతుంది. ఇప్పుడు అదే డిజైన్‌లు ప్రపంచ ఫ్యాషన్‌లో ట్రెండ్ అవుతుండటం చాలా గర్వంగా ఉంది.






## బంజారాల కష్టం ప్రపంచం గుర్తిస్తేనే అసలు గౌరవం

**బాణోత్ భద్రు నాయక్, ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు...**

అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన ఒక కళ ప్రపంచాన్ని ఆకట్టుకోవడం నిజంగా గొప్ప విషయం. కానీ ఆ కళను సృష్టించిన బంజారా మహిళలకు సరైన గుర్తింపు, ఆదాయం అందుతుందా అనేది కూడా మనం ఆలోచించాలి. వాళ్ల కష్టం ప్రపంచం గుర్తిస్తేనే అసలు గౌరవం.

# నిర్మాణ ధీశాలి.. నవ భారత శిల్పి

**ఏప్రిల్ 12 మోక్షగుండం విశ్వేశ్వరయ్య వర్ధంతి**

ఆధునిక భారతదేశ నిర్మాణంలో ఒక ఇంజనీర్ పాత్ర ఎంత కీలకమో చాటిచెప్పిన మహనీయుడు సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య. నేడు ఆయన వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని స్మరించుకోవడం మన బాధ్యత. కేవలం ఇటుకలు, సిమెంట్‌తో కట్టడాలు నిర్మించడం మాత్రమే కాదు, ఒక దేశ భవిష్యత్తుకు అవసరమైన మౌలిక సదుపాయాలను దార్శనికతతో ఎలా రూపొందించవచ్చో ఆయన చేసి చూపారు.1908లో మూసీ నదికి వచ్చిన భీకర వరదలు భాగ్యనగరాన్ని ఛిన్నాభిన్నం చేశాయి. ఆ విపత్తు మళ్ళీ సంభవించకుండా, హైదరాబాద్ నగరాన్ని శాశ్వతంగా వరదల నుండి రక్షించేలా ఉస్మాన్ సాగర్ (గండిపేట), హిమాయత్ సాగర్ జంట జలాశయాలకు రూపకల్పన చేసిన ఘనత ఆయనదే. నేటికీ ఆ జలాశయాలు నగరాన్ని వరదల నుండి రక్షించడమే కాకుండా, తాగునీటి అవసరాలను తీరుస్తూ ఆయన మేధస్సుకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి.నీటి పారుదల రంగంలో ఆయన చేసిన ఆవిష్కరణలు ప్రపంచ స్థాయి గుర్తింపు పొందాయి. జలాశయాల్లో నీటి మట్టాన్ని బట్టి వాటంతట అవే తెరుచుకునే 'ఆటోమాటిక్ ఫ్లడ్ గేట్స్' వ్యవస్థను రూపొందించి ఆనకట్టల రక్షణలో విప్లవాత్మక మార్పులు తెచ్చారు. పూణేలోని ఖడక్‌వాస్లా నుండి మైసూరులోని కృష్ణరాజ సాగర్ వరకు ఆయన వేసిన ముద్ర చెరపలేనిది.ట్యూషన్లు చెప్పుకుంటూ చదువుకుని, కటిక పేదరికం నుండి భారతరత్న స్థాయికి ఎదిగిన ఆయన ప్రస్థానం ప్రతి విద్యార్థికి స్ఫూర్తిదాయకం. "పరిశ్రమించు లేదా నశించు" అని గర్జించిన ఆయన, కేవలం ఇంజనీరింగ్‌కే పరిమితం కాకుండా విద్యా, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి మైసూర్ దివాన్‌గా విశేష సేవలు అందించారు.

భావితరాలకు క్రమశిక్షణ, అంకితభావం, అకుంఠిత దేశభక్తిని వారసత్వంగా అందించిన విశ్వేశ్వరయ్య గారి స్మృతి చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన చూపిన బాటలో నడుస్తూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజా శ్రేయస్సు కోసం ఉపయోగించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి.

- సుధాకర్.ఏ.వి
* రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు * స్టేట్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (STUTS)
9000674747

# టీచర్‌కు శిక్ష... పాలకులకు రక్షణ.. విద్య ఎవరి చేతుల్లో?




ఒక గిరిజన టీచర్ ప్రైవేట్ స్కూల్‌ను రీల్ ద్వారా ప్రమోట్ చేశాడని సస్పెండ్ చేయడం, నిబంధనల ప్రకారం అది తప్పే కావచ్చు. ప్రభుత్వ ఉద్యోగి ప్రైవేట్ సంస్థకు ప్రచారం చేయడం సరైంది కాదు. కానీ అసలు ప్రశ్న ఇక్కడే మొదలవుతుంది. అదే నిబంధనలు అందరికీ సమానంగా అమలవుతున్నాయా? ఒకవైపు, బలహీన వర్గానికి చెందిన టీచర్‌పై వెంటనే చర్యలు తీసుకునే వ్యవస్థ... మరోవైపు, అదే విద్యను వ్యాపారంగా మార్చి కోట్ల రూపాయల సామ్రాజ్యాలు నిర్మిస్తున్న ఆధిపత్య కులాల ధనిక శక్తివంతుల ముందు మౌనం వహిస్తోంది. ఇది న్యాయం కాదు, అన్యాయం. చట్టం అందరికీ ఒకటే అయితే, దాని అమలు కూడా ఒకటే ఉండాలి. లేకపోతే అది చట్టం కాదు, అధికారపు కోరల్లో విషపు ఆయుధం.

ఈ విరుద్ధతను మరింత బహిర్గతం చేసే సంఘటనలు ఇటీవలి రోజుల్లో కనిపిస్తున్నాయి. ఒకవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలను "పిల్లలను ప్రైవేట్ స్కూల్స్‌కు పంపకండి" అని పిలుపునిస్తారు. అదే సమయంలో, కొన్ని గంటలకే ఒక ఎంఎల్‌సీ ఏ వి ఎన్ రెడ్డి నిర్వహిస్తున్న ప్రైవేట్ స్కూల్ ప్రారంభోత్సవానికి వెళ్లి రిబ్బన్ కట్ చేస్తారు. ఈ రెండు చర్యలు కలిపి చూసినప్పుడు వచ్చే సందేశం ఏమిటి? మాటల్లో ప్రభుత్వ విద్యకు మద్దతు... కానీ చర్యల్లో ప్రైవేట్ విద్యకు ప్రోత్సాహం. ఇది కేవలం విరుద్ధత కాదు, ఇది ప్రజలకు ఇచ్చే సంకేతం. అదే విద్య ఒక హక్కు కాదు, అధికారంతో నడిచే వ్యాపారమని.

విద్య అనేది దళిత, బహుజన, గిరిజన వర్గాల అభివృద్ధికి మార్గం, వారి దాస్యశృంఖల విముక్తికి ప్రధాన మార్గం. ప్రభుత్వ పాఠశాలలే వారి పిల్లలకు ఏకైక ఆశ్రయం. అలాంటి వ్యవస్థను బలోపేతం చేయాల్సిన పాలకులు, అదే సమయంలో ప్రైవేట్ విద్యా వ్యవస్థను పెంపొందించడంలో భాగస్వాములు కావడం, ఇది రాజ్యాంగంపైన ప్రమాణం చేస్తున్న దానికి విరుద్ధం. గిరిజన ప్రాంతాల్లో పనిచేసే టీచర్లు కేవలం ఉద్యోగులు కాదు; వారు ఆ సమాజానికి ఆశ, ఆదర్శం. అలాంటి వారిపై చిన్న కారణాలతో కఠిన చర్యలు తీసుకోవడం, కానీ పెద్ద స్థాయిలో జరుగుతున్న విద్యా వ్యాపారీకరణపై కళ్లుమూయడం, ఇది వ్యవస్థాగత వివక్షకు నిదర్శనం.

చివరికి మనం అడగాల్సిన ప్రశ్న ఒకటే: రీల్ చేసిన టీచర్‌ను శిక్షించే ధైర్యం ఉన్న ప్రభుత్వం... విద్యను అంగడి సరుకుగా మార్చి, రాజ్యాంగం హామీ ఇచ్చిన ఉచిత విద్య హక్కును నీరుగారుస్తున్న ఈ రాజ్య శక్తివంతులను ప్రశ్నించగలదా? బహుజన వాడల్లో బడులు బలహీనపడుతుంటే, హైవేల పక్కన కార్పొరేట్ స్కూల్స్ పెరుగుతుంటే– ఈ వ్యవస్థ నిజంగా ఎవరిని కాపాడుతోంది? నిజంగా చెప్పాలంటే, నియమాలు బలహీనులపై కఠినంగా, శక్తివంతుల ముందు మౌనంగా ఉంటే... అది ప్రజాస్వామ్యం కాదు, అణచివేత. దౌర్జన్యం. విద్యను వ్యాపారం చేస్తున్న వారిపై మౌనం వహిస్తూ, ఒక టీచర్‌పై ప్రతాపం చూపడం న్యాయం కాదు, అది వ్యవస్థ తన అసలు ముఖాన్ని చూపుతున్న క్షణం. ఇప్పుడు ప్రజల నిర్ణయం ఏమిటో అని వెట్ చేయాల్సినది మిగిలి ఉన్నది.




- పాపని నాగరాజు
(సత్యశోధక మహాసభ)

# క్యాన్సర్ ముంగిట అవివాహిత యువత

ఆధునిక డిజిటల్ యువత ఆలోచల్లో విపరీత ధోరణులు పెరుగుతున్నాయి. వివాహాలు వద్దంటూ నూతన నినాదాలు, విడాకులతో ఒంటరి సంసారాలు, ఆలస్యముగా వివాహాలు, దాంపత్య జీవితాల్లో అశాంతులు దినదినం పెరుగుతున్నాయి. 'పెళ్లంటా నూరేళ్ల తంటా' అంటూ నినదిస్తున్నారు. 'సింగల్ (సోలో) బతుకు సో బెటరు' అంటూ ప్రకృతికి విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. పెళ్లి కాని ప్రసాదులు, వివాహాలు చేసుకోని పేరమ్మలు, మామిడి తోరణాలు వాడకముందే విడాకులు తీసుకొని సింగిల్‌గా బతుకుతున్న యువతలో క్యాన్సర్ కేసులు పెరుగుతున్నట్లు ఇటీవల విడుదలైన శాస్త్రీయ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పెళ్లిళ్లు చేసుకున్న దంపతులతో పోల్చితే బ్రహ్మచారులు, బ్రహ్మచారిణుల్లో క్యాన్సర్ సంభావ్యతలు అధికంగా కనిపిస్తున్నట్లు పరిశోధనలు హెచ్చరిక చేస్తున్నాయి.

**అవివాహిత స్త్రీ పురుషుల్లో అధిక క్యాన్సర్ ముప్పు :**

ఇటీవల "క్యాన్సర్ రీసెర్చ్ కమ్యూనికేషన్స్" మ్యాగజీన్లో ముద్రిత వ్యాసం ప్రకారం పెళ్లిళ్లు చేసుకొని పురుషుల్లో 68 శాతం, అవివాహిత మహిళల్లో 83 శాతం వరకు క్యాన్సర్ రేట్లు అధికంగా ఉన్నట్లు తాజా అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. పెళ్లికి, వ్యక్తిగత ఆరోగ్యానికి సంబంధం ఉన్నట్లు నిర్ధారించారు. 'యూనివర్సిటీ ఆఫ్ మియామీ మిల్లర్ స్కూల్ ఆఫ్ మెడిసిన్' చెందిన "డా: పాలో ఎస్. పెన్‌హీరా" చేసిన అధ్యయనం ఈ అంశాల పట్ల లోతైన పరిశోధనలు చేసి ఫలితాలను పరిశోధనా వ్యాసం రూపంలో ప్రచురించారు. 2015 – 22 మధ్య జరిగిన ఈ అధ్యయనంలో అమెరికాకు చెందిన 12 రాష్ట్రాలకు చెందిన 4 మిలియన్ల క్యాన్సర్ కేసులను పరిగణనలోకి తీసుకున్నారు. వివాహిత యువతతో పోల్చితే పెళ్లిళ్లు కాని యువతలో క్యాన్సర్ ముప్పు అధికంగా కనిపిస్తున్నట్లు తేల్చారు. అవివాహితుల్లో వయస్సు పెరిగిన కొద్దీ ఆరోగ్య సమస్యలు కూడా పెరుగుతున్నట్లు తెలుస్తున్నది. వివాహాల వల్ల భావోద్వేగ సమతుల్యత, సామాజిక మద్దతు, అధిక వైద్య సంరక్షణ చర్యలు, ముందస్తు పరీక్షలతో వ్యాధుల గుర్తింపు, ఆరోగ్యకర జీవనశైలి అలవాట్లు, లైంగిక సంబంధాలు, భాగస్వాముల మధ్య పరస్పర ఆరోగ్య శ్రద్ధ లాంటి అంశాల ఫలితంగా క్యాన్సర్ ముప్పు తగ్గుతున్నట్లు వివరిస్తున్నారు.



అవివాహితులతో పోల్చితే వివాహిత యువతలో పొగ తాగడం, ఆల్కహాల్ సేవనం, అసురక్షిత లైంగిక సంబంధాలు లాంటి దురలవాట్లు తక్కువగా ఉండడం వల్ల వారిలో క్యాన్సర్ కేసుల రేటు తక్కువగా ఉన్నట్లు తేల్చారు. వివాహాలతో వ్యక్తుల్లో ఓవర్ ఆల్ వెల్-బీయింగ్ లేదా సంపూర్ణ ఆరోగ్య శ్రేయస్సుకు సంరక్షణ జరుగుతున్నట్లు తెలుస్తున్నది.

**అవివాహిత స్త్రీల్లో అధిక క్యాన్సర్ ముప్పు:**

అవివాహిత పురుషుల కన్న అవివాహిత స్త్రీల్లో క్యాన్సర్ ముప్పు అధికంగా కనిపించడం ఒక ప్రమాద హెచ్చరికగా తీసుకోవాలి. అలాంటి బ్రహ్మచారిణుల్లో గర్భాశయ, ఎండోమెట్రిక్ క్యాన్సర్ ముప్పు అధికంగా ఉన్నట్లు అభిప్రాయపడుతున్నారు. సామాజిక మానవ సంబంధాలు (కుటుంబం, బంధుమిత్రులు, పౌర సమాజం, సాధు జంతువులతో గడపడం) కూడా ఆరోగ్యాన్ని అధికంగా ప్రభావితం చేస్తున్నట్లు తెలుస్తున్నది. వివాహితుల్లో వైద్య ఆరోగ్య సంరక్షణలు, జీవితకాల ఆరోగ్య భద్రత చర్యలు ఎక్కువగా ఉంటున్నాయని గమనించారు. అవివాహిత స్త్రీ పురుషుల్లో ఆరోగ్యం పట్ల అనవసర అపోహలు ఉండడంతో వారిలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నట్లు గమనించారు. అవివాహిత స్త్రీ పురుషులు అధిక ఆరోగ్యకర సామాజిక పౌర సంబంధాలు, క్రమ పద్ధతిలో వైద్య పరీక్షలు, ఆరోగ్యకర జీవనశైలి లాంటి అంశాలను పాటిస్తే ఆరోగ్యం బాగుంటుందని సూచిస్తున్నారు.

**అసంబద్ధ జీవనశైలికా క్యాన్సర్ ముప్పు:**

మూడు పదుల వయస్సు దాటిన వివాహిత యువతతో పోల్చితే అవివాహిత యువతలో క్యాన్సర్ ముప్పు అధికంగా గమనించిన కారణంగా పెళ్లిళ్లు చేసుకోమంటూ భీష్మించుకొని కూర్చున్న ప్రసాదులు, పేరమ్మలు సరైన వయస్సులో ఏడడుగులు వేసి పెళ్లంటా నూరేళ్ల ఆనందాల పంట అని రుజువు చేయాలి. ప్రకృతి నియమాలకు విరుద్ధంగా వెళితే అనారోగ్యాలు, ప్రాణాంతక వ్యాధులు వెంటపడతాయని తెలుసుకోవాలి. పొగాకు, ఆల్కహాల్, అధిక బరువు, శారీరక వ్యాయామ లోపాలు, గాలి కాలుష్యం, యూవీ రేడియేషన్ కారణ క్యాన్సర్లను తగు జీవనశైలి మార్పులతో తప్పించుకోవచ్చని నిపుణులు సలహా ఇస్తున్నారు. ఇటీవల ఐరాస అధ్యయనాల ప్రకారం, జీవనశైలి మార్పులతో 37 శాతం క్యాన్సర్ కేసులు నివారించుకోవచ్చని తేల్చిన విషయం గమనార్హం. నివారించదని క్యాన్సర్ కేసుల్లో 45 శాతం పురుషులు, 30 శాతం స్త్రీలు ఉన్నట్లు తెలుస్తున్నది. మహిళలతో పోల్చితే పురుషుల్లో పొగాకు, ఆల్కహాల్ సేవనాలు, అక్రమ లైంగిక సంబంధాలు లాంటి దురలవాట్లు అధికంగా ఉండడంతో క్యాన్సర్ ముప్పు పురుషుల్లో ఎక్కువగా కనిపిస్తున్నది.


దురలవాట్లు, అస్తవ్యస్త జీవనశైలి, వైద్య ఆరోగ్య సంరక్షణ చర్యల్లో అశ్రద్ధల వల్ల క్యాన్సర్ ముప్పు పెరుగుతున్నందున నేటి డిజిటల్ కాలపు యువత యుక్త వయస్సు రాగానే పెళ్లిళ్లు చేసుకొని సుఖ సంసారాలతో కుటుంబ ఆనందాలను ఆస్వాదించాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏ వయస్సులో జరగాల్సిన ముచ్చట ఆ వయస్సులో జరగాలి. 'వివాహాలు ఒక జీవితకాల గుదిబండ' అంటూ నినదిస్తున్న యువత ఇప్పటికైనా కళ్లు తెరిచి తమ వైవాహిక జీవిత ఆనంద సుగంధాలను ఆస్వాదించాలని, ఆరోగ్యకర సంతానం రూపంలో రేపటి తరానికి పునాదులు వేయాలని కోరుకుందాం.

- డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
ఆదివారం 12.04.2026
www.mudranews.in | @mudranews



**లేఆఫ్స్ :** అప్పులను తగ్గించండి. అధిక వడ్డీ ఉన్న లోన్లను ముందుగా క్లియర్ చేయడానికి ప్రయత్నించండి. EMIలు తక్కువగా ఉంటే ఒత్తిడి కూడా తగ్గుతుంది.



## సంక్షిప్తంగా..

### ఈసీఐఎల్ 59వ స్థాపన దినోత్సవం



**ముద్ర, కాప్రా:** ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్)లో 59వ స్థాపన దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. సంస్థ ఫ్యాక్టరీ ప్రధాన ద్వారం వద్ద ఉత్సాహభరిత వాతావరణంలో తాత్కాలిక సీఎండీ డైరెక్టర్ (ఫైనాన్స్) ప్రోటీక్ కుమార్ చక్రబోర్తి, ఈసీఐఎల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఏ.ఎస్.రావు విగ్రహానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ, ఈసీఐఎల్ అభివృద్ధికి కృషి చేసిన ఉద్యోగులు, టీసీలు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని అభినందించారు.

### పంచాయతీ కార్యదర్శుల జిల్లా కమిటీ



**ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్:** నాగర్‌కర్నూల్ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల జిల్లా కమిటీ ఎన్నికలు టీఎన్జీవో ఆధ్వర్యంలో, రాష్ట్ర అధ్యక్షుడు బలరాం సమక్షంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సభా వెంకటేశ్, కోశాధికారిగా రమేశ్ బాబు ఎన్నికయ్యారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాయకులు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే సంఘ బలోపేతానికి కట్టుబడి పనిచేస్తామని తెలిపారు.

### హోమియో వైద్యునికి సన్మానం



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకొని హోమియో వైద్యురాలు డా. పాపిశెట్టి లక్ష్మణ్ను సన్మానించారు క్లాస్మేట్ క్లబ్ ఫౌండర్ వాస రాఘవేందర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "365 రోజులు—365 కార్యక్రమం" లో భాగంగా వందవ రోజు సన్మానించారు. వందమంది మహాత్ముల జీవిత చరిత్రల పుస్తకాలను ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాలెం మరియు లిటిల్ ఫ్లవర్ హైస్కూల్, నాగర్ కర్నూల్ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో క్లాస్మేట్ లో ఫౌండర్ వాస రాఘవేందర్ స్టేట్ ప్రెసిడెంట్ వై. పరమేశ్వరయ్య, స్టేట్ సెక్రటరీ కె.పి. ప్రసాద్, క్లాస్మేట్ క్లబ్ సభ్యులు పాలెం జూనియర్ కళాశాల లెక్చరర్ నరసింహ, లిటిల్ ఫ్లవర్ పాఠశాల ప్రతినిధి రామన్ గౌడ్ పాల్గొన్నారు.

### విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** నాగర్ కర్నూల్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. కల్వకుర్తి మండలం ఎల్లికల్ గ్రామంలో విద్యుత్ షాక్ తో ఓ యువకుడు మృతి చెందాడు.గ్రామానికి చెందిన ప్రవీణ్ గా మృతుడిని గుర్తించారు. ఇంటికి నీళ్లు కొడుతుండగా అకస్మాత్తుగా విద్యుత్ షాక్ తగలడంతో కిందపడిపోయాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు వెంటనే స్పందించి అతడిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.అయితే ఆసుపత్రికి చేరుకునేలోపే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది.

# జ్యోతిరావు పూలేకు నివాళి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా శనివారం మహబూబ్ నగర్ పద్మావతి కాలనీ లోని విగ్రహాన్నికి పూలమాల వేసి నివాళులర్పించారు. నగర మేయర్ గుమ్మల మమత, జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత,డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి పూలే విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, గౌరెల కాపర్ల సంఘం అధ్యక్షులు అధ్యక్షులు శాంతయ్య, మైత్రి యాదయ్య, రాములు, సాయిలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తిలో..**

**ముద్ర, వనపర్తి:** కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఖీమ్యా నాయక్ హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, బీసీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్ ఖాన్, డీపీ ఆర్ఓ సీతారాం, మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కౌన్సిలర్లు కౌన్సిలర్లు శరవంద, మహేశ్వరి ఉన్నారు. మహనీయుల సభ కమిటీ అధ్యక్షులు గంధం నాగరాజు, ప్రజా సంఘాల నాయకులు రాజారాం ప్రకాష్, బండలయ్య, చీర్ల జనార్ధన్, ఉమల్ల రాములు, కే వెంకటేష్, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఇతర కవులు కళాకారులు, ఉపాధ్యాయులు కిరణ్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**నాగర్ కర్నూల్ లో..**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి పొదిల రామయ్య, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు అంతటి కాశన్న, జై భీమ్ దీక్ష నాయకులు పరశురాములు, బంగారయ్య, మహేష్, వేముల కురుమయ్య, రాము, పారిజాత, సుజాత, లక్ష్మి పాల్గొన్నారు.

**గద్వాలలో..**

**ముద్ర, జోగులాంబ గద్వాల ప్రతినిధి:** జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గద్వాల ఐడిఓసి వద్ద పూలే చిత్రపటానికి నివాళి అర్పించారు. గద్వాల బస్టాండ్ వద్ద పూలే విగ్రహానికి అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీఎస్పీ మొగిలయ్య, ఆర్డీవో శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి అక్బర్ పాషా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**వికారాబాద్‌లో..**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కలెక్టరేట్ కార్యాలయ సమావేశం హాలు నందు వెనుకబడిన తరగతుల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెకర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, బి సి వెల్ఫేర్ అధికారి మాధవరెడ్డి, ఎస్సి వెల్ఫేర్ అధికారి జయపాల్ రెడ్డి, రవికుమార్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

**తాండూర్‌లో..**

**ముద్ర, తాండూర్:** వికారాబాద్ జిల్లా తాండూర్ పట్టణంలో బీసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు సయ్యద్ సుకుర్, మహిళా అధ్యక్షురాలు అనిత, సోషల్ మీడియా ఇన్చార్జ్ బసవరాజ్, రమేష్, తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

**కొంగరకలాన్‌లో..**

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డిజిల్లా ప్రతినిధి:** కొంగర కలాన్ జిల్లా కలెక్టరేట్లోని జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో జిల్లా బిసి సంక్షేమ అధికారి కేషు రాం, బిసి సంఘం నాయకులతో కలిసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ ఫ్రంట్ చైర్మన్ జి మలేష్ యాదవ్, పీసీసీ కార్యదర్శి కొత్త కుర్మ శివకుమార్, రంగారెడ్డి జిల్లా బీసీ ఫ్రంట్ అధ్యక్షులు కె కృష్ణ యాదవ్, జంగయ్య, బీసీ వెల్ఫేర్ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్టలో..**

**ముద్ర, కూకట్‌పల్లి :** జగద్గిరిగుట్టలోని సిపిఐ కార్యాలయంలో చిత్రపటానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి ఎన్ఎస్‌యూఐ , దళిత సంఘం నాయకులు, మహిళా సంఘం నాయకురాలు పాల్గొన్నారు. మూసాపేట్ ఆంజనేయనగర్ చౌరస్తాలో నిర్వహించిన పూలే జయంతి వేడుకలకు టీపీసీసీ ఉపాధ్యక్షులు, కూకట్‌పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్ హాజరై నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాషెట్టి నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు



వికారాబాద్‌లో..


కొంగరకలాన్‌లో..


జగద్గిరిగుట్టలో..


వనపర్తిలో..



తాండూర్‌లో..


మహబూబ్ నగర్ లో..


గద్వాలలో..



నాగర్ కర్నూల్ లో..

# యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

**-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం ప్రభుత్వ ఆసుపత్రిలో అడిక్షన్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ కేంద్రాలను ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రి లో ఏర్పాటు చేసిన డ్రగ్స్ నివారణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. డ్రగ్స్ వినియోగం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబం సమాజం పై కూడా తీవ్రమైన ప్రభావం చూపుతుందన్నారు. యువత యోగ, మెడిటేషన్, విద్య, క్రీడలు మరియు సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని సూచించారు. డ్రగ్స్ సేవించి డ్రైవింగ్ చేస్తే ప్రమాదాలు జరుగుతాయని, డ్రగ్స్ అక్రమ రవాణా, వినియోగంపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని, డ్రగ్స్ పై టోల్ ఫ్రీ 1908 నెంబర్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. డ్రగ్స్ కార్యకలాపాల్లో పాల్గొనే వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై నిశితంగా పర్యవేక్షణ వహించాలని, అనుమానాస్పద చర్యలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముందుగా డ్రగ్స్ పై వ్యాస రచన, క్విజ్, పెయింటింగ్ పోటీలలో పాల్గొన్న వారందరికీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్ పి రాము నాయక్, సూపరింటెండెంట్ రాజ్యలక్ష్మి, తెలంగాణ ఈగల్ ఫోర్స్ రాంబాబు నాయక్, డ్రగ్ ఇన్స్పెక్టర్ క్రాంతి కుమార్, డాక్టర్ . చంద్రశేఖర్, అబ్దుల్ హఫీజ్, శాంతా బాయి, శంకరమ్మ, మెడికల్ స్టూడెంట్స్, నర్సింగ్ స్టూడెంట్స్,పోలీసు అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నాలుగో రోజుకు చేరిన విద్యుత్ ఆర్టిజన్ల సమ్మె

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** విద్యుత్ ఆర్టిజన్ కార్మికులపై యాజమాన్యం బెదిరింపు ఆపాలని విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ కో కన్వీనర్ సుభాన్ అన్నారు. శనివారం విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల నుంచి విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్న యజమాన్యం ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికులను బెదిరింపులకు గుర్తిస్తుందని ఆయన తెలిపారు . రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు విద్యుత్ ఆర్టిజర్ ఎంప్లాయిస్ చలో పాల్వంచ కార్యక్రమానికి వెళ్తున్న ఆర్టిజన్ కార్మికులను అక్కడికక్కడే చెక్ పోస్టు పెట్టి మధ్యలో పోలీసులు అరెస్టులు చేశారు. దీన్ని తీరంగా ఖండిస్తున్నామన్నారు. తమకు ఏపీ ఎస్ఈబి సర్వీస్ రూల్స్ వచ్చేంతవరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి సమస్యలు పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2026 పీఆర్సీ అమలు చేయాలన్నారు. తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు, మహేష్ కుమార్, బుచ్చిరెడ్డి, అక్తర్ అలి, బాల్ రాజు, వెంకటయ్య ,అశోక్, కిరణ్, సురేష్, ప్రసాద్, రాజ్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి, సురేష్, విజయ్ పాల్గొన్నారు.




# సజావుగా పదో తరగతి మూల్యాంకనం

**డీఈవో రమేష్ కుమార్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** జిల్లాలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం సజావుగా, పారదర్శకంగా కొనసాగుతోందని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మూల్యాంకన కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈనెల 1 నుండి కొనసాగుతున్న ఈ ప్రక్రియలో భాగంగా వివిధ సబ్జెక్టులకు సంబంధించిన జవాబు పత్రాల పరిశీలనను నిశితంగా గమనించారు. మూల్యాంకనంలో పాల్గొంటున్న ఎగ్జామినర్ల పనితీరును సమీక్షించి, ఎలాంటి లోపాలు లేకుండా కోడింగ్, డీకోడింగ్ ప్రక్రియలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. మార్గదర్శకాల ప్రకారం మూల్యాంకనం జరగేలా పలు సూచనలు చేసిన ఆయన, కేంద్రంలో మౌలిక వసతులు, భద్రతా చర్యలు, రికార్డుల నిర్వహణ, మార్కుల నమోదు విధానాన్ని పరిశీలించారు. ఇప్పటివరకు జిల్లాలో 99,675 జవాబు పత్రాల మూల్యాంకనం పూర్తయ్యిందని తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్, హిందీ, గణితం సబ్జెక్టుల మూల్యాంకనం పూర్తయిందని, బయోసైన్స్ సబ్జెక్టుకు సంబంధించిన జవాబు పత్రాల డీకోడింగ్ ప్రక్రియ ప్రారంభమైనట్లు చెప్పారు.మొత్తం 1,36,291 జవాబు పత్రాలు జిల్లాకు అందాయని, ఈనెల 13న జరగనున్న సోషల్ సబ్జెక్టు పరీక్ష అనంతరం మిగిలిన పత్రాలు రానున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కురుమయ్య, రాజశేఖర్ రావు, లతదేవి, సత్యనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్ల శెట్టి తదితరులు పాల్గొన్నారు.



## కల్యాణం.. కమనీయం

స్వామివారి శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని, గోవింద క్షేత్రంలోని లక్ష్మీ గోదా సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మాస కళ్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.

– ముద్ర ప్రతినిధి, నాగర్‌కర్నూల్



## శనేశ్వర స్వామికి తిలతైల అభిషేకం

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:** శ్రీ పరాభవ నామ సంవత్సర చైత్ర కృష్ణ పక్ష నవమి సందర్భంగా శనివారం బీజినేపల్లి మండలం నంది వడ్డేమాన్ గ్రామంలోని శ్రీ శనేశ్వర స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో తిలతైల అభిషేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేద మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి. సుగుణమ్మ, కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరాచారి, పుల్లయ్య, అడ్వకేట్ వీరశేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ అర్చకులు శాంతికుమార్, ఉమమహేశ్వర్, సిబ్బంది గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.



## నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :** నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి తెలిపారు. శనివారం జడ్చర్ల నియోజకవర్గం లోని మిడ్జిల్ మండల ఎంపీడీవో కార్యాలయంలో 65 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జడ్చర్ల నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి, తండాలకు బీటి రోడ్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఐఐఐటీ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను మంజూరు చేయడం ద్వారా పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూన్ 23న మిడ్జిల్ మండల కేంద్రానికి రానున్నారని వెల్లడించారు. మిడ్జిల్, ఉర్కొండ మండలాల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులను సీఎం మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ తంగేళ్ల జ్యోతి, ఎమ్మార్వో పాల్గొన్నారు.



## రహదారులపై ఆక్రమణలను తొలగించండి

**ముద్ర, మల్కాజ్‌గిరి:** రహదారులపై ట్రాఫిక్‌కు ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉండేందుకు ఆక్రమణలను తొలగించాలని మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. నేరెడ్మెట్ వార్డ్ కార్యాలయం పరిసరాలు , వాయుపురి. లెక్షన్, ట్రాన్స్‌పోర్ట్ యూనిట్ వద్ద ఎంఎంసీ కమిషనర్, డీసీ, డీఈ, ఏఈ, టౌన్ ప్లానింగ్ అధికారులు, రామ్‌కీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. వర్షపు నీటి కాల్వ పైప్‌లైన్ పనులను పరిశీలించి, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. వాయుపురి సెకండరీ కలెక్షన్ యూనిట్‌లో పరిశుభ్రత, మౌలిక సదుపాయాల అభివృద్ధి సమర్థవంతమైన వ్యర్థ నిర్వహణపై తమ నిబద్ధతను అధికారులు పునరుద్ఘాటించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
ఆదివారం 12.04.2026
www.mudranews.in | @mudranews



**లేఆఫ్స్:**



నైపుణ్యాలను అప్‌డేట్ చేసుకోండి కొత్త టెక్నాలజీలు నేర్చుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలను పెంచుకో వచ్చు. మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా స్కిల్స్ పెంచుకోవాలి.

# ఏప్రిల్ అంటేనే మహనీయుల మాసం

**- సామాజిక అసమానతలు తొలగించడమే పూలే ఆశయం**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల:**
ఏప్రిల్ అంటేనే మహనీయుల మాసమని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జ్యోతిబా పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సంజయ్ కుమార్, కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి మంత్రి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. జ్యోతిబా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి మాట్లాడుతూ సామాజిక అసమానతలను తొలగించడమే పూలే ఆశయమని పేర్కొన్నారు. మహాత్మా జ్యోతి రావు పూలే విద్యా విప్లవానికి నాంది పలికారని కొనియాడారు. ఆయన మహిళల విద్యకు ప్రాధాన్యతనిస్తూ తొలి బాలికల పాఠశాలను స్థాపించారని గుర్తు చేశారు. సమాజంలోని అసమానతలను తొలగించడానికి ఎంతో శ్రమించారని తెలిపారు. అణగారిన వర్గాలకు సమాన హక్కులు కల్పించాలనే లక్ష్యంతో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. సమాజంలో సమానత్వం, విద్య, న్యాయం కోసం పూలే చేసిన కృషి ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గం తమ ప్రభుత్వానికి మార్గదర్శకమన్నారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తమ ప్రభుత్వం మహనీయుల జయంతుల వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గా అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్. లత, జగిత్యాల మున్సిపల్ చైర్ పర్సన్ సమిండ్ల వాణి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి జి. సునీత, జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఏవో కిషన్, మార్కెట్ కమిటీ చైర్మన్లు, కుల సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



**ముద్ర, కరీంనగర్:** స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో శనివారం అంబేద్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్ ను పలువురు నాయకులతో కలిసి కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 14న నిర్వహించే అంబేద్కర్ జయంతి ఉత్సవాల పోస్టర్ ను కలెక్టర్ చిత్ర మిశ్రా, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సూడా చైర్మన్ కోమటీ రెడ్డి నరేందర్ రెడ్డి, అల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం లో అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ సభాధ్యక్షుడు ఎలుక ఆంజనేయులు ,కార్యనిర్వహక అధ్యక్షుడు సుద్దాల లక్ష్మణ్, కాడే శంకర్, దామెర సత్యం, బోలుమల్ల సదానందం, ఈసరి రవికిరణ్, గంటల రేణుక, కొండ్రా స్వరూప, గోసికి అజయ్, గజ్జల ఆనంద రావు తదితరులు పాల్గొన్నారు.

## వారసత్వ సంబరాలు జిల్లాకు గర్వకారణం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** ఉమ్మడి ఆదిలాబాద్ ఖ్యాతిని వ్యాప్తి చేసేలా వారసత్వ సంబరాలు నిర్వహించటం జిల్లాకు గర్వకారణమని విశ్రాంత ఐఏఎస్ అధికారి పార్థసారథి అన్నారు. పట్టణంలో శనివారం 'వారసత్వ సంబురాలు' ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా చరిత్ర, వైద్య వృత్తి, సం స్కృతి, సాంప్రదాయాలపై జిల్లా రచయితలు రాసిన పలు పుస్తకాలను ఆవిష్కరించారు. అనంతరం వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రత్నకళ్యాణి, జిల్లా వైద్యులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులకు భూ పట్టాల పంపిణీ



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని పల్సి– బి తండా గిరిజన రైతులకు పదమూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యకు ఎట్టకేలకు పరిష్కారం లభించింది. కలెక్టర్ రాజర్షి షా చొరవతో రైతులకు భూ పట్టాలను అందజేశారు. ఫారెస్ట్, రెవెన్యూ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు, సర్వే నంబర్లలో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా పల్సి–బి తండాకు చెందిన సుమారు 9 మంది ఎస్టీ రైతులు పట్టాలు పొందలేదు. రైతులు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి సీసీఎల్ఏ అధికారులతో సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కలెక్టర్ పర్యవేక్షణలో 30 ఎకరాల భూ మిని అర్హులైన రైతులకు కేటాయించారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్, తహసీల్దార్ రాజ్‌మోహన్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచాలి




**బోథ్, ముద్ర:** రిమ్స్, మెడికల్ కళాశాల ప్రాంగణాల్లో సింథటిక్ డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల వినియోగంపై నిఘా ఉంచాలని కలెక్టర్ రాజర్షిషా హెచ్‌ఓడీలను ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో ఔషధ నియంత్రణ, హ్యాబిట్ ఫార్మింగ్ డ్రగ్స్ వినియోగంపై జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియం త్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని సూచించారు. రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, డీఎం హెచ్‌ఓ నరేందర్ రాథోడ్, డ్రగ్ ఇన్ స్పెక్టర్ శ్రీలత, ఎస్ఐ సం దీప్, మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## జ్యోతి బాపూలే సేవలు మరువలేనివి



**మహాదేవపూర్, ముద్ర:** బహుజనులకు జ్యోతి బాపూలే చేసిన సేవలు మరువలేనివని జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోటరాజు బాబు అన్నారు. మండల కేంద్రంలో శనివారం సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ అధ్యక్షతన జరిగిన పూలే జయంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సర్పంచ్ హసీ నా భాను, సహకార సంఘం మాజీ అధ్యక్షుడు చల్ల తిరుపతిరెడ్డి, ఉప సర్పంచ్ తుంగల శ్రీజ, పంచాయతీ కార్యదర్శి కల్పన, వార్డు సభ్యులు నల్లభాగ సమ్మయ్య, ఆస్రార్ ఖురేషి, మహమ్మద్ బిన్ అలీ, ఎండీ నయిమొద్దీన్, గడ్డం వెంకటేశ్వర స్వామి, మాజీ ఎంపీపీ రాణిబాయి, మాజీ ఎంపీటీసీ సుధాకర్, సహకార సంఘం మాజీ చైర్మన్ సల్ల తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమతుల్య ఆహారం అందజేయాలి



**కోరుట్ల, ముద్ర:**
గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు సమతుల్య ఆహారం అందజేయాలని మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి సూచించారు. పట్టణంలోని 14వ వార్డు భీమునిదుబ్బ అంగన్ వాడీ కేంద్రంలో శనివారం పోషణ పక్వడ కార్యక్రమంలో భాగంగా శిశువుల పోషణ పై, సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్, కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి హాజరై మాట్లాడారు. సమతుల్య ఆహారం అందిస్తేనే భవిష్యత్తులో రోగాలు దరి చేరవని సూచించారు. పోషకాహారం వల్ల కలిగే ఆరోగ్యం గురించి క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరుస్తున్నామని తెలిపారు. అంగన్ వాడీ కేంద్రాల్లో పిల్లలు బరువును ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేయాలని తెలిపారు. కౌమార దశలోని బాలికలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్. కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి ల చేతుల మీదుగా పిల్లలకు అన్నప్రాశన చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ కే. మణెమ్మ, సూపర్వైజర్ ఏ భారతి, అంగన్ వాడీటీచర్ రాజమణి. ఆర్ పీ బి. లక్ష్మి, కవిత పాల్గొన్నారు.

## డీసీసీ కార్యదర్శులుగా సుధాకర్, ప్రతాప్



**మహాదేవపూర్, ముద్ర:**
జయశంకర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఆకుతోట సుధాకర్, కార్యదర్శిగా మడక ప్రతాప్ నియామకమ య్యారు. ఈ సందర్భంగా వారు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పీసీసీ కార్యదర్శి శ్రీను బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కాగా వీరిని మండల కేంద్రంలో శనివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, కాంగ్రెస్ నాయకుడు కటకం అశోక్, సీసీ బ్యాంకు మాజీ చైర్మన్ చల్ల తిరుపతి, ఎనకపల్లి సర్పంచ్ లక్ష్మణ్, కుదురుపల్లి మాజీ సర్పంచ్ సమ్మయ్య, శివరాజు, మాజీ జెడ్పీటీసీ అరుణ శ్రీనివాస్ సన్మానించారు.

# పూలే స్ఫూర్తితో ముందుకు సాగుదాం

**- చదువుతో ఉన్నతంగా ఎదగాలి**

**- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**



**ముద్ర, కరీంనగర్:**
జ్ఞానమే వికాసమని చెప్పి బాలికల విద్య కోసం కృషి చేసిన మహాత్మా జ్యోతి బాపూలే స్ఫూర్తితో మనందరం ముందుకు సాగుదామని కలెక్టర్ చిత్రా మిశ్రా కోరారు. మహాత్మ జ్యోతిబాపూలే జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం జిల్లా కేంద్రంలోని శాతవాహన యూనివర్సిటీ వద్ద జ్యోతిబాపూలే విగ్రహానికి కలెక్టర్.. డీసీసీ అధ్యక్షుడు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీ కిరణ్, ఆర్డీవో మహేశ్వర్, మేయర్ శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తదితర ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో మహనీయులు జన్మించారని తెలిపారు. పూలే సమాజానికి అసమాన సేవలు అందించారని గుర్తు చేశారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం సాధ్యమన్నారు.

చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ 200 ఏళ్ల కిందటే అన్ని సమస్యలకు చదువే పరిష్కారమని పూలే నమ్మి బాలికల విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. పూలే స్ఫూర్తితో రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ సమాజంలో అంతరాలు తగ్గించేందుకు కృషి చేస్తుందని చెప్పారు. అందులో భాగంగా యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం కలిసి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ చదువుతోనే జ్ఞానం లభిస్తుందని తెలిపారు. తన భార్య సావిత్రిబాయి కి చదువు చెప్పి ఉపాధ్యాయురాలు చేసిన ఘనత ఆ మహనీయుడి సొంతమని గుర్తు చేశారు. మేయర్ శ్రీనివాస్ మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. డిప్యూటీ మేయర్ సునీల్ రావు మాట్లాడుతూ ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్న పూలే అన్నివర్గాల అభ్యున్నతికి కృషి చేశారని తెలిపారు. పలువురు పూలే జీవితం గురించి వివరించారు. అనంతరం అంబే ద్కర్, పూలే ఆలోచనలపై రచించిన పు స్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ నివారణలో యువత పాత్ర కీలకం

**-ఎమ్మెల్యే సత్యనారాయణ రావు**



**మహాదేవపూర్, ముద్ర:**
సమాజంలో డ్రగ్స్ నివారణలో యువత పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజా పాలన– ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ చౌక్ నుంచి అంబే ద్కర్ సర్కిల్ వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లా డారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడారు. అనంతరం 2 కే రన్ లో విజేతలకు ప్రశంస పత్రాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అం బాల శ్రీనివాస్, డీఎంహెచ్ ఓ డా.మధుసూదన్, డ్రగ్ ఇన్ స్పెక్టర్ పావని, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

**విద్యా వ్యాప్తికి కృషి చేసిన పూలే ..**

సమాజంలో , విద్యా విస్తరణకు అపార కృషి చేసిన మహ నీయుడు మహాత్మా జ్యోతి బాపూలే అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొని యాడారు. ఐడీఓసీ కార్యాలయంలో శనివారం మహాత్మా జ్యోతి బాపూలే జయం తి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడారు. జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ కోట రాజబాబు, మున్సిపల్ చైర్మన్ బుర్రా కొమురయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, బీసీ అభివృద్ధి అధికారి ఇందిర, బీసీ సంఘాల ప్రతినిధులు సత్యనారాయణ, తిరుమల చారి, భద్రయ్య, సంపత్, సతీష్, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి జ్యోతిబా పూలే




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన ఆశాజ్యోతి జ్యోతిబా పూలే అని నిర్మల్ ఆర్డీవో రత్నకల్యాణి కొనియాడారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం జ్యోతిబా పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జ్యోతిబా పూలే చూపిన మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్, డీఈవో భోజన్న, అసిస్టెంట్ బీసీ సంక్షేమ అధికారి సత్యనారాయణ, సంఘాల నాయకులు, పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
12.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



లేఆఫ్స్
నెట్‌వర్కింగ్‌ను బలోపేతం చేయండి మిత్రులు, పూర్వ సహోద్యోగులతో కనెక్ట్‌లో ఉండండి. చాలా ఉద్యోగ అవకాశాలు రిఫరెన్స్ ద్వారానే వస్తాయి.



# వసంతోత్సవం శోభాయమానం

- అంగరంగ వైభవంగా శ్రీ వారి నిత్య కళ్యాణోత్సవం
- జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** స్వర్ణగిరి దివ్యక్షేత్రంలో శ్రీ అష్టలక్ష్మి మండపంలో శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి పంచామృతములు, పసుపు, సుగంధ ద్రవ్యాలతో వేద మంత్రోచ్ఛారణలతో వసంతోత్సవ సేవను శోభాయ మానంగా అర్చక స్వాములు నిర్వహించారు. శనివారం కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించి శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవ లోక కళ్యాణం కోసం అర్చక స్వాములు శ్రీ సుదర్శన నారసింహ హవనంను నిర్వహించారు.

అర్చక స్వాములు స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని శ్రీవారి వైభవోత్సవ మండపంలో వేదమంత్రాలతో మంగళ ధ్వనుల మధ్య అంగరంగ వైభవంగా గావించారు. భక్తులు శ్రీ స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆనంద పరవశులైనారు. ఆలయంలో సుమారు 5000 మందికి పైగా భక్తులు నిత్యాన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సాయంత్రం శ్రీ స్వామి




వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.

అనంతరం శ్రీ వేంకటేశ్వర స్వామి వారు దేదీప్యమానంగా వెలుగుతున్న సహస్రదీప కాంతుల మధ్య ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణగిరి దివ్య



క్షేత్రంలో శనివారం సందర్భంగా జల నారాయణ స్వామి వారికి మంగళహారతులు సమర్పించారు.



# బలహీన వర్గాల ఆశాజ్యోతి పూలే

- ఎమ్మెల్యే మందుల సామేలు

**ముద్ర, తుంగతుర్తి:** బడుగు బలహీన వర్గాల ప్రజలకు హక్కులు కల్పించి, మహిళలకు విద్యాబోధన కల్పించిన ఘనత మహాత్మ జ్యోతిరావు పూలేనని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు అన్నారు. మహాత్మా జ్యోతి రావు పూలే 199వ జయంతి సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో... పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగింది. సమాజంలోని అసమానతలు తొలగించి, మహిళలకు ప్రత్యేకంగా విద్యా ఆవశ్యకతను తెలిపిన మహోన్నత మూర్తి అని కొనియాడారు. నేడు పేద ప్రజల అభ్యున్నతి కోసమే కాంగ్రెస్ పార్టీ అలుపెరగని కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలంతా సద్వినియోగం చేసుకొని అభివృద్ధికి రావాలని కోరారు. దేశ ప్రజలంతా జ్యోతి రావు పూలే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ల ఆశయ సాధనలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ మల్లెపాక సాయిబాబు. కలకోట్ల మల్లేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, సీనియర్ నాయకులు అన్నపర్తి జ్ఞాన సుందర్, మాజీ పిఎస్ చైర్మన్ గుడిపాటి సైదులు మండల పార్టీ అధ్యక్షులు దొంగరి గోవర్ధన్, పట్టణ కమిటీ అధ్యక్షులు ఉప్పుల రాంబాబు యాదవ్, మాచర్ల అనిల్, కొండా రాజు, చిలుకల వెంకన్న, దాసరి శ్రీనివాస్, నరసయ్య, తదితర నాయకులు పాల్గొన్నారు.

# పూలే ఆశయాలు సాధించాలి

**ముద్ర, మోత్కూర్:** కుల వ్యవస్థ నిర్మూలన కోసం, స్త్రీ విద్య కోసం నిరంతరం కృషి చేసిన గొప్ప సామాజిక వేత్త మహాత్మ జ్యోతిరావు పూలే అని మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని నేటి యువత ఆయన చూపిన దారిలో పయనించాలని స్థానిక ఎమ్మెల్యే మందుల సామెల్ అన్నారు. శనివారం పూలే 199వ జయంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య, మున్సిపల్ కమిషనర్ కే సతీష్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు,రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్



జి లక్ష్మి నరసింహ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పైల్ల సోమిరెడ్డి, , బీసీ సంఘం నాయకులు గుండగోని రామ చంద్రు గౌడ్ ,అవిశెట్టి అవిలి మల్లు, గడ్డం నరసింహ, బుర్ర శ్రీనివాస్ గౌడ్, బయ్యని రాజు, సింగిల్ విండో మాజీ చైర్మన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.




# అరైవ్ అలైవ్ లో భాగ్యస్వామ్యం కావాలి

**ముద్ర, యాదగిరిగుట్ట :** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అనుసంధానంగా రాష్ట్ర డిజిపి శివధర్ రెడ్డి ఆధ్వర్యంలో అరైవ్ అ లైవ్ క్యాంపెయిన్-2026 లోను ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. దీని భాగంగా యాదగిరి గుట్ట మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ శాఖలకు సంబంధించి అధికారులు, యాదగిరిగుట్ట మున్సిపాలిటీ చైర్మన్ కౌన్సిలర్లు, గ్రామ సర్పంచులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ఈనెల 13 నుండి 18 వరకు చేపట్టవలసిన కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సీసీ కెమెరాలు రోడ్ సేఫ్టీ విధానాల ప్రాముఖ్యతను అట్టి ప్రమాణాలను అందరూ తూచా తప్పకుండ పాటించాలని, మండల పరిధిలోని ఎటువంటి లా అండ్ ఆర్డర్ ఇబ్బందులు కలుగకుండా చూడాలని, సైబర్ క్రైమ్ డిజిటల్ అరెస్ట్ గురించి ప్రజలకు తెలియజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ వైస్ చైర్మన్ బరిగే రమ్య రామచందర్, టౌన్ సిఐ భాస్కర్ ట్రాఫిక్ సిఐ కృష్ణ ఎస్సై యాదయ్య సురేందర్ పాల్గొన్నారు.

# ఆదర్శనీయుడు పూలే

- ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

**ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :** పూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐ లయ్య అన్నారు. శనివారం మహాత్మ జ్యోతిబా పూలే జయంతి సందర్భంగా భువనగిరిలోని జగదేవ్ పూర్ చౌరస్తా వద్ద వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవిన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీవాణి,వైస్ చైర్మన్ మంజుల, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రేణుక బాబు రావు,గ్రంధాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ,ప్రజా ప్రతినిధులు, బిసి సంఘం సభ్యులతో పూలే విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విప్ మాట్లడుతూ.. మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయన్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే మహిళలకు ప్రభుత్వంకు



పెద్ద పీట వేసిందని, మహిళల లకు మహాలక్ష్మి పథకం తీసుకొని రావడం జరిగిందని అన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు మాట్లడుతూ సమాజంలో వివక్ష లేకుండా అందరికీ సమాన అవకాశాలు కల్పించడమే ఆయన ఆశయమని తెలిపారు. ఆయన ఆశయంతో మనమందరం ముందుకు వెళ్లాలన్నారు. అంతకంటే ముందు తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం మహనీయులను స్మరిస్తూ పాడిన పాటలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సాహితి, బి. సి కుల సంఘాల సభ్యులు,వివిధ కుల సంఘాల సభ్యులు, ప్రజా ప్రతి నిధులు పాల్గొన్నారు.




# 'ఎన్‌ఎంఎన్‌ఎస్'తో హాజరు నమోదు సులువు

- డీఆర్ డీఓ టి. నాగిరెడ్డి

**ముద్ర, ప్రతినిధి యాదాద్రి భువనగిరి :** ఎన్‌ఎంఎన్‌ఎస్ యాప్ తో కూలీల హాజరు నమోదు సులువవుతుందని డిఆర్ డిఓ టి.నాగిరెడ్డి అన్నారు. జిల్లాలోని వంగపల్లి రైతు వేదికలో 6 మండలాలు, మాస్కుంట రైతు వేదికలో 6 మండలాలు, చౌటుప్పల్ రైతు వేదికలలో 5 మండలాలకు సంబందించిన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నీకల్ అసిస్టెంట్లు , ఇంజనీరింగ్ కన్సల్టెంట్ లకు జరిగిన ఫేస్ అంతేంటికేషన్ యాప్ పై శిక్షణ ముగింపు కార్యక్రమంలో నాగిరెడ్డి మాట్లాడుతూయాప్ వినియోగంతో పనులలో పారదర్శకత పెరుగుతుందని, హాజరు నమోదు ప్రక్రియ మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. అందరు యాప్‌ను తప్పనిసరిగా ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డి ఆర్ డి ఓ సురేష్, ఏ పి డి నవీన్ పాల్గొన్నారు.



# బృందావన్ కాలువను సుందరీకరిస్తాం

- మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య

**ముద్ర, మోత్కూర్:** మోత్కూర్ మున్సిపాలిటీ లో ఉన్నటువంటి బృదావన కాలువను సుందరీకరణ చేస్తామని మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్న సోమ నర్సయ్య అన్నారు. శనివారం మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని బృందావన్ కాలువను వారు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు మందుల సామేల్ సహకారం తో బృదావన కాలువ ను సుందరికరణ చేస్తాం అని అన్నారు. ఈ కార్యక్రమం లో కౌన్సిలర్లు బిసు శ్రీకాంత్, పన్నాల శ్రీ విద్య శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలు జరగవు

- సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ

**ముద్ర, సూర్యాపేట:** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వారం రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా అరైవ్ అలైవ్ రోడ్డుభద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రతి వాహనదారు తప్పనిసరిగా డిఫెన్స్ డ్రైవింగ్ విధానాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. డిఫెన్స్ డ్రైవింగ్ అంటే మన తప్పు కాకపోయినా ఇతరుల తప్పులను ముందుగానే అంచనా వేసి జాగ్రత్తగా వాహనం నడపడం రోడ్డు ప్రమాదాలు నివారించడానికి ఇది చాలా ముఖ్యమైన నైపుణ్యమని ఇది ప్రతి డ్రైవర్ కలిగి ఉండాలని తెలిపారు. అరైవ్- అలైవ్ కార్యక్రమంలో భాగంగా గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాలు, గ్రామ సభలలో డిఫెన్స్ డ్రైవింగ్ పై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని,




కమిటీలు ఏర్పాటు చేసి నిరంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు, అందుకు ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని ఎస్పీ తెలిపారు.

ముఖ్యమైన అంశాలు:

వాహనం నడిపేటప్పుడు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ముందున్న వాహనంతో సురక్షిత దూరం పాటించాలని సూచించారు. వేగాన్ని నియంత్రణలో ఉంచాలని, మద్యం సేవించి వాహనం నడపకూడదని అన్నారు. మొబైల్ ఫోన్ ఉపయోగించకుండా డ్రైవింగ్ చేయాలని, ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువతే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యువత బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని కోరారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నివారించాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, ప్రతి ఒక్కరూ స్వీయ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకుని డ్రైవింగ్ చేయాలని సూచించారు.




# పూలే జీవితం అందరికీ ఆదర్శం

**ముద్ర, మోత్కూర్:** మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం మనందరికీ ఆదర్శమని ప్రజాభారతి పూర్వ అధ్యక్షులు దేవినేని అరవింద రాయుడు అన్నారు. జ్యోతిరావు పూలే 199వ జయంతిని పురస్కరించుకొని శనివారం మున్సిపల్ కేంద్రంలోని గ్రంథాలయ ఆవరణలో పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాభారతి పూర్వ ప్రధాన కార్యదర్శులు తొగిటి మనోహరా చారి, మర్రి జయ శ్రీ, ఉపాధ్యక్షులు ఇ రాంప్రసాద్, వారాల యాదగిరి, ఉప్పలయ్య, గాదె వెంకటేశ్వర్లు, మోత్కూరు సుజాత, బయ్యని రాజు తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాలను నియంత్రించాలి

- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ

**ముద్ర, ఖమ్మం:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా శనివారం ఔషధ నియంత్రణ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో "మాదకద్రవ్యాల నియంత్రణ, నిబంధనల బలోపేత దినోత్సవం" ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి పెండెం వెంట రమణ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఏప్రిల్ 6 వ తేదీ నుండి 11 వరకు నిర్వహించనున్న కార్యక్రమాలపై పద్మశాలి భవన్ లో అవగాహన సమావేశం నిర్వహించారు. సమాజాన్ని ఆరోగ్య విద్యా ప్రేరణ పెంపొందించామని ఆయన అన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాలకు నేటి యువత బానిసలై తమ ఉజ్జ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని అందువల్ల కుటుంబం, సమాజం పై ప్రభావం చూపుతుందని అన్నారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎండి, సైకియాటిస్ట్ డా వివా సవన్, పట్టణ సి.ఐ వెంకన్న, వికాస్ కాలేజ్ ప్రిన్సిపాల్ రమేశ్, డెమొ సంజీవ్ రెడ్డి, జిల్లా కెమిస్ట్ & డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అద్యక్షుడు యమ ప్రభాకర్, పట్టణ అద్యక్షుడు పెండెం విజయ్, ఫార్మాసూటికల్స్ అద్యక్షుడు ముషమ్ హరి, కృష్ణమూర్తి, ఉపేందర్, శ్రీనివాస్ రెడ్డి మరియు ప్రభుత్వ పారమెడికల్ కళాశాల వందన, చందన, తిరుమల, నిర్మల కళాశాలల సిబ్బంది పాల్గొన్నారు.

# ధాన్యం కేంద్రాలు ప్రారంభించాలి



**ముద్ర, మోత్కూరు:** కొనుగోలు కేంద్రాలు లేక రైతులు గత పదిహేను రోజులుగా ఇబ్బందలు పడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు అన్నారు. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కల్లాల్లో అరపోసి, కొనుగోలు కేంద్రాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి దాపురించిందని, మండలంలోని పిఏసిఎస్ ఐకేపీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం నిర్వహించే ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మోత్కూర్ మండలం పాలడుగు గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**లేఆఫ్స్ : ఇన్సూరెన్స్ కవరేజ్ చెక్ చేసుకోండి**

హెల్త్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కొనసాగాలి. ఉద్యోగం లేకపోయినా వైద్య ఖర్చులు భారీగా ఉండవచ్చు.




## అవినీతి అధికారులను వదిలిపెట్టం

- సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్ గౌడ్

**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**



అవినీతి అధికారులను ఎత్తు పెద్దవారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని సామాజిక కార్యకర్త గాదగోని చక్రధర్ గౌడ్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఓ విలువైన భూమి విషయంలో రికార్డుల నుంచి పేర్ల తొలగింపుపై సిద్దిపేట కలెక్టర్ కే. హైమావతి పై డీవోపీటీకి ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. అధికార పార్టీ నాయకులు, వారి అనుబంధ సంస్థలకు లాభం చేకూర్చేలా జిల్లా కలెక్టర్ వ్యవహరించి సామాన్యులకు అన్యాయం చేయడం హేయమైన చర్య అని అన్నారు. అధికార పార్టీ నాయకులు, అధికారులు కలిసి సామాన్యులకు అన్యాయం చేయాలని ప్రయత్నిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అధికార పార్టీ నాయకులను, అధికారులను చట్ట ప్రకారం ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి విధులు నిర్వర్తిస్తే చట్టపరంగా ఎదురయ్యే పరిణామాలకు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. భూ వివాదంలో బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని గాదగోని చక్రధర్ గౌడ్ పేర్కొన్నారు.

## కేదారినాథ్‌లో దక్షిణ భారత ఏకైక తెలుగు లంగర్

- శాశ్వత భవనం కోసం ప్రయత్నాలు
- 22 నుంచి యాత్ర ప్రారంభం
- కేదారినాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు మధుసూదన్




**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

మంచు కొండల్లోని కేదారినాథ్ వద్ద ఆరోసారి అన్నప్రసాదం అందించేందుకు ఈనెల 14న సరుకులతో కూడిన లారీని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు జెండా ఊపి ప్రారంభించనున్నట్లు కేదారినాథ్ అన్నదాన సేవా సమితి అధ్యక్షుడు చీకోటి మధుసూదన్ తెలిపారు. శనివారం దాస ఆంజనేయ దేవాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేదారినాథ్ దర్శనానికి వచ్చే భక్తులకు దక్షిణాది రుచులతో భోజనం అందించే ఏకైక తెలుగు లంగర్‌ను సిద్దిపేటకు చెందిన కేదారినాథ్ అన్నదాన సేవా సమితి ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గత ఐదు సంవత్సరాలుగా భక్తులకు భోజనంతో పాటు సమాచార కేంద్రం ద్వారా అవసరమైన సమాచారం, కొన్ని రకాల టాబ్లెట్లు అందిస్తూ తెలుగువారి ఆప్యాయతను పంచుతున్నామని తెలిపారు. ఈ నెల 14న స్థానిక శరభేశ్వర దేవాలయం వద్ద సాయంత్రం 4 గంటలకు శివపార్వతుల కళ్యాణం నిర్వహించి, సోన్‌ప్రయాగ్ వద్ద ఉన్న లంగర్‌కు సరుకులతో కూడిన లారీని పంపించనున్నట్లు తెలిపారు. గతంలో సోన్‌ప్రయాగ్ వద్ద మాత్రమే భోజనం అందించేవారని, ప్రస్తుతం కేదారినాథ్ ఆలయానికి సమీపంలో మరో లంగర్‌ను కూడా ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 4 గంటల నుంచి రాత్రి 1 గంట వరకు భక్తులకు ఆహారాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఉదయం టీ, బిస్కెట్లు, టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 110 మంది సభ్యుల సహకారంతో ఈ సేవ కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఈ నెల 14న జరిగే కార్యక్రమానికి హరీశ్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు హాజరవనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అయిత రత్నాకర్, పబ్లిక్ రిలేషన్స్ డా. మాంకాల నవీన్ కుమార్, ఉపాధ్యక్షులు కాచం కాశినాథ్, గంజి రాములు, జిల్లా శ్రీనివాస్, సహాయ కార్యదర్శులు నల్లా నాగరాజం, గుబ్బ లింగమూర్తి, సభ్యులు గంప శ్రీనివాస్, అయిత ప్రభాకర్, చొల్లేటి నాగభూషణం, చింత రాజేంద్రప్రసాద్, గట్టు తిరుపతి కిషోర్, కొండూరు శ్రీనివాస్, బెజుగామ సత్యనారాయణ, సోమ ఉమామహేశ్వర్, కుంచం కాశీనాథ్, రాజూరి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నిర్లక్ష్యంతో రైతులకు ఇబ్బందులు

- మార్కెట్ యార్డును సందర్శించిన సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు



**ముద్ర ప్రతినిధి, సిద్దిపేట:**

సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డును మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు సందర్శించారు. ఈ సందర్భంగా పొద్దుతిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజులుగా కొనుగోలు చేయడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మార్కెట్ యార్డును సందర్శించి సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు ఎందుకు చూపుతోందని ప్రశ్నించారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో జొన్న కొనుగోలు సెంటర్లు ప్రారంభించలేదని, వెంటనే వాటిని ప్రారంభించి మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. చాలా ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు పంటను తక్కువ ధరకు అమ్ముకొని నష్టపోతున్నారని పేర్కొన్నారు. పంట మార్పిడి చేయాలని ప్రభుత్వం సూచిస్తున్నప్పటికీ, రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనుగోలు చేసే పరిస్థితి లేదని మండిపడ్డారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. రైతులకు సమయానికి రైతు బంధు అందించాలని డిమాండ్ చేశారు. పూలే జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. బీసీ డిక్లరేషన్ పేరిట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీసీలను మోసం చేశారని ఆరోపించారు. కేసీఆర్ అన్ని కులవృత్తులను ప్రోత్సహించారని, ప్రస్తుత ప్రభుత్వం బీసీలను దగా చేసిందని విమర్శించారు. బీసీ విద్యార్థుల పీజీ రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధి

- కలెక్టర్ ప్రతిమా సింగ్

**ముద్ర ప్రతినిధి, మెదక్:**





పూలే స్ఫూర్తితో సమాజాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. శనివారం మెదక్ జిల్లా కేంద్రంలోని ధ్యాన్‌చంద్ చౌరస్తాలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు, వైస్ చైర్మన్ నరేష్, ప్రజాప్రతినిధులు, వివిధ కుల సంఘాల నాయకులతో కలిసి పూలే విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. మహాత్మా జ్యోతిరావు పూలే సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ, మహిళా సాధికారత కోసం చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు అందరికీ ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి గంగా కిషన్, టీఎన్జీవో అధ్యక్షుడు దొంత నరేందర్, కార్యదర్శి రాజ్‌కుమార్, వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు మేకల జయరాములు, ఉప్పల స్వామి, మాసాయిపేట మల్లేశం, బి. సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు తమ ఆటపాటలతో ఉత్తేజపరిచారు. మున్సిపల్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబా పూలే అని మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు అభివర్ణించారు. జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎం. గంగాధర్, కౌన్సిలర్లు హరిత, అరుణ, శివరామకృష్ణ, సంపత్, నర్సింలు, నాయకులు భూపతి రాజ్, సయ్యద్ ఉమర్, వెంకటనారాయణ, సిద్ధిరాములు, కృష్ణ, రాజు పాల్గొన్నారు.



**బీఆర్ఎస్ కార్యాలయంలో**

అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున గౌడ్ కొనియాడారు. శనివారం మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో పార్టీ శ్రేణులతో కలిసి పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జ్యోతిబా పూలే చూపిన మార్గంలో నడుస్తూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు బట్టి జగపతి, అకిరెడ్డి కృష్ణారెడ్డి, న్యాయవాది జీవన్ రావు, పట్టణ పార్టీ కన్వీనర్, కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు, కోకన్వీనర్లు కిష్టా గౌడ్, లింగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు దీపక్ కుమార్, గౌస్, పార్టీ నాయకులు ప్రభురెడ్డి, సురేందర్ గౌడ్, మాయ మల్లేశం, ఆర్.కే. శ్రీనివాస్, కిషోర్ కుమార్, చంద్రశేఖర్ గౌడ్, గట్టేష్, ఇస్మాయిల్, సునీల్, సంతోష్, సాయి కుమార్, బాలరాజు, నరేందర్, శంకర్, నవీన్, కనక చారి, కిరణ్, స్వామి నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.





# మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలి

- కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**




మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. శనివారం 'ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక' హెల్త్ వీక్‌లో భాగంగా డ్రగ్స్ కంట్రోల్, రెగ్యులేటరీ స్ట్రెంథనింగ్ డే సందర్భంగా యువతలో చైతన్యం నింపేందుకు మెదక్ జిల్లా కేంద్రంలోని రాందాస్ చౌరస్తా నుండి టీఎన్జీవో భవన్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని అదనపు కలెక్టర్ నగేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధికా ప్రారంభించారు. అనంతరం టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమా సింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల వినియోగాన్ని సమిష్టిగా అరికట్టాలని, విచ్చలవిడిగా డ్రగ్స్ వినియోగం చేయవద్దని సూచించారు. మెడికల్ షాపుల్లో విక్రయించే మందులకు తప్పనిసరిగా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉండాలని తెలిపారు. పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలన్నారు. సరదా, తాత్కాలిక ఉపశమనం కోసం డ్రగ్స్‌కు అలవాటు పడితే తీవ్ర పరిణామాలు ఎదురవుతాయని హెచ్చరించారు. అనారోగ్య సమస్యలతో జీవితం దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఈగల్ ఫోర్స్ ఏసీపీ శివ నాయుడు మాట్లాడుతూ, మాదకద్రవ్యాల విక్రయాలకు చట్టంలో కఠిన శిక్షలు ఉన్నాయని తెలిపారు. మెడికల్ షాపుల్లో మత్తు పదార్థాలు లభించినట్లయితే షాపులను మూసివేసి, 20 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష విధించబడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, జిల్లా వైద్యాధికారి శ్రీరామ్, డీసీహెచ్ శివదయాల్, డీఎస్పీ ప్రసన్నకుమార్, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజు, మెడికల్ షాప్ యజమానులు, ఫార్మసీ విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన ఫార్మసీ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.




**మత్తు పదార్థాల చికిత్స కేంద్రం ప్రారంభం..**

మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో మత్తు పదార్థాల చికిత్స కేంద్రాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారంభించారు. కేంద్రం పని విధానం, ల్యాబ్‌లు, కౌన్సిలింగ్ విభాగం, చికిత్స విధానాలపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, యువతను మత్తు పదార్థాల నుండి దూరంగా ఉంచాలని, చెడు వ్యసనాలకు గురైన వారికి తక్షణ చికిత్స అందించి సాధారణ జీవితానికి తీసుకురావాలని వైద్యులకు సూచించారు. మత్తు పదార్థాలకు బానిసైతే జీవితం చీకటి మార్గంలోకి దారితీస్తుందని హెచ్చరించారు. యువత చెడు అలవాట్లను దూరం పెట్టి సన్మార్గంలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీతా దేవి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీరామ్, డీసీహెచ్ డాక్టర్ శివదయాల్ తదితరులు పాల్గొన్నారు.




## నర్సింగ్ కళాశాలలో విద్యార్థినులకు పోటీలు

**ముద్ర న్యూస్ :**

ప్రపంచ ఆరోగ్య అవగాహన వారోత్సవాల్లో భాగంగా నస్రుల్లాబాద్ మండలం దుర్కి శివారులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో శనివారం విద్యార్థినులకు వివిధ పోటీలు నిర్వహించారు. 'మన ఔషధాలను కాపాడండి మన భవిష్యత్తును రక్షించండి' అంశంపై విద్యార్థినులు చక్కటి చిత్రాలు వేసి ప్రదర్శించారు. యాంటీ బయోటిక్స్ మందుల వాడకంతో కలిగే నష్టాలను చిత్రాలు వేసి చూపించారు. ప్రిన్సిపల్ అనీ ప్రణుతి, వైస్ ప్రిన్సిపల్ మెర్సీ, బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పోచారం ప్రత్యేక పూజలు

**ముద్ర న్యూస్**

బీర్కూర్ శివారులోని తెలంగాణ తిరుమల దేవస్థానాన్ని శనివారం ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. శ్రీవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులు ఎమ్మెల్యేతో ఫోటోలు దిగారు. సర్పంచులు అప్పారావు, దేవిసింగ్, ఆలయ కమిటీ సభ్యులు నర్సరాజు, సత్యనారాయణ, హన్మంతురావు, విఠల్, అర్చకులు నందకిషోర్, అభిషేక్ ఉన్నారు.

## పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి

**ముద్ర న్యూస్ :**

పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయాలని బీర్కూర్ సర్పంచి బోయిని శంకర్ అన్నారు. దామరంచలో శనివారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు టీకాల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు పాడి రైతులకు అవగాహన కల్పించారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**లేఆఫ్స్ : ఇన్సూరెన్స్ కవరేజ్ చెక్ చేసుకోండి**

హెల్త్ ఇన్సూరెన్స్ తప్పనిసరిగా కొనసాగాలి. ఉద్యోగం లేకపోయినా వైద్య ఖర్చులు భారీగా ఉండవచ్చు.



## ఫ్రెండ్లీగా మోదీ–రాహుల్..

- ఆత్మీయంగా ముచ్చటించిన మోదీ–రాహుల్
- విభేదాలు పక్కన పెట్టి కలిసి నవ్విన నేతలు
- పార్లమెంట్‌లో అరుదైన దృశ్యం



**ముద్ర డెస్క్:**

భారత రాజకీయాల్లో విభేదాలు తీవ్రంగా వ్యక్తమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో అందరినీ ఆశ్చర్యపరిచే అరుదైన దృశ్యం పార్లమెంట్ ప్రాంగణంలో ఆవిష్కృతమైంది. బద్ధ రాజకీయ ప్రత్యర్థులుగా భావించే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పరస్పరం చిరునవ్వులతో పలకరించుకుని, కాసేపు ఆత్మీయంగా ముచ్చటించడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకల సందర్భంగా చోటుచేసుకున్న ఈ సంఘటన రాజకీయ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగత గౌరవాన్ని కాపాడుకోవాలనే ప్రజాస్వామ్య స్ఫూర్తి ఈ సందర్భంలో ప్రతిఫలించిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**శత్రుత్వం నుంచి స్నేహపూర్వక సంభాషణ వైపు..**

గత దశాబ్ద కాలంగా భారత రాజకీయ పరిణామాలను పరిశీలిస్తే మోదీ, రాహుల్ గాంధీ మధ్య ఎక్కువగా మాటల యుద్ధాలే కనిపించాయి. సభలో విమర్శలు, బహిరంగ సభల్లో ఘాటు వ్యాఖ్యలతో వాతావరణం తరచూ ఉద్రిక్తంగా మారింది. అయితే తాజాగా జరిగిన ఈ కార్యక్రమంలో వీరిద్దరూ రాజకీయ విమర్శలకు దూరంగా ఉండి, పరస్పరం గౌరవంతో సరదాగా నవ్వుకుంటూ సంభాషించుకున్నారు. ఈ దృశ్యం సోషల్ మీడియాలో క్షణాల్లోనే వైరల్ అయింది. నెటిజన్లు దీనిని "ప్రజాస్వామ్యపు అందమైన దృశ్యం"గా అభివర్ణిస్తుండగా, విశ్లేషకులు దీన్ని ఆరోగ్యకరమైన సంప్రదాయంగా పేర్కొంటున్నారు.

## ముహూర్తం ఫిక్స్..

- జగిత్యాలలో 20న కేసీఆర్ బహిరంగ సభ
- అదే రోజు బీఆర్‌ఎస్‌లో చేరనున్న జీవన్ రెడ్డి
- సుమారు లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు



**ముద్ర ప్రతినిధి, జగిత్యాల :**

మాజీ మంత్రి జీవన్ రెడ్డి బీఆర్‌ఎస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఇటీవల జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 9న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి గులాబీ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఈ నెల 10న ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో జీవన్ రెడ్డి లంచ్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశం అనంతరం ఈ నెల 20న జగిత్యాలలో బీఆర్‌ఎస్ భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు సుమారు లక్ష మంది హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ బహిరంగ సభలోనే జీవన్ రెడ్డి లాంఛనంగా బీఆర్‌ఎస్‌లో చేరనున్నారు. ఈ సభతో రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్‌కు మంచి ఊపు వచ్చేలా గులాబీ బాస్ ప్రణాళిక రచించినట్లు ప్రచారం జరుగుతోంది.

**కేసీఆర్‌తోనే మార్పు సాధ్యం..**

బహిరంగ సభ స్థలాల పరిశీలన సందర్భంగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ తన శేష జీవితంలో కేసీఆర్‌తో కలిసి పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో మార్పు రావాలంటే కేసీఆర్ రావాలని, రేవంత్ రెడ్డి వెళ్లిపోవాలని వ్యాఖ్యానించారు. రెండున్నర సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

**పలు స్థలాల పరిశీలన..**

ఈ నెల 20న నిర్వహించనున్న భారీ బహిరంగ సభ కోసం శనివారం మాజీ మంత్రి జీవన్ రెడ్డితో కలిసి బీఆర్‌ఎస్ నాయకులు పలు స్థలాలను పరిశీలించారు. జగిత్యాలలోని ఎస్‌కేఎన్‌ఆర్ కళాశాల మైదానం, వివేకానంద మినీ స్టేడియం, మోతే రోడ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. వీటిలో మోతే రోడ్‌లోని ఖాళీ స్థలంలో సభ నిర్వహణకు దాదాపు ఖరారు చేసినట్లు సమాచారం. ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. రెండేళ్లలోనే రాష్ట్రం అస్తవ్యస్తంగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒక్కటినీ నెరవేర్చలేదన్నారు. జగిత్యాల సభతో ప్రభుత్వానికి కనువిప్పు కలిగిస్తామని తెలిపారు. జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్‌ఎస్‌కు మరింత బలం చేకూరుతుందన్నారు. ఈ భారీ సభకు కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. లక్ష మందితో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావా వసంత సురేష్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, లోక బాపురెడ్డి పాల్గొన్నారు.

## 2029 ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు

- 16 నుంచి 18 వరకు పార్లమెంట్ సమావేశాలు
- పార్టీలకతీతంగా 'నారీ శక్తి వందన్'కు మద్దతు ఇవ్వాలి
- మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

'నారీ శక్తి వందన్' అధినియమం ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలనే చిత్తశుద్ధితో ప్రధాని నరేంద్ర మోదీ ముందుకు వెళ్తున్నారని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ స్పష్టం చేశారు. 2029 సాధారణ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్ అమలు చేసే దిశగా ఈ నెల 16 నుంచి 18 వరకు పార్లమెంట్ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్నో ఏళ్లుగా ఎవరూ చేయని పనిని ప్రధాని మోదీ చేపట్టారని ప్రశంసించారు. శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆమె బిల్లు అమలు అయినప్పుడే దానికి సార్థకత ఉంటుందని తెలిపారు. పార్లమెంట్ సమావేశాల్లో అన్ని పార్టీల సభ్యులు పార్టీలకతీతంగా మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు సాధారణం కాదని, కోట్లాది మహిళల ఆశయమని పేర్కొన్నారు. కేంద్రం అమలు చేయనున్న ఈ బిల్లు దేశ రాజకీయాల్లో కొత్త దశకు నాంది పలుకుతుందని అభిప్రాయపడ్డారు. మహిళా రిజర్వేషన్ అమలు అనంతరం నియోజకవర్గాల పునర్విభజన జరిగితే పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 26కు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అందులో తెలంగాణ నుంచి 9 మంది మహిళా ఎంపీలు ఉండొచ్చని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 273 మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యే అవకాశముందని చెప్పారు. తెలంగాణ అసెంబ్లీ స్థానాలు 180కు పెరిగితే అందులో సుమారు 60 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉండే అవకాశం ఉంటుందన్నారు. 40 ఏళ్లుగా మహిళా సాధికారతపై మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ కనీసం ఇప్పుడైనా మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు.

**పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పు..**

కేంద్రంలో మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మహిళల ఆత్మగౌరవాన్ని పెంపొందించే పథకాలను అమలు చేస్తోందని డీకే అరుణ తెలిపారు. స్వచ్ఛ భారత్ కింద కోట్లాది గృహాల్లో మరుగుదొడ్ల నిర్మాణం, ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు, జనధన్ యోజన, ముద్ర రుణాల ద్వారా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు వివరించారు. 'వికసిత్ భారత్ 2027' లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, దేశ జీడీపీ పెరుగుదలలో మహిళల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.



మహిళా శక్తికి రాజకీయ శక్తి తోడైతే గ్రామీణ, రైతు, పేద కుటుంబాల్లో గుణాత్మక మార్పులు వస్తాయని అభిప్రాయపడ్డారు. ప్రత్యర్థులు రాజకీయ ప్రయోజనాల కోసం బిల్లును అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో కేసీఆర్ మాదిరిగా ఉత్తర, దక్షిణ రాష్ట్రాల మధ్య విభేదాలు రేపేలా వ్యాఖ్యలు చేసినట్లే ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి కూడా మాట్లాడుతున్నారని విమర్శించారు.



## చట్టసభల్లో బీసీ మహిళల ఉపకోటా కోసం ఉద్యమిస్తాం

- పూలే జయంతి వేడుకల్లో జాగృతి అధ్యక్షురాలు కవిత

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

బీసీ మహిళలకు చట్టసభల్లో ఉపకోటా దక్కే వరకు తెలంగాణ జాగృతి విశ్రాంతి తీసుకోదని ఆ సంస్థ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం బంజారాహిల్స్‌లోని జాగృతి కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన కవిత, చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు వచ్చినప్పటికీ అందులో బీసీ మహిళలకు ఉపకోటా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీ ఉపకోటా లేకపోవడం పాలకులకు భయం లేనట్టేనని వ్యాఖ్యానించారు. కేంద్రం వెన్నులో వణుకు పుట్టేలా జాగృతి ఉద్యమిస్తుందని పేర్కొంటూ, "పూలే మళ్లీ పుట్టారా అన్నట్లుగా ఈ పోరాటం కొనసాగుతుంది" అని అన్నారు. 16, 17, 18 తేదీల్లో మహిళా బిల్లుపై పార్లమెంట్‌లో చర్చ జరగనున్న నేపథ్యంలో తాను ఢిల్లీకి వెళ్లి అన్ని రాజకీయ పార్టీల నేతలతో చర్చలు జరుపుతానని వెల్లడించారు. ఎంపీల బలం ఉందని బిల్లును అలాగే ఆమోదిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు.

**ఆర్టిజన్లకు జాగృతి మద్దతు..**

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆర్టిజన్ల క్రమబద్ధీకరణకు జాగృతి పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు కవిత తెలిపారు. ఆర్టిజన్లపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం యత్నిస్తోందని, దీనికి నిరసనగా కొత్తగూడెంలో జరుగుతున్న ఆందోళనలో జాగృతి నాయకులు పాల్గొంటారని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టిజన్ల జీతాలను రూ.40 వేలకు పెంచడంలో జాగృతి కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు.

## సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

- హైదరాబాద్ వాసులకు సీపీ సజ్జనార్ సూచన

**ముద్ర, తెలంగాణ బ్యూరో:**

నీటి బిల్లుల పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై హైదరాబాద్ వాసులు అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సూచించారు. ప్రజల్లో భయాన్ని సృష్టించి, వారి వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతా వివరాలను సేకరించి డబ్బులు దోచుకునే ఇలాంటి మోసాలపై జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. ఎక్స్ వేదికగా స్పందించిన సీపీ, ఇటీవల హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డు (HMWSSB) పేరుతో నగరంలో సైబర్ మోసాలు జరుగుతున్నట్లు గుర్తించామని చెప్పారు. ఫోన్ లేదా మెసేజ్ ద్వారా వాటర్ బిల్లులు చెల్లించలేదని, చాలా రోజులుగా పెండింగ్‌లో ఉన్నాయని చెబుతూ, నీటి కనెక్షన్ కట్ చేస్తామని బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. అలాంటి కాల్స్, మెసేజ్‌లకు భయపడవద్దని సూచించారు. మొదట సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసి నీటి బిల్లు బకాయి ఉందని, వెంటనే చెల్లించకపోతే కనెక్షన్ నిలిపివేస్తామని బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ విధంగా ప్రజల్లో భయాన్ని కలిగించి ఒత్తిడి తీసుకువస్తున్నారని వివరించారు. ఆ తరువాత 'HMWSSB WATER BILL UPDATE.apk' అనే పేరుతో అనుమానాస్పద ఏపీకే లింక్‌ను పంపించి, దాన్ని డౌన్‌లోడ్ చేసి ఇన్‌స్టాల్ చేయాలని కోరుతున్నారని చెప్పారు. ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తే ఫోన్‌లోని వ్యక్తిగత సమాచారం మొత్తం సైబర్ నేరగాళ్లకు చేరుతుందని హెచ్చరించారు. ఇలాంటి నకిలీ ఏపీకే ఫైల్‌ను ఇన్‌స్టాల్ చేసిన వెంటనే ఫోన్ సైబర్ నేరగాళ్ల నియంత్రణలోకి వెళ్లిపోతుందని తెలిపారు. దీంతో క్షణాల్లోనే బ్యాంక్ ఖాతాలు ఖాళీ అయ్యే అవకాశం ఉందని చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఏపీకే ఫైళ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ఇన్‌స్టాల్ చేయకూడదని స్పష్టం చేశారు. నీటి బిల్లులు పెండింగ్‌లో ఉంటే కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా అధికారిక మొబైల్ యాప్‌ల ద్వారానే చెల్లించాలని సూచించారు. ఇలాంటి కాల్స్ వచ్చినప్పుడు వెంటనే స్పందించకుండా నేషనల్ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు కాల్ చేయడం లేదా cybercrime.gov.in పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సీపీ సజ్జనార్ తెలిపారు.

## ఒక్క క్లిక్ తో ఇంటర్ ఫలితాలు


- ఈ సారి వాట్సాప్ లో అందుబాటులో తెచ్చిన సర్కార్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాల విడుదలకు తెలంగాణ ఇంటర్ బోర్డు అన్ని ఏర్పాట్లు చేసింది. నేడు ఉదయం 11 గంటలకు నాంపల్లిలోని ఇంటర్ బోర్డు కార్యాలయంలో ఫలితాలను విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. ఫస్ట్ ఇయర్, సెకండియర్‌తో పాటు ఒకేషనల్ కోర్సుల ఫలితాలను ఒకేసారి విడుదల చేస్తున్నట్లు వెల్లడించింది. ఈ మేరకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డు ప్రాంగణంలో ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, విద్యాశాఖ కార్యదర్శి శ్రీమతి యోగితా రాణా ఈ ఫలితాలను విడుదల చేయనున్నారు. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్ సైట్ లో ఫలితాలను tgbie.cgg.gov.in, results.cgg.gov.in వెబ్ సైట్లో అందుబాటులో ఉంచారు.

**వాట్సాప్ లోనూ ఫలితాలు**

ఈసారి వాట్సాప్ ద్వారా కూడా ఈ ఫలితాలు తెలుసుకోవచ్చని తెలిపింది. విద్యార్థులు వారి హాల్ టికెట్ నంబర్‌లను ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే ఫలితాలను పొందవచ్చని వెల్లడించింది. విద్యార్థులు తమ ఇంటర్ రిజల్ట్స్‌ను నేరుగా తమ వాట్సాప్ ద్వారా పొందవచ్చని బోర్డు అధికారులు తెలిపారు. ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్ కోసం మీసేవా సెంటర్లు, ఇంటర్నెట్ సెంటర్లకు వెళ్లాల్సిన అవసరం లేకుండా.. వాట్సాప్‌లోనే తెలుసుకునేలా ఏర్పాటు చేసినట్లు తెలిపింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 ఫోన్ నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్' అని మెసేజ్ చేసి 'BIE Exam Result' అని టైప్ చేయడం ద్వారా ఇంటర్ విద్యార్థులు తమ రిజల్ట్స్‌ను చెక్ చేసుకోవచ్చని వెల్లడించింది.



## గ్లోబల్ సామర్థ్య కేంద్రాల ఏర్పాటుకు కేంద్రంగా హైదరాబాద్



- రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ప్రపంచంలోని ప్రముఖ ఫైనాన్స్ సంస్థలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జీసీసీలు) ఏర్పాటుకు హైదరాబాద్‌ను గమ్యస్థానంగా ఎంచుకుంటున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. నైపుణ్యాలతో కూడిన టాలెంట్ పూల్, అంతర్జాతీయ స్థాయి మౌలిక సదుపాయాలు, తక్కువ ట్రాఫిక్ సమస్యలు, అందుబాటులో ఉండే అద్దెలు వంటి అంశాలు ప్రముఖ కంపెనీలను ఆకర్షిస్తున్నాయని తెలిపారు. న్యూయార్క్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న పికో టెక్నాలజీ సంస్థ ప్రతినిధులు శనివారం బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబు, రోడ్లుభవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో భేటీ అయ్యారు. ఫైనాన్షియల్ మార్కెట్‌కు సంబంధించిన సేవలు అందించే పికో టెక్నాలజీ ఇండియా అనుబంధ సంస్థ ద్వారా హైదరాబాద్‌లో జీసీసీ ఏర్పాటు చేయడానికి ముందుకొచ్చింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు ఇక్కడి అవకాశాలు, మౌలిక వసతులపై మంత్రులతో చర్చించారు. స్పందించిన శ్రీధర్ బాబు, రానున్న 20 సంవత్సరాల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను మెరుగుపరచేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. బెంగళూరు, ముంబై నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఆఫీస్ స్థలాల ఆక్యుపెన్సీ 73 శాతం ఉందని, ముంబైలో అది 52 శాతం మాత్రమేనని చెప్పారు. ఆ నగరాల్లో ట్రాఫిక్, వాయు కాలుష్యం ప్రధాన సమస్యలుగా మారడంతో ఐటీ సంస్థలు, జీసీసీలు హైదరాబాద్‌కు తరలివస్తున్నాయన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డుకు 30 కిలోమీటర్ల వెలుపల రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. దానికి అనుబంధంగా రేడియల్ రోడ్లు కూడా ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రింగ్ రోడ్ల వెంట రైలు మార్గాన్ని కూడా ఏర్పాటు చేసి రవాణా సదుపాయాలను ప్రపంచంలోని ప్రముఖ నగరాలకు సరితూగేలా అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. హయత్‌నగర్-ఎల్బీనగర్ మధ్య డబుల్ డెక్కర్ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో పికో టెక్నాలజీ వ్యవస్థాపక సీఈఓ జారోడ్ యూస్టర్, పికో ఇండియా సీఈఓ హరి కోదండ రామన్, డైరెక్టర్ సీతారాం పాల్గొన్నారు.

### ఎలక్ట్రానిక్స్ తయారీలో 'గ్లోబల్ హబ్'గా తెలంగాణ

- కోటి టీవీల ఉత్పత్తి మైలురాయిని చేరుకున్న హైదరాబాద్ సంస్థ 'రేడియంట్'
- ప్రత్యేకంగా అభినందించిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

ఎలక్ట్రానిక్స్ తయారీలో ప్రపంచ స్థాయి కేంద్రం (గ్లోబల్ హబ్)గా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పునరుద్ఘాటించారు. కేవలం ఉత్పత్తుల అసెంబ్లింగ్‌కే పరిమితం కాకుండా, విడిభాగాల తయారీ నుంచి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం వరకు అవసరమైన పూర్తి స్థాయి 'ఎకోసిస్టమ్' అభివృద్ధికి కృషి చేస్తున్నామని తెలిపారు. శనివారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో కోటి (10 మిలియన్లు) టెలివిజన్ యూనిట్ల ఉత్పత్తి మైలురాయిని చేరుకున్న హైదరాబాద్‌కు చెందిన 'రేడియంట్ అప్లయన్సెస్ అండ్ ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్' ప్రతినిధులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. రేడియంట్ సంస్థ సాధించిన ఈ ఘనత తెలంగాణ పారిశ్రామిక ప్రగతికి నిదర్శనమన్నారు. దేశవ్యాప్తంగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తిని 2030 నాటికి 500 బిలియన్ డాలర్లకు చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా మారుతున్న ఎలక్ట్రానిక్స్ తయారీ రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. రాష్ట్రానికి కొత్త పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రెజల్యూట్ గ్రూప్ చైర్మన్ రమీందర్ సింగ్ సోయిన్, డైరెక్టర్ మణికందన్, లీగల్ అండ్ ఐపీఆర్ హెడ్ శుభజిత్ సాహా, అడ్మినిస్ట్రేషన్ హెడ్ నోయెల్ రాబిన్సన్ పాల్గొన్నారు.

లేఆఫ్స్ :రిజ్యూమ్ & ప్రొఫైల్ అప్డేట్ చేసుకోండి
LinkedIn, Naukri వంటి ప్లాట్‌ఫామ్‌లలో మీ ప్రొఫైల్‌ను అప్‌డేట్ చేయండి. ఇది త్వరగా అవకాశాలు పొందడంలో సహాయపడుతుంది.

# ఢీ అంటే ఢీ

### ఎంపీ అరుణ సవాల్ కు సిద్ధం

మక్తల్ నియోజకవర్గ అభివృద్ధి కి కేంద్రం ఎన్ని నిదులిచ్చిందో... రాష్ట్రం ఎన్ని ఇచ్చిందో అనే అంశం పై ఎంపీ డీకే అరుణ చేసిన సవాల్ కు చర్చించేందుకు సిద్ధమని రాష్ట్ర పశు సంవర్థక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటించారు. ఆత్మకూర్ లో చర్చిద్దామా, లేక అమరచింత లో చర్చిద్దామా స్థలం చెప్పాలని మంత్రి శ్రీహరి ప్రతి సవాల్ చేశారు. తాను భూమి పూజ చేసిన పనికి ఎంపీ భూమిపూజ చేస్తుంటే కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకున్నారని తెలిపారు. తాము రౌడీయిజం చేయమని, రౌడీయిజం చేసిందెవరో ప్రజలకు తెలుసని అన్నారు.

– మంత్రి వాకిటి శ్రీహరి

- మంత్రి వర్సెస్ ఎంపీ
- మంత్రి, ఎంపీల మధ్య ప్రోటోకాల్ వార్
- అమరచింత పెద్ద చెరువు సుందరీకరణ పనుల్లో ఇద్దరి మధ్య మాటల యుద్ధం
- జనవరి 23 న మంత్రి, ఏప్రిల్10 న ఎంపీ భూమిపూజ
- అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు
- కాంగ్రెస్, బీజేపీ నాయకుల మధ్య ఘర్షణ.. తోపులాట
- జిల్లా లో హాట్ టాపిక్

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**





అమరచింత పెద్ద చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా మంత్రి వాకిటి శ్రీహరి, ఎంపీ డీకే అరుణ మధ్య జరుగుతున్న మాటల యుద్ధం ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో హాట్ టాపిక్ గా మారింది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన అమృత్ పథకం లో భాగంగా ఈ చెరువు సుందరీకరణ పనులకు రూ. 3.5 కోట్లు మంజూరయ్యాయని బీజేపీ నేతల వాదన. ఈ పనుల ప్రారంభానికి ఈ ఏడాది జనవరి 23 న మక్తల్ ఎమ్మెల్యే, రాష్ట్ర పశు సంవర్థక, క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి భూమిపూజ చేశారు. ఈ పనుల ప్రారంభం సందర్భంగా ఎంపీకి సమాచారం లేదు. దీంతో బీజేపీ నాయకులు అప్పట్లో మంత్రిపై మండిపడ్డారు. తాము మళ్లీ ఈ నెల 10 న భూమిపూజ చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ సమయంలో చెరువు వద్దకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ఈ కార్యక్రమాన్ని అడ్డుకున్నారు. ఎంపీ డీకే అరుణతో వాగ్వాదానికి దిగారు. కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. మహిళా ఎంపీ అని చూడకుండా తనపై దాడి చేసేందుకు మంత్రి శ్రీహరి రౌడీ లను పంపారని డీకే అరుణ ఆరోపిస్తున్నారు. ప్రజాభివృద్ధి కోసం పాటు పడే సమయంలో గతంలో రాయలసీమ రౌడీలకే భయపడలేదనే అరుణ చేసిన కామెంట్ తో కాంగ్రెస్ కార్యకర్తలకు మరింత ఆగ్రహం తెప్పించింది. మమ్మల్ని రౌడీలతో పోలుస్తారా అంటూ డీకే అరుణపై మంత్రి శ్రీహరి మండిపడుతున్నారు. ఈ మక్తల్ నియోజకవర్గం నుంచి గతంలో కాంగ్రెస్ హయాంలో మంత్రిగా పని చేసిన డీకే అరుణ తండ్రి చిట్టెం నర్సిరెడ్డి, టీడీపీ హయాంలో మంత్రి గా ఉన్న ఎల్లారెడ్డి ఎన్నడూ ప్రోటోకాల్ విస్మరించలేదని, ఇదే కాకుండా వాళ్లు రౌడీయిజం చేయలేదని, ఏనాడు నియోజకవర్గం లో ఘర్షణ వాతావరణం కల్పించలేదని డీకే అరుణ అంటున్నారు. శ్రీహరి మంత్రి అయిన తరువాత ఈ నియోజకవర్గం లో ప్రోటోకాల్ పాటించడం లేదని, ఇది పద్ధతి కాదని నిలదీస్తే రౌడీ లతో బయపెడుతున్నారని అరుణ ఆరోపించారు. అరుణ మాటలకు మంత్రి శ్రీహరి ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేంద్ర ప్రభుత్వ నిధులు ఈ లోకసభ నియోజకవర్గానికి ఎన్ని తెచ్చారో ఎంపీ అరుణ చెప్పాలని, దీని పై ఎక్కడైనా తాను చర్చకు సిద్ధమని మంత్రి సవాల్ విసిరారు. చర్చకు స్థలం మీరు నిర్ణయించినా సరే.. ఒకవేళ మీరు నిర్ణయించ కుంటే తాము నిర్ణయం తీసుకుంటామనని, దీనికి మీరు సిద్ధంగా ఉండాలని మంత్రి సూచించారు. పైసా నిధులు కేంద్రం నుంచి రాబట్టని ఎంపీకి అభివృద్ధి పై మాట్లాడే హక్కులేదని మంత్రి మండిపడుతున్నారు. ఆమె ఎక్కడకు వెళ్లినా ఘర్షణ వాతావరణం సృష్టించి రాజకీయ పబ్బం గడుపుకుంటుందని మంత్రి విమర్శలు చేస్తున్నారు. గొడవలు సృష్టించడం మా నైజం కాదని, కానీ డీకే అరుణ కు గొడవలు సృష్టించడమే అలవాటుగా పెట్టుకున్నారని మంత్రి ఆరోపించారు. రౌడీ యిజం ఎవరు చేస్తారో ఉమ్మడి జిల్లా ప్రజలకు అంతా తెలుసని, నియోజకవర్గం అభివృద్ధి పై ప్రేమ ఉంటే ఇకనైనా కేంద్రం నుంచి నిధులు తేవాలని మంత్రి శ్రీహరి హితవు పలికారు. అమరచింత, ఆత్మకూర్ ప్రాంతాల్లో బ్రిడ్జి నిర్మాణం పనులను కూడా అరుణ అడ్డుకుంటుందని మంత్రి ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులతో నిర్మాణం చేస్తున్న బ్రిడ్జి పనులను కూడా ఆమె అడ్డుకుంటుందన్నారు. మంత్రి చేస్తున్న అభివృద్ధి ని అడ్డుకుంటున్నానని ఆయన భావిస్తే ఆత్మకూర్ చౌరస్తా లో అభివృద్ధి పై చర్చ కు సిద్ధమని, అందుకు మంత్రి సిద్ధంగా ఉండాలని అరుణ సవాల్ చేశారు. సరియైన ప్రాంతం లో బ్రిడ్జి నిర్మాణం పనులు చేస్తే ఎందుకు అడ్డుకుంటామని ఆమె ప్రశ్నిస్తున్నారు. మంత్రి బెదిరిస్తే బీజేపీ కార్యకర్తలు బయపడరని, రౌడీయిజం పక్కన పెట్టి అభివృద్ధి పై దృష్టి పెట్టాలని ఎంపీ హితవు పలికారు. ఈ చెరువు సుందరీకరణ పనుల్లో, బ్రిడ్జి నిర్మాణం పనుల్లో ఈ ఇద్దరి నేతలు ఢీ అంటే ఢీ అంటున్నారు. ఇద్దరి మధ్య మాటల యుద్ధం తారా స్థాయి కి చేరింది. ఈ లోక్‌సభ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నా ఇప్పటి వరకు కేంద్ర నిధులు ఒక్క రూపాయి కేటాయించలేదనే భావనలో ఈ ఏడు నియోజకవర్గాల కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉన్నారు. అన్నీ రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పనులు చేస్తున్నామని, ఈ పనుల్లో పాల్గొనేందుకు ఎంపీ కి ఏమి అవసరం ఉందని, అందుకే ఆమెకు ప్రోటోకాల్ పాటించవలసిన అవసరం లేదని ఎమ్మెల్యే లు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏది ఏమైనా మంత్రి శ్రీహరి, ఎంపీ డీకే అరుణ మధ్య మాటల యుద్ధం చర్చ నియాంశమైంది. మక్తల్ నియోజకవర్గం లో బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ నాయకుల మధ్య రగడ ఎంతవరకు సాగుతుందో వేచిచూడాలి.



## జ్యోతిరావు పూలేకు నివాళి

**ముద్ర, కాప్రా:**

మహాత్మ జ్యోతి రావు పూలే 199 వ జయంతి సందర్భంగా సైనిక్ పూరి లోని ఆయన విగ్రహానికి మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్, పల్లి ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, మాజీ జిహెచ్ఎంసి మేయర్ బొంతు రామ్మోహన్, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు పూలమాలలు వేసి, ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహాత్మా జ్యోతి రావు పూలే ఈ దేశానికి ఎనలేని సేవలు అందించారని అన్నారు. చదివే మన ఆర్థిక మూలాలకు కారణమని, చదువుకుంటే సామాజిక ఆర్థిక విధానాలలో ప్రజలు మార్పు చెందుతారని అన్నారు. బాల్యవివాహాలను వితంతు వివాహాలను, కుల నిర్మూలనను అరికట్టాలంటే, అందరం ఈ సంఘంలో కొన్ని సంస్కరణ చేయాలని దానికి అందరం కూడా నడుం బిగించాలని ముఖ్యంగా మహిళల అభ్యున్నతి చదువు వలన సాధ్యమని, సావిత్రిబాయి పూలే కు చదువులు నేర్పి మహిళలకు ఒక పాఠశాలను ఏర్పాటు చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## చిన్నంబావిలో మున్సిఫ్ కోర్టు ఏర్పాటుకు కృషి

- హైకోర్టు న్యాయమూర్తి తిరుమలా దేవి


**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

చిన్నంబావి మండలంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటు కోసం కృషి చేస్తానని హైకోర్టు న్యాయమూర్తి తిరుమలా దేవి హామీ ఇచ్చారు. శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కోర్టులో నిర్వహించిన జ్యూడిషియల్ ఆఫీసర్స్ కాన్ఫరెన్స్ లో వారు హాజరై పలు ముఖ్య అంశాలపై మాట్లాడారు. జిల్లాలో కోర్టుల పనితీరు సంతృప్తికరంగా ఉందని, పెండింగ్ కేసుల వేగవంత పరిష్కారంపై ప్రశంసించారు. జిల్లా జడ్జి రమాకాంత్ సేవలను అభినందించారు. న్యాయవాదుల సహకారంతో కేసుల త్వరితగతిన పరిష్కారం సాధ్యమైందన్నారు. అలాగే నాగర్ కర్నూల్ కోర్టు భవనానికి అదనపు అంతస్తు నిర్మాణం ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కల్వకుర్తి, అచ్చంపేటలో అదనపు కోర్టు భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయని, జిల్లాలో మరో సబ్ కోర్టు అవసరమని అభిప్రాయం వ్యక్తం చేశారు. కోర్టుల మౌలిక వసతుల అభివృద్ధికి హైకోర్టు నుంచి పూర్తి సహకారం అందుతుందని హామీ ఇచ్చారు. జిల్లా నుంచి ఎలాంటి కీలక సమస్యలు లేవని అడ్మినిస్ట్రేటివ్ జడ్జి తెలిపారు. ఈ సమావేశంలో పోక్సో స్పెషల్ జడ్జి నజీమా సుల్తానా సహా పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

## క్వాంటంతో అమరావతి అభివృద్ధి

- 14న క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీ ప్రారంభం
- పాజిటివ్ పాలిటిక్స్ తో పాజిటివ్ ఓట్లు
- పార్టీ కార్యకర్తల కోసం ఈ–3

**ముద్ర, అమరావతి:**



నాడు ఐటీతో హైదరాబాద్ ను అభివృద్ధి చేసినట్టే, నేడు క్వాంటంతో ఏపీని, అమరావతిని అభివృద్ధి చేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. శనివారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో కాఫీ కబుర్లు కార్యక్రమంలో భాగంగా క్లస్టర్ ఇంచార్జ్‌లతో సమావేశమై మాట్లాడారు. క్వాంటం కంప్యూటర్ పెట్టాలని మనం అనుకుంటే, ఆ కంప్యూటర్లు తయారు చేసేందుకు సంస్థలు ముందుకొచ్చాయని తెలిపారు. ఈ నెల 14న క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించుకుంటామని తెలిపారు. రాజకీయాలు, పరిపాలనలో గత పరిణామాలు, ప్రస్తుత సంక్షేమం, అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను కార్యకర్తలకు వివరించారు. క్షేత్ర స్థాయిలో వివిధ పథకాలు, కార్యక్రమాల అమలుపై నేతలు, కార్యకర్తల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకున్నారు. సోలార్ రూఫ్ టాప్ వినియోగం పై కార్యకర్తల అభిప్రాయాలు తీసుకున్నారు. జరుగుతున్న పరిణామాలను, ప్రత్యర్థి పార్టీ దుర్మార్గాలను సామాన్య కార్యకర్తలైనా మెరుగ్గా విశ్లేషించేలా అవగాహన పెంచుకోవాలన్నారు. స్వయంగా తామే సోలార్ రూఫ్ టాప్ వినియోగిస్తున్నామని ఆయన తెలిపారు. అయితే విద్యుత్ బిల్లుల భారం తగ్గిందని పలువురు కార్యకర్తలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. పార్టీ కార్యకర్తల ఆర్థిక బలోపేతానికి ఈ3 కార్యక్రమం అమలు చేస్తామని ప్రకటించారు. కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించడం ఈనాటిది కాదని, ఎన్టీఆర్ హయాం నుంచి శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. క్లీన్ అండ్ గ్రీన్ చేపట్టామని, క్లీన్ ఎనర్జీని ఎంకరేజ్ చేస్తున్నామని, క్లీన్ పాలిటిక్స్ కూడా చేస్తున్నామని అన్నారు. క్లీన్ పాలిటిక్స్ కు కేరాఫ్ అడ్రస్సుగా టీడీపీని నిలిపేలా కార్యకర్తలు పని చేయాలని అన్నారు. పాజిటివ్ పాలిటిక్స్ చేయాలని, పాజిటివ్ ఓట్లు పెంచుకోవాలని, గతానికంటే టీడీపీ ఓట్ బ్యాంక్ మరింత పెరగాలని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం పడుతున్న కష్టాన్ని కూడా ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. బీసీలకు రూ.20 వేలు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఇస్తున్నామని తెలిపారు. పీఎం కుసుమ్ కింద 2 కిలో వాట్ల వరకూ సబ్సిడీ వర్తిస్తుందన్నారు. విద్యుత్‌ను వినియోగించుకోగా మిలిగినదాన్ని గ్రిడ్‌కు విక్రయించవచ్చని, దాని ద్వారా ఆదాయం వస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను తొమ్మిది సార్లు పెంచి భారం వేసింది. కానీ కూటమి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీలను తగ్గిస్తోందని, ఇంకా తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. సమగ్ర నీటి నిర్వహణతో భూగర్భ జలాలు పెంచడంతో పాటు ప్రాజెక్టుల్లో నీరు నింపామని అన్నారు. మే 15న పంటలకు నీళ్లు ఇస్తామని, దామాషా ప్రకారం ప్రతీ కులానికి రాజకీయంగా ప్రాతినిధ్యం కల్పిస్తామని, నీతి నిజాయితీగా ఉంటేనే విలువగల రాజకీయాలు చేయగలుగుతామని అన్నారు. ప్రజలకు సేవ చేయడం కోసం రాజకీయాలు చేయాలి కాని, జీవనోపాధిగా రాజకీయాలను ఎంచుకోకూడదని అన్నారు. కార్యకర్తలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ఎథికల్ ఎకనమిక్ ఎంపవర్మెంట్ అనే వ్యవస్థను తెస్తామని తెలిపారు. కార్యకర్తలు ఆరోగ్యంగా ఉండాలని, రోజూ యోగా చేయాలని, యోగా ట్రైనర్స్ ద్వారా జిల్లాలో శిక్షణ ఇప్పిస్తామని కూడా తెలిపారు. అనంతరం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

## మా చమురు కొనండి

- ప్రపంచ దేశాలకు ట్రంప్ ఆఫర్

**ముద్ర, డెస్క్ :**



ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్‌ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరు దేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్, అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.

## పేట లో లాడ్జి పై పోలీసుల దాడులు

- అదుపులోకి నలుగురు మహిళలు

**ముద్ర, నారాయణపేట :**

జిల్లా కేంద్రంలోని మూన్ లైట్ డార్మెటరీ లాడ్జ్ లో అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు పక్కా సమాచారంతో నారాయణపేట పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి వ్యభిచారం నిర్వహిస్తున్న నలుగురు మహిళలను పట్టుకున్నారు. అలాగే లాడ్జ్ యజమాని బుగ్గేశ్వర్ పై కేసు నమోదు చేశారు. పట్టుబడిన మహిళలకు పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించి, వారికి అవసరమైన సహాయం అందించే చర్యలు చేపట్టారు. అనంతరం వారిని స్టేట్ హోమ్‌కు పంపిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నారాయణపేట సీఐ శివశంకర్, ఎస్సై వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సంతోష్, శిరీష గౌడ్, అర్చన పాల్గొన్నారు.



## డోర్నకల్–గద్వాల్ రైల్వే లైన్‌కు మంజూరు చేయాలి

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

డోర్నకల్-గద్వాల్ రైల్వే లైన్‌కు త్వరితగతిన ఆమోదం, మంజూరు చేయాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, న్యూఢిల్లీలో రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ప్రతిపాదితమైన ఈ ప్రాజెక్ట్ సుమారు 296 కిలోమీటర్ల మేర విస్తరించి ఉందని తెలిపారు. సూర్యాపేట, నల్గొండ, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల్ వంటి వెనుకబడిన ప్రాంతాలకు ఈ రైల్వే లైన్ ఎంతో కీలకమన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఇప్పటికే డీపీఆర్, సర్వే నివేదికలను సమర్పించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే ఆమోదం తెలపడంతో పాటు బడ్జెట్ కేటాయింపులు చేయాలని కోరారు. ఈ రైల్వే లైన్ ద్వారా ప్రాంతీయ అభివృద్ధి వేగవంతమవుతుందని, నిత్యావసర సరుకుల రవాణా సులభతరం అవుతుందని, అలాగే ఈ ప్రాంతాలు జాతీయ ప్రధాన స్రవంతితో అనుసంధానమవుతాయని ఎంపీ వివరించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల ప్రజల చిరకాల ఆశయాన్ని ఈ ప్రాజెక్ట్ నెరవేర్చుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
12.04.2026 ఆదివారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**లేఆఫ్స్ :మానసికంగా దృఢంగా ఉండండి**

లేఆఫ్ అనేది మీ సామర్థ్యానికి కొలమానం కాదు. పాజిటివ్‌గా ఆలోచిస్తూ ముందుకు సాగాలి.





### పంజాబ్‌కు తలనొప్పిగా
## మారిన స్టార్ బౌలర్

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
ఐపీఎల్ 2026లో పంజాబ్ కింగ్స్ మంచి ప్రదర్శనతో దూసుకెళ్తున్నప్పటికీ, జట్టులో ఓ కీలక బౌలర్ ఫామ్ మాత్రం ఆందోళన కలిగిస్తోంది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలో పంజాబ్ ఇప్పటివరకు ఓటమి చూడలేదు. కానీ స్టార్ పేసర్ అర్షదీప్ సింగ్ మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నాడు.

ఈ సీజన్‌లో ఇప్పటివరకు అర్షదీప్ కేవలం రెండు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అదే సమయంలో భారీగా పరుగులు సమర్పించడం జట్టుకు సమస్యగా మారింది. ముఖ్యంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో అతను నాలుగు ఓవర్లలో 50 పరుగులు ఇచ్చి విమర్శలు ఎదుర్కొన్నాడు.

అదే మ్యాచ్‌లో పవర్‌ప్లేలోనే రెండు ఓవర్లకు 33 పరుగులు ఇచ్చి, వరుస వైడ్‌లతో ఒత్తిడిని పెంచాడు. ఒక ఓవర్‌లో ఏకంగా 24 పరుగులు ఇవ్వడం అతని ఫామ్ ఎంత దారుణంగా ఉందో చూపిస్తోంది. మొత్తం నాలుగు మ్యాచ్‌ల్లో అతను 132 పరుగులు ఇచ్చి, ఎకానమీ 11 వద్ద ఉండడం గమనార్హం.

ఇంకా ఆందోళనకర విషయం ఏమిటంటే, గత కొన్ని మ్యాచ్‌లుగా పవర్‌ప్లేలో అర్షదీప్ వికెట్లు తీయలేకపోతున్నాడు. చివరి 10 మ్యాచ్‌లలో పవర్‌ప్లేలో ఒక్క వికెట్ కూడా తీసుకోకపోవడం జట్టుకు పెద్ద మైనస్‌గా మారింది.

కొత్త బంతితో వికెట్లు తీయడంలో పేరు తెచ్చుకున్న అర్షదీప్, ఈ సీజన్‌లో మాత్రం ఆ మ్యాజిక్ చూపించలేకపోతున్నాడు. రాబోయే మ్యాచ్‌ల్లో అతను ఫామ్‌లోకి రావడం పంజాబ్ కింగ్స్ విజయాలకు కీలకంగా మారనుంది.



## యమునా పడవ ప్రమాదం..

- **నల్ల బ్యాడ్జీలతో నివాళులర్పించిన పంజాబ్ కింగ్స్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఉత్తరప్రదేశ్‌లోని మథుర సమీపంలో యమునా నదిలో జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందిన వారికి పంజాబ్ కింగ్స్ ఆటగాళ్లు గౌరవంగా నివాళులర్పించారు. శనివారం న్యూ చండీగఢ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో వారు చేతికి నల్ల బ్యాండ్లు ధరించి బరిలోకి దిగారు.

ఈ ప్రమాదంలో మృతులలో ఎక్కువ మంది పంజాబ్‌కు చెందిన వారే కావడంతో ఫ్రాంచైజీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని పంజాబ్ కింగ్స్ తమ సోషల్ మీడియా ద్వారా తెలిపింది. ప్రమాదం వివరాల్లోకి వెళితే, పంజాబ్‌లోని లూథియానా ప్రాంతం నుంచి యాత్రికులు బృందావనానికి చేరుకుని యమునా నదిలో పడవ ప్రయాణానికి వెళ్లారు. అయితే నది మధ్యలో పడవ అదుపుతప్పి పాంటూన్ డ్యామ్‌ను ఢీకొని తిరగబడింది. ఈ ఘటనలో 10 మంది ప్రాణాలు కోల్పోగా, మరికొందరు గల్లంతయ్యారు. పలువురు గాయపడినట్లు సమాచారం. ఈ విషాద ఘటన క్రీడా ప్రపంచాన్నీ కలిచివేసింది. మ్యాచ్ సందర్భంగా బ్లాక్ బ్యాడ్జీలు ధరించడం ద్వారా పంజాబ్ జట్టు తమ సానుభూతిని తెలియజేసింది



## పవర్‌ప్లేలోనే సెంచరీ..

- **దుమ్మురేపిన ఎస్‌ఆర్‌హెచ్ ఓపెనర్లు**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026లో భాగంగా పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు అరుదైన రికార్డు సృష్టించారు. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ జట్టుకు ఓపెనర్లు అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ అద్భుతమైన ఆరంభాన్ని అందించారు.

పంజాబ్ బౌలర్లపై ఆరంభం నుంచే దూకుడు చూపించిన ఈ జోడీ, పవర్‌ప్లేలోనే బౌండరీల వర్షం కురిపించింది. కేవలం 6 ఓవర్లలోనే జట్టు స్కోరును 100 పరుగుల మార్క్ దాటించడం విశేషం. ముఖ్యంగా అభిషేక్ శర్మ తుఫాన్ ఇన్నింగ్స్ ఆడుతూ 20 బంతుల్లోనే 59 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 7 సిక్సర్లు, 5 ఫోర్లు ఉన్నాయి.

మరోవైపు ట్రావిస్ హెడ్ కూడా వేగంగా ఆడుతూ 14 బంతుల్లో 30 పరుగులు సాధించి కీలక సహకారం అందించాడు. వీరిద్దరి భాగస్వామ్యంతో పవర్‌ప్లే ముగిసే సరికి వికెట్ నష్టం లేకుండా 106 పరుగులు నమోదు చేయడం ఐపీఎల్ చరిత్రలో అరుదైన ఘట్టంగా నిలిచింది.

ముల్లాన్‌పూర్ మైదానంలో పంజాబ్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా, గ్రౌండ్ నలు మూలలా షాట్లు ఆడుతూ ఎస్‌ఆర్‌హెచ్ ఓపెనర్లు మ్యాచ్‌పై పూర్తి ఆధిపత్యం సాధించారు.

## జాన్సెన్ సూపర్ క్యాచ్..

- **ఇషాన్ ఇన్నింగ్స్‌కు బ్రేక్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**

ఐపీఎల్ 2026లో భాగంగా న్యూ చండీగఢ్‌లోని ముల్లన్‌పూర్ స్టేడియంలో పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఓ అద్భుత క్యాచ్ అందరి దృష్టిని ఆకర్షించింది. టాస్ గెలిచిన పంజాబ్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ 20 ఓవర్లలో 219 పరుగులు నమోదు చేసింది.

ఈ మ్యాచ్‌లో పంజాబ్ ఫాస్ట్ బౌలర్ మార్కో జాన్సెన్ తన ఫీల్డింగ్‌తో అందరినీ ఆశ్చర్యపరిచాడు. బౌండరీ లైన్ వద్ద అతను ఒంటిచేత్తో పట్టిన క్యాచ్ మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది.

ఇషాన్ కిషన్ క్రీజులో స్థిరపడిన తర్వాత పెద్ద ఇన్నింగ్స్ ఆడతాడని అనిపించింది. అయితే అర్షదీప్ సింగ్ వేసిన ఓవర్ చివరి బంతికి అతను కౌ కార్నర్ వైపు భారీ షాట్ ఆడాడు. అది సిక్సర్ అవుతుందని అనుకున్న సమయంలో జాన్సెన్ పరుగెత్తుకుంటూ వచ్చి అద్భుతంగా ఒంటిచేత్తో క్యాచ్ పట్టేశాడు.

ఈ క్యాచ్ చూసి ఆటగాళ్లే కాకుండా ప్రేక్షకులు కూడా ఆశ్చర్యపోయారు. 17 బంతుల్లో 27 పరుగులు చేసిన ఇషాన్ కిషన్ ఇన్నింగ్స్‌కు అక్కడే ముగింపు పడింది.

మొత్తానికి జాన్సెన్ అద్భుత ఫీల్డింగ్ మ్యాచ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది





## 220 కొట్టినా ఓటమా..?

- **సన్ రైజర్స్ హైదరాబాద్ కు ఇక కష్టమే**

**ముద్ర స్పోర్ట్స్ డెస్ :**

ఐపీఎల్ లో 220 స్కోర్ అంటే మామూలు విషయం కాదు. ఈ పరుగులను డిఫెండ్ చేసుకోవచ్చు. కానీ అదేం దరిద్రమో అర్థం కావడం లేదు.. సన్ రైజర్స్ బౌలర్లకు ఏమైందో తెలియడం లేదు. బ్యాటర్లు దుమ్మురేపినప్పటికీ.. బీభత్సంగా పరుగులు తీసినప్పటికీ బౌలర్లు చేతులెత్తయడంతో.. హైదరాబాద్ జట్టు ఈ ఐపీఎల్ లో మరో ఓటమిని మూట కట్టుకుంది. తద్వారా పాయింట్ల పట్టికలో మరింత అధమ స్థానానికి చేరుకుంది. న్యూ చండీగఢ్ వేదికగా పంజాబ్ జట్టుతో హైదరాబాద్ తలపడింది. ముందుగా బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు దూకుడుగా ఆడింది. ఏకంగా 220 పరుగుల లక్ష్యాన్ని పంజాబ్ జట్టు ముందు ఉంచింది. ఇంత భారీ స్కోరు చేసిన నేపథ్యంలో హైదరాబాద్ జట్టు గెలుస్తుందని అభిమానులు అంచనా వేశారు. కానీ పంజాబ్ బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్ల బౌలింగ్ మొత్తాన్ని ఊచకోత కోశారు. వికెట్ల సంగతి అలా ఉంచితే.. కనీసం పరుగులు ఆపడంలో కూడా హైదరాబాద్ బౌలర్లు ఏమాత్రం సత్తా చూపించలేకపోయారు. స్లాగ్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లు అద్భుతంగా బౌలింగ్ వేస్తే.. హైదరాబాద్ బౌలర్లు మాత్రం మొత్తానికి మొత్తమే చేతులెత్తేశారు.

హైదరాబాద్ విధించిన 220 పరుగుల భారీ స్కోరును కూడా పంజాబ్ ఫినిష్ చేసి పడేసింది. అది కూడా కేవలం 18.5 ఓవర్లలోనే పూర్తి చేయడం విశేషం. పంజాబ్ జట్టులో ప్రియాంష్ 57, ప్రభ్ సిమ్రాన్ సింగ్ 51 పరుగులు చేశారు. శ్రేయస్ అయ్యర్ (69*) కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్ల బౌలింగ్ మొత్తాన్ని తునాతునకలు చేశాడు. హైదరాబాద్ బౌలర్లలో శివంగ్ 3 వికెట్లు పడగొట్టాడు.. హర్ష్ దూబే ఒక వికెట్ సాధించాడు.

ఇక మిగతా బౌలర్లు దారుణంగా బౌలింగ్ వేశారు. వికెట్లు తీయడం కాదు కదా.. బ్యాట్ మీదికి బంతులు వేసి.. కొట్టుకోండి అన్నట్టుగా పంజాబ్ బౌలర్లకు అదిరిపోయే ఆఫర్ ఇచ్చారు. వచ్చిన అవకాశాన్ని పంజాబ్ బ్యాటర్లు అద్భుతంగా వినియోగించుకున్నారు. సరిగా వారం క్రితం సొంతమైదానంలో లక్నో జట్టుతో జరిగిన మ్యాచ్లో హైదరాబాద్ ఓడిపోయింది. బ్యాటింగ్ వైఫల్యం తో పాటు.. బౌలింగ్ లోపం కూడా స్పష్టంగా కనిపించింది. దీంతో సొంత మైదానంలో హైదరాబాద్ ఓడిపోయింది. పంజాబ్ జట్టుతో శనివారం జరిగిన మ్యాచ్లో భారీగా పరుగులు చేసినప్పటికీ.. ఆ లక్ష్యాన్ని కాపాడుకోలేకపోవడంతో హైదరాబాద్ జట్టు బౌలర్ల మీద విమర్శలు వస్తున్నాయి. ఒకరిద్దరు మినహా మిగతా బౌలర్లు అంతగా ప్రభావం చూపించలేకపోయారు. దీంతో వచ్చే మ్యాచ్ లోనైనా హైదరాబాద్ గెలవాలని.. సన్ రైజర్స్ అభిమానులు కోరుకుంటున్నారు.


## పాకిస్తాన్ పరువుపాయే..

- **తారిక్ పాజ్ బౌలింగ్ కు షాకిచ్చిన మిచెల్**

**ముద్ర స్పోర్ట్స్ డెస్క్ :**

పాకిస్తాన్ సూపర్ లీగ్ లో క్వెట్టా గ్లాడియేటర్స్.. రావల్పిండిస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ గల్లి క్రికెట్ ను తలపించింది.. క్వెట్టా గ్లాడియేటర్స్ బౌలర్ ఉస్మాన్ తారీక్ పాజ్ బౌలింగ్ యాక్షన్ తో బౌలింగ్ చేశాడు. దీనిపై స్ట్రైకర్ స్థానంలో ఉన్న న్యూజిలాండ్ బ్యాట్స్ మెన్ మిచెల్ షాక్ ఇచ్చాడు. రెండుసార్లు బంతి వేసే సమయానికి అతడు క్రీజ్ నుంచి తప్పుకున్నాడు. దీంతో తారీక్ అసహనం వ్యక్తం చేశాడు. ఈ నేపథ్యంలో అంపైర్ మిచెల్ వద్దకు వెళ్లి మాట్లాడాడు. తర్వాత మ్యాచ్ మళ్లీ ప్రారంభమైంది.

తారీక్ బౌలింగ్ పై చాలామంది బ్యాటర్లు అసహనం వ్యక్తం చేశారు. అతడు బంతిని పట్టుకొని వచ్చి కొద్దిసేపు ఆగి.. ఆ తర్వాత వేస్తున్నాడు. దీనివల్ల బ్యాటర్ బంతి గమనాన్ని అంచనా వేయలేక ఇబ్బంది పడుతున్నాడు. ఇలా అనేక పర్యాయాలు జరిగాయి. అయినప్పటికీ తారిక్ తన వ్యవహార శైలి మార్చుకోవడం లేదు.. తాజాగా పాకిస్తాన్ సూపర్ లీగ్ లో కూడా ఈ ఉదంతం జరిగింది.. తారిక్, మిచెల్ మధ్య జరిగిన ఈ వ్యవహారం ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా సర్కులేట్ అవుతోంది.



## ప్రాక్టీస్‌లో నాగిన్ డ్యాన్స్..


- **మ్యాచ్‌లో మాత్రం కోహ్లీ సైలెంట్**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్‌కు ముందు ఆర్‌సిబి స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ మైదానంలో సరదాగా గడిపాడు. ప్రాక్టీస్ సెషన్‌లో భాగంగా వార్మప్ చేస్తూ అకస్మాత్తుగా నాగిన్ డ్యాన్స్ స్టెప్స్ వేయడం అభిమానులను ఆకట్టుకుంది. స్టాండ్స్‌లో ఉన్న ప్రేక్షకులు కోహ్లీ స్టెప్స్ చూసి కేరింతలు కొట్టారు.

అయితే మ్యాచ్‌లో మాత్రం కోహ్లీ బ్యాటింగ్ ఆశించిన స్థాయిలో రాణించలేదు. అతను 16 బంతుల్లో 32 పరుగులు మాత్రమే చేసి ఔటయ్యాడు. ఆర్‌సిబి జట్టు 20 ఓవర్లలో 201 పరుగులు చేసినప్పటికీ, ఆ స్కోర్‌ను కాపాడుకోలేకపోయింది.

రాజస్థాన్ రాయల్స్ తరపున వైభవ్ సూర్యవంశీ, ధ్రువ్ జూరెల్ అద్భుత అర్ధశతకాలతో మెరిసి జట్టును విజయపథంలో నడిపించారు. 202 పరుగుల లక్ష్యాన్ని రాజస్థాన్ 18 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి సులభంగా ఛేదించింది.

మొత్తానికి ప్రాక్టీస్‌లో కోహ్లీ వినోదం పంచగా, మ్యాచ్‌లో మాత్రం రాజస్థాన్ జట్టు ఆధిపత్యం చాటింది.



## వైభవ్‌కు కోహ్లీ ప్రశంసలు

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్ :**
రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ తన అద్భుత ఆటతో క్రికెట్ అభిమానులనే కాకుండా స్టార్ ఆటగాళ్ల ప్రశంసలు కూడా అందుకుంటున్నాడు. తాజాగా అతని ప్రదర్శనకు విరాట్ కోహ్లీ నుంచి ప్రత్యేక అభినందనలు రావడం విశేషంగా మారింది. పవర్‌ప్లేలోనే అనుభవజ్ఞులైన బౌలర్లపై దూకుడు చూపించిన వైభవ్, మ్యాచ్ దిశను పూర్తిగా మార్చేశాడు. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ వంటి బౌలర్లను ధైర్యంగా ఎదుర్కొంటూ అతను తన ప్రతిభను చాటుకున్నాడు. ప్రారంభంలోనే ఇచ్చిన మెరుపు ఆరంభం జట్టుకు విజయానికి బాటలు వేసింది.

మ్యాచ్ అనంతరం కోహ్లీని కలిసిన వైభవ్ ఆటోగ్రాఫ్ కోరగా, కోహ్లీ కేవలం సంతకం చేయడమే కాకుండా "ప్రియమైన వైభవ్, బాగా చేసావు" అంటూ అభినందన సందేశం రాశాడు. ఈ మాటలు యువ ఆటగాడికి మరింత ఉత్సాహాన్ని ఇచ్చాయి. 202 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ఈ మ్యాచ్‌లో వైభవ్ కీలక పాత్ర పోషించడంతో రాజస్థాన్ జట్టు సునాయాసంగా విజయం సాధించింది. వరుస విజయాలతో జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన్ని మరింత బలపరుచుకుంది. తాజా ఫామ్‌తో వైభవ్ ఆరెంజ్ క్యాప్‌ను కూడా కైవసం చేసుకుని, ఈ సీజన్‌లో అత్యంత ప్రమాదకర బ్యాటర్‌గా ఎదుగుతున్నాడు.



## లేఆఫ్స్ : ఆర్థిక ప్రణాళిక చేసుకోండి

భవిష్యత్తు కోసం సేవింగ్స్, ఇన్వెస్ట్మెంట్స్‌పై స్పష్టమైన ప్లాన్ ఉండాలి. ఆదాయం నిలిచినా జీవితం కొనసాగాలంటే ఇది అవసరం.



# రిలీజ్ డేట్లతో ఆటలొద్దు... పెద్ది

**ముద్ర, సినిమా డెస్క్ :**
మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా తెరకెక్కుతున్న 'పెద్ది' సినిమా విడుదల విషయంలో కొనసాగుతున్న అనిశ్చితి టాలీవుడ్‌లో చర్చకు దారి తీస్తోంది. ఇప్పటికే ప్రకటించిన తేదీకి సినిమా రాకపోవడం దాదాపు ఖాయం అయినప్పటికీ, మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాకపోవడం ఇండస్ట్రీ వర్గాల్లో అసంతృప్తిని కలిగిస్తోంది.

ఈ చిత్రం షూటింగ్ ఇంకా పూర్తి కాలేదని, అలాగే విజువల్ ఎఫెక్ట్స్ పనులు కూడా మిగిలి ఉన్నాయని సమాచారం. ముఖ్యంగా సెకండ్ హాఫ్‌కు సంబంధించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ పూర్తి కాలేదనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ముందుగా ప్రకటించిన తేదీకి విడుదల సాధ్యం కాకపోవడం స్పష్టంగా కనిపిస్తోంది.

అయినా కూడా సినిమా యూనిట్ నుంచి స్పష్టమైన అప్‌డేట్ లేకపోవడంతో ఇతర చిత్రాల నిర్మాతలు అయోమయంలో పడుతున్నారు. 'పెద్ది' కొత్త రిలీజ్ డేట్‌ను దృష్టిలో ఉంచుకుని తమ సినిమాలను షెడ్యూల్ చేయాలని అనుకున్నప్పటికీ, క్లారిటీ లేకపోవడం వల్ల ప్లాన్లు మారిపోతున్నాయి.

ఇప్పటికే కొన్ని సినిమాలు తమ విడుదల తేదీలను మార్చుకున్నాయి. మరికొన్ని చిత్రాలు కూడా 'పెద్ది' డేట్ కోసం ఎదురుచూస్తున్నాయి. కానీ మేకర్స్ నుంచి స్పష్టమైన నిర్ణయం రాకపోవడం వల్ల ఈ గందరగోళం మరింత పెరుగుతోంది. ఇండస్ట్రీలో పెద్ద సినిమాల విడుదల తేదీలు ఇతర చిత్రాలపై ప్రభావం చూపడం సహజమే. అందుకే కనీసం ప్రేక్షకులు, నిర్మాతలు ఇబ్బంది పడకుండా స్పష్టమైన తేదీని ముందుగానే ప్రకటించడం అవసరం. ఇకనైనా 'పెద్ది' టీమ్ స్పష్టత ఇవ్వాలని సినీ వర్గాలు కోరుకుంటున్నాయి.





# సైలెంట్ మోడ్‌లో విశ్వంభర..

- **తదుపరి చిత్రాలపై చిరు ఫోకస్**

**ముద్ర, సినిమా డెస్క్ :**
మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం తన కెరీర్‌ను ప్లాన్ చేసిన విధంగా ముందుకు తీసుకెళ్తున్నప్పటికీ, 'విశ్వంభర' సినిమా మాత్రం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోంది. భారీ అంచనాల మధ్య ప్రారంభమైన ఈ ఫాంటసీ ప్రాజెక్ట్‌పై ఇప్పటివరకు పెద్దగా అప్డేట్స్ లేకపోవడం గమనార్హం. దర్శకుడు వశిష్ట రూపొందిస్తున్న ఈ చిత్రంలో త్రిష, అషికా రంగనాథ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు పూర్తయినా, విజువల్ ఎఫెక్ట్స్ పనులు మాత్రం ఇంకా ముగియలేదు. అదే ఈ ప్రాజెక్ట్ ఆలస్యానికి ప్రధాన కారణంగా మారింది. ఇప్పటికే రెండు సంవత్సరాలుగా ఈ సినిమా తయారీలో ఉండగా, పలు సార్లు రీషూట్స్ కూడా జరిగాయి. అయినప్పటికీ ఫైనల్ అవుట్‌పుట్‌పై ఇంకా క్లారిటీ రాకపోవడంతో విడుదల తేదీ కూడా ప్రకటించలేని పరిస్థితి ఏర్పడింది.

ఈ నేపథ్యంలో చిరంజీవి 'విశ్వంభర'పై దృష్టి తగ్గించి, తన తదుపరి ప్రాజెక్టులపై ఎక్కువగా ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తోంది. దర్శకుడు బాబీతో మరో సినిమా, అలాగే శ్రీకాంత్ ఓదెలతో యాక్షన్ ప్రాజెక్ట్‌లను ముందుకు తీసుకెళ్తున్నారు.

ఫాంటసీ కథాంశంతో తెరకెక్కుతున్న 'విశ్వంభర' విషయంలో ముందస్తు ప్రణాళికలో లోపాలే ఈ ఆలస్యానికి కారణమని ఇండస్ట్రీలో చర్చ జరుగుతోంది. విజువల్ ఎఫెక్ట్స్ క్లియర్ అయ్యే వరకు ఈ సినిమా సైలెంట్ మోడ్‌లోనే కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మొత్తానికి 'విశ్వంభర' ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందో తెలియని పరిస్థితిలో, చిరంజీవి తన తర్వాతి సినిమాలపై దృష్టి పెట్టడం స్పష్టంగా కనిపిస్తోంది.

# సోషల్ మీడియాలో షాక్.. చిత్రాంగద ఖాతా హ్యాక్



ముద్ర, సినిమా డెస్క్ :
బాలీవుడ్ నటి చిత్రాంగద సింగ్ సోషల్ మీడియాలో సైబర్ దాడికి గురయ్యారు. ఆమె అధికారిక ఎక్స్ ఖాతా హ్యాక్ అయినట్లు స్వయంగా వెల్లడించారు. ఇన్‌స్టాగ్రామ్ ద్వారా స్పందించిన ఆమె, ఆ ఖాతా నుంచి వచ్చే లింకులు, మెసేజ్‌లను పట్టించుకోకూడదని అభిమానులను అప్రమత్తం చేశారు.

ఇటీవల సెలబ్రిటీల ఖాతాలను టార్గెట్ చేస్తున్న హ్యాకర్లు చిత్రాంగద అకౌంట్‌ను కూడా తమ ఆధీనంలోకి తీసుకోవడం ఆందోళన కలిగిస్తోంది. వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అయ్యే అవకాశం ఉందని ఆమె హెచ్చరించారు.

ఇక సినిమాల విషయానికి వస్తే, చిత్రాంగద ప్రస్తుతం సల్మాన్ ఖాన్ హీరోగా తెరకెక్కుతున్న 'మాతృభూమి' చిత్రంలో నటిస్తున్నారు. గల్వాన్ ఘటన ఆధారంగా రూపొందుతున్న ఈ సినిమాపై మంచి అంచనాలు ఉన్నాయి. అయితే కొన్ని సన్నివేశాల రీషూట్ కారణంగా విడుదల ఆలస్యం కావచ్చని సమాచారం.

## వెండితెరపై వెలగని తారగా సుబ్బలక్ష్మి

**ముద్ర, సినిమా డెస్క్ :**
నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమాపై రోజురోజుకీ ఆసక్తి పెరుగుతోంది. తాజాగా హీరోయిన్ కాయదు లోహర్ ఫస్ట్ లుక్ విడుదలతో ఈ సినిమాపై అంచనాలు మరింత ఎత్తుకు చేరాయి.

ఈ చిత్రంలో కాయదు 'సుబ్బలక్ష్మి' అనే పాత్రలో కనిపించబోతోంది. "వెండితెరపై వెలగని తార" అనే క్యాప్షన్‌తో విడుదలైన ఈ పోస్టర్ ఆమె పాత్రలోని భావోద్వేగ గాఢతను సూచిస్తోంది. సాధారణ మధ్యతరగతి యువతిగా, ఎంతో సహజమైన లుక్‌లో ఆమె కనిపించడం విశేషం.

పాతకాలపు దుస్తులు, సింపుల్ మేకప్‌తో సుబ్బలక్ష్మి పాత్ర నిజ జీవితానికి దగ్గరగా అనిపిస్తోంది. మరోవైపు నాని రగ్గడ్ మాస్ లుక్‌లో కనిపిస్తుండగా, ఆమె క్లాసీ లుక్‌తో మంచి కాంట్రాస్ట్ కనిపిస్తోంది. ఈ జంట కథలో కీలక మలుపులు తీసుకురాబోతున్నట్లు సినీ వర్గాల్లో చర్చ సాగుతోంది.

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తన సినిమాల్లో హీరోయిన్ పాత్రలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తాడనే విషయం తెలిసిందే. 'దసరా'లో ఆ ప్రభావం ఎలా ఉందో, 'ప్యారడైజ్'లో కూడా సుబ్బలక్ష్మి పాత్ర అంతే బలంగా ఉండబోతుందని సమాచారం. ఇక ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా, మోహన్ బాబు సహా పలువురు ప్రముఖులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 21న విడుదలకు సిద్ధమవుతోంది. ప్రేక్షకులను భావోద్వేగంగా కట్టిపడేసే కథతో ఈ సినిమా రానుందనే అంచనాలు నెలకొన్నాయి




# మరోసారి క్లాసిక్ లుక్‌లో కయాదు



ముద్ర, సినిమా డెస్క్ :
అందాల నటి కాయాదు లోహర్ మరోసారి తన క్లాసిక్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే ఈ బ్యూటీ, తాజాగా షేర్ చేసిన ఫోటోలతో ఆకర్షణగా నిలిచింది.

తెల్లటి చీరలో సంప్రదాయబద్ధంగా మెరిసిన కాయాదు, ఎలిగెంట్ స్టైల్‌తో ప్రత్యేకంగా కనిపించింది. పెద్ద ఇయర్ రింగ్స్, గాజులు, నుదుటిపై బొట్టు, సింపుల్ హెయిర్ స్టైల్‌తో ఆమె అందం మరింత హైలైట్ అయింది.

వివిధ యాంగిల్స్‌లో ఇచ్చిన స్టిల్స్‌లో ఆమె ఎంతో నాజూకుగా, క్లాసీగా కనిపించడంతో ఈ ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. కాయాదు ఈ లుక్‌తో మరోసారి తన స్టైల్, గ్రేస్‌ను నిరూపించుకుంది.

# బీచ్‌లో ప్రగ్యా అందాల విందు



**ముద్ర, సినిమా డెస్క్ :**
అందాల నటి ప్రగ్యా జైస్వాల్ బీచ్ వేదికగా మరోసారి తన గ్లామర్‌ను ప్రదర్శించింది. సముద్ర తీరంలోని సోయగాల మధ్య ఆమె మెరిసిన తీరు అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. సహజ సౌందర్యం, స్టైలిష్ లుక్ కలగలిపి ఆమె ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ ఫోటోల్లో ప్రగ్యా ఆకాశ నీలం రంగు బికినీ టాప్‌ను ధరించి, తెల్లటి పలుచని సారాంగ్‌ను నడుముకు సడలుగా కట్టుకుంది. సింపుల్ అయినా క్లాసీగా కనిపించే ఈ లుక్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేసింది. బీచ్ వాతావరణానికి తగ్గట్టు ఆమె ఎంపిక చేసిన డ్రెస్ స్టైలిష్‌గా కనిపిస్తోంది.

ఓవల్ సన్‌గ్లాసెస్, గోల్డ్ ఈరింగ్స్, సన్నని బ్రేస్‌లెట్‌తో ప్రగ్యా తన లుక్‌ను పూర్తి చేసింది. మినిమల్ యాక్సెసరీస్‌తోనే చిక్ అండ్ కూల్ వైబ్‌ను తీసుకొచ్చింది. ఆమె ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల నుంచి ప్రశంసలు అందుకుంటున్నాయి.

బీచ్ వెకేషన్‌ను ఆస్వాదిస్తూ, తన అందంతో మరోసారి ట్రెండ్ సెట్ చేస్తోంది ప్రగ్యా జైస్వాల్.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad500013.Published at H. No. 63569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com